

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

పారితోషికమంత్రా **వైట్‌లోనే!** 12




- నేను తీసుకునేదే తక్కువ.. అది కూడా ఆఫీసులోనే
- మిగతా వారి సంగతి తెలియదు: నటుడు వెంకటేశ్
- సోదాలు సాధారణమే: దర్శకుడు అనిల్ రావిపూడి
- సినీ ప్రముఖుల ఇళ్లలో కొనసాగిన ఐటీ తనిఖీలు
- దిల్ రాజు తల్లికి అస్వస్థత.. ఆస్పత్రికి తరలింపు

శుక్రవారం | 24-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 279 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: దశమి రా. 7.25 తదుపరి ఏకాదశి; నక్షత్రం: అనూరాధ పూర్తి; వర్జ్యం: ఉ. 9.28-11.12; దుర్ముహూర్తం: ఉ. 9.06-9.50, మ. 12.49-1.34; అమృతఘడియలు: రా. 7.52-9.36; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.02 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గదుల్లోనూ గోల్‌మాల్ గోవిందా!

'దర్శనం బాగా జరిగిందా? ఎక్కడ బస చేశారు?'... తిరుమలకు వెళ్లి వచ్చిన వారిని సర్వసాధారణంగా అడిగే ప్రశ్నలివి! కొండ మీద 'అకామిడేషన్'కు అంత గిరాకీ! అందులోనూ... కాటేజీలు, స్పెషల్ గెస్ట్‌హౌస్‌లకు మరింత డిమాండ్! వైసీపీ హయాంలో ఈ 'డిమాండ్'ను బాగా సొమ్ము చేసుకున్నారు. దాతల పేరుతో దండుకున్నారు! కొందరు దళారులు, సిబ్బంది కలిసి చేసిన ఈ దందా తాజాగా బయటికి వచ్చింది. గదుల విషయంలో గందరగోళం, ఉన్న వసతిని సమర్థంగా వినియోగించడంపై అదనపు కార్యనిర్వహణాధికారి వెంకయ్య చౌదరి దృష్టి సారించినప్పుడు ఈ కుంభకోణం బయటపడింది.



టీటీడీ కాటేజీలు, గెస్ట్‌హౌస్‌ల బుకింగ్‌లో స్కామ్
జగన్ జమానాలో భారీ కుంభకోణం



- దాతలకు ఏటా కొన్ని రోజులు ఉచిత వసతి
- 20 ఏళ్లు దాటితే డోనర్ల లేఖలు చెల్లవు
- అయినా... వారి పేరుతో నకిలీ లేఖల సృష్టి
- దళారులతో కొందరు సిబ్బంది కుమ్మక్కు
- ఆన్‌లైన్‌లో ఉచితంగా గదుల బుకింగ్
- భక్తుల నుంచి సొమ్ములు వసూలు
- ఐదేళ్లపాటు చెలరేగిన 'గదుల మాఫియా'
- 200కు పైగా కాటేజీల దుర్వినియోగం
- టీటీడీకి రూ. కోట్లలో నష్టం

కాదేదీ అవినీతికి అనర్హం! దోచుకునేందుకు, దాచుకునేందుకు ఏ చిన్న చాన్స్ దొరికినా దోపిడీనే! కొండలనైనా... కొండమీది దేవుడినైనా వదిలేదే లేదు! ఇదీ.. ఐదేళ్లపాటు జగన్ జమానా సాగిన తీరు! తిరుమలలో వైసీపీ పెద్దలు అడ్డగోలుగా దర్శనాలకు గేట్లెత్తగా.. దళారులు, సిబ్బందిలో కొందరు గదుల స్కామ్‌కు తెరలేపారు. ఐదేళ్లు అప్రతిహతంగా ఈ కుంభకోణం కొనసాగింది.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

తిరుమలలో డోనర్ కాటేజీలు, గెస్ట్‌హౌస్‌లు నిత్యం బుక్ అవుతున్నా... వాటి నుంచి ఆదాయం మాత్రం తగినంత రావడంలేదు! డోనర్ (దాత) స్కీమ్ కింద రూమ్‌లు బుక్ అవుతున్నట్లుగా రిజిస్టర్‌లో రాసేస్తున్నారు. దీనిపై లెక్కాపత్రం లేకుండా పోయింది. అదనపు కార్యనిర్వహణాధికారి వెంకయ్య చౌదరి ఈ అంశంపై దృష్టి సారించి... ఆరా తీయడంతో అసలు విషయం బయటపడింది. దాదాపు 200లకుపైగా కాటేజీలు, గెస్ట్‌హౌస్‌లను 'దాతల' పేరుతో బుక్ చేసి, వాటిని ఇతర భక్తులకు అద్దెకు ఇచ్చుకున్నట్లు వెల్లడైంది. ఐదేళ్లపాటు సాగిన

మిగతా 12వ పేజీలో...



దావోస్‌లో కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్‌ను సత్కరిస్తున్న మంత్రులు లోకేశ్, టీజీ భరత్

మళ్లీ ఏపీ బ్రాండ్

దావోస్ సదస్సులో బయటపడ్డ మన 'ఎనర్జీ'

- ఐటీ నుంచి ఏఐ వరకు.. డేటా సెంటర్ల నుంచి గ్రీన్ ఎనర్జీ, హైడ్రోజన్ హబ్ వరకు..
- ఏపీలోని విస్తృతమైన అవకాశాలపై ప్రచారం
- ఉపాధి కేంద్రంగా పెట్టుబడులకు ఆహ్వానం
- ఏపీలో సుదీర్ఘ తీరం.. అపార నైపుణ్య యువత
- దిగ్గజ కంపెనీలనూ మెప్పించిన సానుకూలతలు
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ వరుస భేటీలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

బ్రాండ్ ఏపీ నినాదంతో ముఖ్యమంత్రి చంద్రబాబు బృందం దావోస్ పర్యటన ప్రారంభించింది. టీమ్ ఇండియా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ తన యాత్రను ముగించింది. బిల్‌గేట్స్ నుంచి టాటా గ్రూపు చంద్రశేఖరన్ వరకు.. ఐటీ నుంచి ఏఐ వరకు.. వేగంగాను, విస్తృతంగాను పెట్టుబడుల వేట సాగింది. గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో

మిగతా 13వ పేజీలో...

కాగ్నిజెంట్ వస్తోంది!

- త్వరలోనే శుభవార్త: లోకేశ్
- దావోస్‌లో ఆ సంస్థ సీఈవోతో భేటీ
- టైర్ల యూనిట్ కోసం అపోలో టైర్స్ ఎండీ నీరజ్ కన్వర్‌కు ఆహ్వానం
- ఆర్‌ఈ పరికరాల పరిశ్రమ పెట్టాలని ఎన్విజన్ సీఈవోను కోరిన ఐటీ మంత్రి
- పుట్టినరోజునా లోకేశ్ వరుస భేటీలు

అటవీ శాఖ పచ్చగా కళకళలాడాలి

- ముందు వరుసలో నిలిపేలా పనిచేయాలి
- సమస్యల పరిష్కారంపై నివేదిక ఇవ్వండి
- అటవీ భూముల పరిరక్షణకు ప్రత్యేక డ్రైవ్
- ఎర్రచందనం అక్రమ రవాణాపై పటిష్ఠ నిఘా
- అటవీ ఉత్పత్తుల ఆదాయం పెంపుపై ప్రణాళిక
- అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలు
- సిబ్బంది కొరతను సీఎం దృష్టికి తీసుకెళ్తానని వెల్లడి



అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సత్వరమే నివేదిక సిద్ధం చేయాలని ఉపముఖ్యమంత్రి, ఆ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ గురువారం అధికారులను ఆదేశించారు. సమర్థత కలిగిన అధికార యంత్రాంగం ఉన్నా.. గత కొన్నేళ్లుగా అటవీ శాఖ సరైన ప్రగతి, మంచి ఫలితాలు సాధించలేకపోయిందని ఆయన గుర్తించారు. ఈ నేపథ్యంలో సమస్యలను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని అధికారులకు

మిగతా 11వ పేజీలో...



రూ.10 లక్షల వరకు ఐటీ లేదు?

- బడ్జెట్‌లో వేతన జీవులకు ఊరట!
- కొత్తగా 25% పన్ను శ్లాబ్ యోచన
- నిర్మల పరిశీలనలో ఉన్నట్టు కథనం

న్యూఢిల్లీ, జనవరి 23: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న 2025-26 బడ్జెట్‌లో వేతన జీవులకు భారీగా ఊరట కలిగించే అవకాశం ఉన్నట్టు తాజాగా ఓ కథనం వెలువడింది. వార్షిక ఆదాయం రూ.10 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇచ్చే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్టు ఒక ఆంగ్ల మేగజైన్ పేర్కొంది. ప్రస్తుతం స్టాండర్డ్ డిడక్షన్ రూ.75 వేలు ఉన్నందున రూ.7.75 లక్షల

మిగతా 2వ పేజీలో...



లాస్ ఏంజెలెస్‌లో మళ్లీ కార్చిచ్చు

వేలాది ఎకరాల్లోని చెట్లు, నివాస సముదాయాలు దగ్ధం 2

సిజేరియన్ చేయించుకునైనా.. కనేద్దాం! 2

- ఫిబ్రవరి 20 నుంచి జన్మతః పౌరసత్వ హక్కు రద్దు అమల్లోకి
- ఆలోపే పిల్లల్ని కనేందుకు ఆస్పత్రులకు క్యూ కడుతున్న భారతీయ దంపతులు

విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో మెడికల్ సైక్లోట్రాన్ 2

- రేడియో ఐసోటోప్‌ల తయారీకి ఏఈఆర్‌బీ అనుమతి
- తక్కువ ఖర్చుతో అందుబాటులోకి క్యాన్సర్ చికిత్స మరింత వేగవంతం

రీ సర్వేపై సందేహాలా?

8143679222కు ఫోన్ చేయండి 12



గురువారం విశాఖలో భారీ కేక్ కట్ చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, పంచకర్ల రమేష్, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు

ఘనంగా లోకేశ్ జన్మదిన వేడుకలు

- రాష్ట్రమంతా రక్తదాన శిబిరాలు.. 7,332 యూనిట్ల సమీకరణ
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో కేక్ కట్ చేసిన మంత్రి గొట్టిపాటి
- ఎల్లో సింహం పాటను ఆవిష్కరించిన పల్లా శ్రీనివాస్ 11
- విజయనగరంలో 27 మంది విభిన్న ప్రతిభావంతుల దత్తత
- ప్రకాశం జిల్లా వై.పాలెం హాస్టల్‌లో పుస్తకాలు, పెన్నుల పంపిణీ



డిసెంబరుకల్లా డయాఫ్రం వాల్ పూర్తి చేస్తాం

డయాఫ్రంవాల్ ప్రాంతంలో ట్రెంచ్ కటింగ్ పనులు పరిశీలిస్తున్న నిమ్మల

- ఇది సగం పూర్తికాగానే ఈసీఆర్‌ఎఫ్ డ్యాం మొదలు
- సమాంతరంగా పునరావాస కార్యక్రమాలు: నిమ్మల 13
- పోలవరం ప్రాంతంలో ప్లాస్టిక్ కాంక్రీటు పనులు ప్రారంభం



500 కోట్లు ఎక్కడ?

'లేఅవుట్ల'లో జనాన్ని ముంచిన జగన్!

క్రమబద్ధీకరణ పేరిట వసూలు చేసిన సొమ్ము ఏమైనట్టు?

- పట్టణవాసుల నుంచి వసూలు
- కోర్టు ఆదేశాలతో రెగ్యులరైజేషన్‌కు బ్రేక్
- చెల్లించిన ఫీజు వెనక్కి ఇవ్వని వైనం
- ఎక్కడ వాడారో చెప్పని వైసీపీ సర్కార్
- త్రిశంకు స్వర్గంలో మున్సిపల్ లేఅవుట్లు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత జగన్ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు తవ్వేకొద్దీ బయటపడుతూనే ఉన్నాయి. ప్రకృతి వనరులను దోచుకోవడమే గాక చివరకు ప్రజలను కూడా మోసం చేశారు. పట్టణాల్లో అనధికార లేఅవుట్ల రెగ్యులరైజేషన్ స్కీమ్ పేరిట రూ.500 కోట్లకు పైగా వసూలు చేశారు. ఆ సొమ్ము ఏమైందో తెలియడం లేదు. ఎక్కడెక్కడ ఖర్చు చేశారో లెక్కలు లేవు. పోనీ లేఅవుట్లనైనా క్రమబద్ధీకరించారా? అంటే అదీ లేదు. డబ్బులు వసూలు చేసి వదిలేశారు. దీంతో లేఅవుట్ యజమానులు, స్థలాలను కొన్నవారు లబోదిబోమంటున్నారు. టిడ్కో ఇళ్ల డిపాజిట్లు వెనక్కి చెల్లించకుండా పట్టణ పేదలను, ఎప్పుడో గత ప్రభుత్వాలు మంజూరు చేసిన ఇళ్లకు ఓటీఎస్ పేరిట

మిగతా 13వ పేజీలో...

టిడ్కో ఇళ్లలోనూ అదే మోసం

గత టీడీపీ ప్రభుత్వం చేపట్టిన టిడ్కో ఇళ్ల నిర్మాణాలను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. లబ్ధిదారులు చెల్లించిన డిపాజిట్లు వెనక్కి ఇస్తామంటూ ఆర్భాటాలు చేసి మోసం చేసింది. మూడు కేటగిరీల్లో ఇళ్ల నిర్మాణాలు ఉండగా.. ఒక కేటగిరీకి సంబంధించి ఇళ్లు ఉచితంగా ఇస్తామని చెప్పింది. అయితే లబ్ధిదారులు చెల్లించిన డిపాజిట్ రూ.500లు వెనక్కి ఇవ్వలేదు. అదేవిధంగా మరో కేటగిరీకి సంబంధించిన ఇళ్లకు రూ.1 లక్ష డిపాజిట్ చెల్లించిన లబ్ధిదారులకు తిరిగి రూ.50 వేలు వెనక్కి ఇస్తామని చెప్పి వారిని కూడా మోసం చేసింది. ఈ తప్పులన్నింటినీ సరిదిద్దాల్సిన బాధ్యత ఇప్పుడు కూటమి సర్కార్‌పై పడింది.

మార్చి 15 తర్వాతే ఎస్సీ వర్గీకరణపై నివేదిక!

మరో 45 రోజుల గడువు కోరిన ఏకసభ్య కమిషన్ 12

13 ఉమ్మడి జిల్లాల్లో పూర్తైన అభిప్రాయ సేకరణ.. 2024 కుల సర్వేపై పునఃసమీక్షకు నిర్ణయం



13

వైసీపీ వలలో పడొద్దు!

- 'డిప్యూటీ సీఎం' డిమాండ్లు పార్టీ క్రమశిక్షణ అతిక్రమణే
- కూటమి పార్టీల్లో విభేదాలకు కాలకేయులు ఎదురుచూస్తున్నారు
- అందరం అప్రమత్తంగా ఉండాలి
- టీడీపీ నేతలకు పల్లా పిలుపు

పార్టీలో బాబు తర్వాత లోకేశే

ప్రభుత్వంలో పదవులపై కూటమి నిర్ణయం: మంత్రి అచ్చెన్నాయుడు 11

గుంటూరు తూర్పు ఎమ్మెల్యేపై దాడి 12

- తమకు చెప్పకుండా వచ్చారంటూ నజీర్ అహ్మద్‌పై స్థానిక టీడీపీ నేతల ధ్వజం
- నేతాజీకి నివాళి కార్యక్రమంలో రభస
- పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

మావోయిస్టుల కుట్ర భగ్నం.. 50 కిలోల ఐఈడీ నిర్వీర్యం


ఐఈడీని పేల్చేసిన దృశ్యం

- కల్వర్ట్ కింద అమర్చిన నక్సల్స్
- గుర్తించిన సీఆర్పీఎఫ్.. మరో బాంబుతో పేల్చివేత
- సుకుమాలో భారీ డంప్ స్వాధీనం

చర్ల/చింతూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బీజాపూర్‌లోని ఓ రాష్ట్ర రహదారిపై భద్రతాబలగాలే టార్గెట్‌గా మావోయిస్టులు అమర్చిన భారీ ఐఈడీని సీఆర్పీఎఫ్ బాంబ్ స్క్వాడ్ నిర్వీర్యం చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. మావోయిస్టులు ఆవపల్లి-బసగూడ రాష్ట్ర రహదారిలో తిమ్మాపూర్ దుర్గ ఆలయం సమీపంలో ఓ కల్వర్టు కింద రిమోట్ కంట్రోల్‌తో పేల్చేలా 50 కిలోల ఐఈడీని అమర్చారు. సీఆర్పీఎఫ్ 168వ బెటాలియన్‌కు చెందిన బాంబ్‌స్క్వాడ్ బృందం గురువారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించింది. కల్వర్ట్ కింద కాంక్రీట్‌ను తొలగించి, ఓ బొరియగా మార్చి, అందులోనే ఐఈడీని అమర్చడంతో తొలగింపు సాధ్యం కాలేదని అధికారులు తెలిపారు. దాంతో.. మరో బాంబును పెట్టి.. ఆ ఐఈడీని పేల్చేసినట్లు తెలిపారు. దీని వల్ల కల్వర్ట్ దెబ్బతిన్నదని, మరమ్మతులు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. సుకుమా జిల్లా మెట్టగూడ-దూలేడ్ గుట్టల్లో మావోయిస్టులకు చెందిన భారీ డంప్ ను బలగాలు గుర్తించాయి. గ్యాస్ సిలిండర్లు, బీజీఎల్స్ తయారీ పరికరాలు, మందుపాతరలు, ఇతర పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు కోబ్రా, సీఆర్పీఎఫ్ బలగాలు వెల్లడించాయి.


సుకుమాలో సీజ్ చేసిన నక్సల్స్ డంప్



విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో మెడికల్ సైక్లోట్రాన్

- క్యాన్సర్ చికిత్స మరింత వేగవంతం

విశాఖపట్నం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వైద్య పరికరాల తయారీకి పేరొందిన విశాఖపట్నంలోని ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో మెడికల్ సైక్లోట్రాన్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. క్యాన్సర్ పరీక్షలకు, నివారణకు అవసరమైన రేడియో ఐసోటోప్‌ల వాణిజ్య తయారీకి అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు (ఏఈఆర్‌బీ) అనుమతి ఇచ్చింది. దీంతో ఇక్కడ వాటి ఉత్పత్తి ప్రారంభమైందని మెడ్‌టెక్ జోన్ మేనేజింగ్ డైరెక్టర్ జితేంద్ర శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో మాత్రమే ఈ సౌకర్యం అందుబాటులో ఉంది. విశాఖతో పాటు రాష్ట్రంలోని అనేక మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు పెట్-సీటీ స్కాన్, న్యూక్లియర్ మందుల తయారీకి అవసరమైన 18 ఎఫ్-ఎఫ్‌డీజీ, 68 జీఏ, 131ఎల్ వంటి ఐసోటోప్‌లను పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల నుంచి తెప్పించుకుంటున్నాయి. ఒక్కోసారి అవి రావడంలో ఆలస్యం కావడం, ధరలు పెరగడం వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలకు పరిష్కారంగా తక్కువ ఖర్చుతో వాటిని వీలైనంత త్వరగా మెడ్‌టెక్ జోన్ అందిస్తుందని జితేంద్రశర్మ పేర్కొన్నారు.

దావోస్‌లో మెరిసిన 'భారత్' బ్రాండ్!

దావోస్, జనవరి 23: దావోస్‌లో పెట్టుబడుల వేట ముగిసింది. టీమ్ ఇండియా స్ఫూర్తిని ప్రపంచ ఆర్థిక వేదికపై మన రాష్ట్రాలు ప్రదర్శించడం ఈసారి దావోస్ సదస్సు ప్రత్యేకం. మన దేశంనుంచి ఏపీ సహా ఆరు రాష్ట్రాలు ఈ సదస్సులో పాల్గొన్నాయి. కేంద్ర మంత్రుల బృందం కూడా హాజరయింది. యూరప్, అమెరికా సహా పలు ఖండాలు, దేశాల నుంచి పలు దిగ్గజ కంపెనీలు పాల్గొన్నారు. ఈ కంపెనీలతో వ్యవహరించేటప్పుడూ, సమావేశంల్లోనూ భారత్ ఏక్.. హమ్ ఏక్.. స్ఫూర్తిని మన రాష్ట్రాలు ప్రదర్శించాయి. టీడీపీ అధికారంలో ఉన్న ఏపీ, బీజేపీ పాలిస్తున్న మహారాష్ట్ర, కమ్యూనిస్టుల పాలనలోని కేరళ, డీఎంకే ఏలుబడిలోని తమిళనాడు బుధవారం రాత్రి జరిగిన సమావేశంలో ఒకే వేదికను పంచుకున్నాయి. దావోస్ సదస్సు ఈ నెల 20న మొదలై గురువారం ముగిసింది.

ధర్మ పరిరక్షణకు 'సనాతన బోర్డు'

- 27న మహాకుంభమేళాలో 'ధర్మ సభ' నిర్వహణ

మహాకుంభ్ నగర్, జనవరి 23: మహాకుంభమేళ సెక్టార్ 17లో 27జరగనున్న 'ధర్మసభ'లో 'సనాతన బోర్డు' రాజ్యాంగ ముసాయిదాను ప్రకటిస్తామని ప్రముఖ హిందూ ఆధ్యాత్మిక వేత్త దేవికానంద్ ఠాకూర్ వెల్లడించారు. గురువారం నిరంజని అఖాడాలో ఆయన మాట్లాడుతూ 'మన ధర్మానికి (మతం) స్వేచ్ఛ లేదు. మన ఆలయాలను ప్రభుత్వాలు నియంత్రిస్తున్నాయి. మన గురుకులాలను మూసివేస్తున్నారు. గోమాతలు వీధుల్లో తిరుగుతున్నాయి.. మన లక్ష్యాన్ని ముందుకు తీసుకుపోయేందుకు సనాతన బోర్డు అవసరం' అన్నారు. సనాతన బోర్డు ఏర్పాటు జరగకుండా కుంభమేళాను వదిలి వెళ్లేది లేదని స్పష్టం చేశారు. జునా అఖాడాకు చెందిన మహంత్ స్వామి యతీంద్రానంద్ గిరి, నిరంజని అఖాడా సీనియర్ మహామండలేశ్వర్, ఉజ్జయిని అర్జి హనుమాన్ ఆలయ మహంత్ స్వామి ప్రేమానంద్ పూరీ, ఆనంద్ అఖాడాకు చెందిన స్వామి బాలంకానంద గిరి మహారాజ్, పీఠాధీశ్వర్ పాల్గొన్నారు. కాగా, పది రోజులుగా కొనసాగుతున్న మహా కుంభమేళాలో త్రివేణి సంగమంలో పవిత్రస్నానాలు ఆచరించిన భక్తుల సంఖ్య గురువారం మధ్యాహ్నానికి 10 కోట్లు దాటిందని యూపీ ప్రభుత్వం ప్రకటించింది.

ఆర్ఆర్‌బీ దరఖాస్తుల ప్రక్రియ షురూ

- 32,438 పోస్టులు.. చివరి తేదీ ఫిబ్రవరి 22

న్యూఢిల్లీ, జనవరి 23: రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఆర్ఆర్‌బీ) ప్రకటించిన ఉద్యోగాలకు దరఖాస్తు ప్రక్రియ గురువారం మొదలైంది. సెంట్రల్ పే కమిషన్‌లో పేర్కొన్న లెవల్ 1 నుంచి లెవల్ 7 వరకు మొత్తం 32,438 పోస్టులు భర్తీ చేయనుంది. ఆర్ఆర్‌బీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా కేవలం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు చేయాల్సి ఉంటుంది. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ ఫిబ్రవరి 22. దరఖాస్తులో ఏవైనా సవరణలు చేయాలనుకుంటే అందుకు ఫిబ్రవరి 25 నుంచి మార్చి 6 వరకు అవకాశం కల్పించింది. ఫీజును ఇంటర్నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డులు, యూపీఐ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది.

5 లక్షల స్టడీ పర్మిట్ దరఖాస్తులకు ఆమోదం

- 2025కు పరిమితిని ప్రకటించిన కెనడా ప్రభుత్వం

ఒట్టావా, జనవరి 23: విదేశీ విద్యార్థులకు స్టడీ పర్మిట్లపై కెనడా ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. 2025 సంవత్సరానికి 5,05,162 దరఖాస్తులను ప్రాసెసింగ్ కోసం ఆమోదించాలని నిర్ణయించింది. పరిమితికి మించి వలసలు, శరణార్థులు, పౌరసత్వ శాఖ(ఐఆర్‌సీసీ)కు వచ్చే దరఖాస్తులను ఆమోదించబోమని, సదరు విద్యార్థులకు ఫీజు రీఫండ్ చేస్తామని తెలిపింది. ఈ మేరకు కెనడా-గెజిట్‌లో ఇటీవల నోటిఫికేషన్ ప్రచురించింది.

రామ్‌గోపాల్‌వర్మకు 3 నెలల జైలు శిక్ష

ముంబై, జనవరి 23: ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మకు మూడు నెలల జైలు శిక్ష పడింది. ఏడేళ్ల క్రితం నాటి చెక్కు బౌన్స్ కేసులో మహారాష్ట్రలోని అంధేరి మెజిస్ట్రేట్ కోర్టు.. వర్మను దోషిగా తేలుస్తూ తీర్పు వెలువరించింది. ఆయన విచారణలకు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నాన్‌బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఫిర్యాదుదారుకు పరిహారంగా రూ.3.72 లక్షలు చెల్లించాలని ఆదేశించింది. లేనిపక్షంలో మరో 3 నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. 2018లో మహేశ్‌చంద్ర మిశ్రా తరఫున శ్రీ అనే కంపెనీ వర్మ కంపెనీపై చెక్కు బౌన్స్ కేసు దాఖలు చేసింది.

ఓలా, ఉబెర్‌లకు కేంద్రం నోటీసులు

- ఐఫోన్, ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా వేర్వేరుగా రైడ్ చార్జీలు

న్యూఢిల్లీ, జనవరి 23: ఓలా, ఉబెర్ క్యాబ్ బుక్ చేస్తున్నారా? ఐఫోన్ ద్వారా రైడ్ బుక్ చేస్తే మీరు అధిక చార్జీలు చెల్లించుకోవాల్సి రావొచ్చు. అదే ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారానైతే ఈ బెడద తప్పుద్ది!! ఇలా ఒకే రూట్‌లో.. ఒకే సమయంలో రైడ్ బుక్ చేస్తే.. ఐఫోన్, ఆండ్రాయిడ్ ఫోన్ల వేర్వేరు చార్జీలు వసూలు చేయడంపై వినియోగదారులు మండిపడుతున్నారు. ఈ అంశమ్మీద ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కేంద్రం స్పందించింది. విభిన్న ఫోన్ల ద్వారా రైడ్ బుక్ చేస్తే వేర్వేరు చార్జీలు వసూలు చేయడంపై సమాధానం చెప్పాలంటూ ఓలా, ఉబెర్‌కు కేంద్ర వినియోగదారుల భద్రత సమాఖ్య (సీసీపీఏ) ద్వారా వినియోగదారుల వ్యవహారాల సమాఖ్య గురువారం నోటీసులు పంపింది. ఈ మేరకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు.

బీజేపీ సైద్ధాంతిక హామీలన్నీ నెరవేర్చాం

- ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేశాం: అమిత్ షా

అహ్మదాబాద్, జనవరి23: బీజేపీ సైద్ధాంతిక హామీలన్నింటినీ మోదీ ప్రభుత్వం నెరవేర్చిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. ఆర్టికల్ 370 రద్దు, రామ మందిర నిర్మాణం, ట్రిపుల్ తలాక్ రద్దు, ఉమ్మడి పౌరస్మృతి సహా హామీలన్నింటినీ నెరవేర్చామని ఆయన చెప్పారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన హిందూ ఆధ్యాత్మిక సేవా మేళాలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 70 ఏళ్లుగా ప్రభుత్వాలు ముట్టుకునేందుకు కూడా జంకిన హామీలన్నింటినీ మోదీ ప్రభుత్వం పదేళ్లలో పూర్తి చేయగలిగిందన్నారు. మూడో దఫాలోనూ మోదీ ప్రభుత్వం అదే దిశలో వెళ్తుందని చెప్పారు.

ఆపరేషన్ చేయించుకుని అయినా సరే.. ఆలోగా కనేద్దాం!

- ఫిబ్రవరి 20 నుంచి అమల్లోకి రానున్న జన్మతః పౌరసత్వ హక్కు రద్దు ఉత్తర్వు
- ఆలోపే పిల్లల్ని కనేందుకు ఆస్పత్రులకు క్యూ కడుతున్న భారతీయ దంపతులు
- సిజేరియన్ చేయించుకోవడానికి సిద్ధం



హైదరాబాద్, జనవరి 23: జన్మతః పౌరసత్వ హక్కును రద్దు చేస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వు నేపథ్యంలో.. ఆ దేశంలోని పలువురు భారతీయ గర్భిణులు మెటర్నిటీ క్లినిక్‌ల ముందు క్యూ కడుతున్నారు! డాక్టర్లు ఇచ్చిన డేట్ ప్రకారం మార్చిలో వారికి ప్రసవం జరగాల్సి ఉండగా.. ట్రంప్ ఉత్తర్వు ఫిబ్రవరి 20 నుంచి అమల్లోకి వస్తుండడంతో, ఆలోగానే శస్త్రచికిత్స (సిజేరియన్) ద్వారా పిల్లలను కనడానికి సిద్ధమవుతున్నారు!! అలా చాలా మంది దంపతులు సి-సెక్షన్ కోసం తమను సంప్రదించారంటూ అమెరికాలోని భారతీయ గైనకాలజిస్టులను ఉటంకిస్తూ ఒక ప్రముఖ ఆంగ్ల వార్తా సంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. ఆ కథనం ప్రకారం.. జనవరి 20న ట్రంప్ అధికారం చేపట్టగానే సంతకాలు చేసిన తొలి ఎనిమిది ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లలో ముఖ్యమైనది అమెరికా గడ్డపై పుట్టిన వారికి ఆటోమేటిగ్గా ఆ దేశ పౌరసత్వాన్ని కల్పించే హక్కును రద్దు చేస్తూ జారీ చేసి ఉత్తర్వు. అయితే, ఆ ఉత్తర్వును జారీ చేసిన 30 రోజుల తర్వాత పుట్టే వారికి మాత్రమే జన్మతః పౌరసత్వ హక్కు ఉండదని అందులో పేర్కొన్నారు. దీంతో ఫిబ్రవరి 19 దాకా అమెరికాలో పుట్టే ప్రతి ఒక్కరికీ బర్త్ రైట్ సిటిజెన్‌షిప్ లభిస్తుందన్నమాట. దీంతో.. ఆ తర్వాత బిడ్డను కనే అవకాశం ఉన్న భారతీయ దంపతులు చాలా మంది అక్కడున్న ఇండియన్-అమెరికన్ వైద్యులను సిజేరియన్ కోసం సంప్రదిస్తున్నట్టు ఆంగ్ల వార్తా సంస్థ తన కథనంలో పేర్కొంది. వారిలో చాలా మంది హెచ్-1బీ, ఎల్1 వీసాలపై అమెరికాకు వచ్చినవారు, గ్రీన్‌కార్డుల కోసం ఎన్నో ఏళ్ల క్రితమే దరఖాస్తు చేసుకున్నవారు ఉన్నారని.. ఆయా దంపతుల్లో ఏ ఒక్కరికీ అమెరికన్ పౌరసత్వం లేకపోవడంతో ఫిబ్రవరి 19 తర్వాత ప్రసవం అయితే, ఆ పుట్టే పిల్లలకు సైతం అమెరికన్ పౌరసత్వం రాదనే ఆందోళనతో వారు వైద్యులను సంప్రదిస్తున్నట్టు వివరించింది. తమ పిల్లలకు పౌరసత్వం వస్తే.. వారికి 21 ఏళ్లు వచ్చాక, అమెరికాలో వారితో కలిసి ఉండడానికి తమకు అవకాశం లభిస్తుందనే ఉద్దేశంతోనే వారు ఇలా చేస్తున్నట్టు వెల్లడించింది. ఆ కథనం ప్రకారం.. గడిచిన 2-3 రోజులుగా సి-సెక్షన్ ఆపరేషన్ల కోసం పెద్దసంఖ్యలో భారతీయ దంపతులు తనను సంప్రదిస్తున్నారంటూ న్యూజెర్సీకి చెందిన గైనకాలజిస్టు డాక్టర్ ఎస్‌డీ రమ తెలిపారు. ఏడో నెల గర్భంతో ఉన్న ఒక మహిళ తన భర్తతో సహా వచ్చి.. నెలలు నిండకముందే ఆపరేషన్ ద్వారా బిడ్డను కనడానికి సిద్ధమైందని ఆమె పేర్కొన్నారు. అయితే, ఇలా పౌరసత్వం కోసం నెలలు నిండకముందే సిజేరియన్ చేస్తే.. పుట్టే పిల్లలకు ఆరోగ్యపరంగా చాలా సమస్యలు ఎదురవుతాయని, వారి ఊపిరితిత్తులు పూర్తిగా అభివృద్ధి చెందవని, తక్కువ బరువు, నాడీ సంబంధిత సమస్యల వంటివి తలెత్తుతాయని టెక్సా్‌స‌కు చెందిన మరో భారత సంతతి వైద్యురాలు హెచ్చరించారు. ఇప్పటిదాకా తనను అలా 20 జంటలు సంప్రదించాయని.. వారందరికీ ఈ సమస్యల గురించి చెప్పానని ఆమె తెలిపారు. కాగా, అక్రమ వలసదారుల నిర్బంధానికి సంబంధించిన కీలక బిల్లుకు అమెరికా కాంగ్రెస్ ఆమోదం తెలిపింది. బుధవారం 263-156 ఓట్లతో ఈ బిల్లును ఆమోదించారు.

అక్రమ వలసదారులపై ఒప్పందం?

- గల్ఫ్ దేశాల తరహాలోనే అమెరికాతోనూ అవగాహన!
- తిరిగి వచ్చేవారిని స్వీకరించడానికి సుముఖమన్న జై శంకర్

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

వీసా గడువు.. అక్రమ నివాసం.. ఇప్పటివరకు గల్ఫ్ దేశాలలో మాత్రమే వినిపించిన ఈ మాటలు ఇకపై అమెరికా నుంచి కూడా ప్రతిధ్వనించనున్నాయి. ఇమ్మిగ్రేషన్ న్యాయ సహాయక కేంద్రాలు, వలసదారుల శిబిరాల కార్యకలాపాలను స్తంభింపజేయడంతో పాటు విదేశీ అక్రమ వలసదారులను నియంత్రించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వులతో ఈ పరిస్థితి తలెత్తనుంది. ఇటీవలి కాలం వరకు విదేశాలు తిప్పి పంపే భారతీయులను స్వీకరించడానికి గల్ఫ్ దేశాలతోనే ఒప్పందాలున్నాయి. పెద్ద దుమారం, రచ్చ తర్వాత 2021లో బ్రిటన్-భారత్ మధ్య కూడా అవగాహన కుదిరింది. ఇకపై అమెరికాతోనూ ఇదే బాటలో నడవడానికి భారత్ నిర్ణయించుకున్నట్లు విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రకటనతో స్పష్టమవుతోంది. దేశ ప్రతిష్ఠ, నిపుణులకు మెరుగైన ఉపాధి, విద్య అవకాశాల కోసం ఎక్కువగా వలస వెళ్లే దేశాల చట్టాలకు లోబడి వ్యవహరించాల్సి ఉంటుంది. గల్ఫ్ దేశాలతో ఈ రకమైన అవగాహన ఉంది. ప్రత్యేకించి సౌదీ అరేబియా చట్టాలను ఉల్లంఘించినందుకు తిప్పి పంపించే ప్రతి భారతీయుడి విమాన టికెట్ వ్యయాన్ని భరిస్తుంది. మరి అమెరికా ఇలాంటి ఖర్చును భరించడానికి ఎంతవరకు సిద్ధం అనేది తేలిన తర్వాతనే స్పష్టత వస్తుందనేది నిపుణుల అభిప్రాయం. మరోవైపు ట్రంప్ ఇమ్మిగ్రేషన్ నిర్ణయాలను అమలు చేస్తే.. నిబంధనలు ఉల్లంఘించి అమెరికాలో ఉంటున్న సుమారు 7.50 లక్షల మంది భారతీయులను దశలవారీగా తిప్పి పంపడం ఖాయంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అక్రమ వలసలను భారతదేశం ప్రోత్సహించదని, చట్టవిరుద్ధంగా నివసిస్తూ అమెరికా నుంచి తిరిగొచ్చే భారతీయులను స్వీకరించడానికి సిద్ధమని భారత విదేశాంగ మంత్రి జైశంకర్ అమెరికాలోనే ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

రష్యా నుంచి చమురు ఇక కష్టమే!

- అమెరికా ఆంక్షల ఫలితంగా మార్చిలో 20 శాతానికి తగ్గనున్న సరఫరా
- పశ్చిమాసియా మార్కెట్ల ద్వారా లోటు భర్తీ
- ప్రభుత్వరంగ సంస్థ బీపీసీఎల్ వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 23: రష్యా చమురు రంగంపై అమెరికా విధించిన ఆంక్షల ప్రభావం మన చమురు దిగుమతులపై తీవ్రంగా పడుతోంది. మార్చి నెలకు అవసరమైనంత చమురు దిగుమతులు రష్యా నుంచి వచ్చే అవకాశాలు లేవని ప్రభుత్వరంగ చమురు సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) డైరెక్టర్ (ఫైనాన్స్) రామకృష్ణగుప్తా తెలిపారు. గత ఏడాది అక్టోబరు-డిసెంబరుతో కూడిన త్రైమాసికంలో తమ సంస్థ శుద్ధి చేసిన ముడి చమురులో 31 శాతం రష్యా నుంచి వచ్చినదేనని, ఈ ఏడాది మార్చికి ఇది 20 శాతానికి పడిపోనుందని వెల్లడించారు. దీనిని భర్తీ చేయటానికి పశ్చిమాసియా తదితర ప్రత్యామ్నాయ మార్కెట్లను సంప్రదిస్తామని, ఆయా మార్కెట్లలో ముడి చమురు కావాల్సినంత ఉందని ఆయన తెలిపారు.

యుద్ధం నేపథ్యంలో చౌకగా రష్యా చమురు

చమురు అవసరాల కోసం భారత్ ఎక్కువగా గల్ఫ్ దేశాలపైనే ఆధారపడి ఉండేది. 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత.. రష్యా ఆర్థిక వనరులను దెబ్బతీసే ఉద్దేశంతో అమెరికా, పశ్చిమదేశాలు రష్యా చమురు సంస్థలపై ఆంక్షలు విధించాయి. దీంతో రష్యా తక్కువ ధరకే ముడి చమురును విక్రయించటం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో రష్యా నుంచి భారత్ ముడి చమురును భారీగా దిగుమతి చేసుకుంది. భారత్ చమురు కొనుగోళ్లలో రష్యా వాటా దాదాపు 40 శాతానికి చేరుకుంది (2022కి ముందు ఇది 0.4%). అయితే, ఈ ఏడాది జనవరి 10న రష్యా చమురు సంస్థలపై ఆంక్షలను అమెరికా మరింత కఠినతరం చేసింది. దీంతో ఆ దేశం నుంచి చమురు సరఫరాలు గతంలో ఉన్నట్లుగా అందుబాటులో లేవు.

రూ.10 లక్షల వరకు ఐటీ లేదు?

(మొదటి పేజీ తరువాయి)

వార్షిక ఆదాయం వరకు పన్ను మినహాయింపు లభిస్తోంది. దీన్ని రూ.10 లక్షల ఆదాయం వరకూ పెంచనున్నట్టు ఆ కథనం పేర్కొంది. అలాగే, రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల ఆదాయం వరకు కొత్తగా 25% పన్ను శ్లాబ్‌ను ప్రవేశపెట్టే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు ఆ కథనం తెలిపింది. ప్రస్తుతం 15 లక్షల పైబడిన ఆదాయానికి 30% పన్ను విధిస్తున్నారు. దీన్ని 25 శాతానికి తగ్గించడం వల్ల 15 లక్షల పైబడిన వార్షిక ఆదాయం ఉన్నవారికి ఊరట కలుగనుంది. ఈ మేరకు ఆదాయపన్ను శ్లాబుల్లో మార్పులు చేయనున్నట్టు ప్రభుత్వ వర్గాల నుంచి సంకేతాలు వచ్చాయని ఆ కథనం తెలిపింది. 'ఈ రెండు ప్రతిపాదనలపై మేం లెక్కలు వేస్తున్నాం. బడ్జెట్ అనుమతిస్తే ఈ రెండూ ప్రవేశపెట్టే అవకాశం ఉంది' అని ప్రభుత్వంలోని ఒకరు చెప్పినట్టు పేర్కొంది. జీడీపీ వృద్ధి మందగించిన ప్రస్తుత తరుణంలో తాజా ప్రతిపాదనలు పట్టణాల్లోని పన్ను చెల్లింపుదారులకు చేతినిండా డబ్బు ఉండేలా, తద్వారా వారు టీవీలు, రిఫ్రిజిరేటర్లు తదితరాల కొనుగోలుకు మరింత వ్యయం చేయడానికి దోహదపడుతుందని భావిస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి గత ఏడు త్రైమాసికాల కనిష్ఠ స్థాయికి(5.4%) పడిపోయింది. దీంతో వేతన జీవులకు ఆదాయ పన్నుల్లో ఉపశమనం కలిగించేందుకు రెవెన్యూ నష్టాలను రూ.50 వేల కోట్ల నుంచి రూ.1లక్ష కోట్ల వరకు భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు కథనం తెలిపింది. కొత్తగా 25% పన్నుశ్లాబ్ తీసుకురావడం పట్టణ పన్ను చెల్లింపుదారులు మరింత వ్యయం చేసేలా దోహదపడుతుందని, ఇది అంతిమంగా ప్రభుత్వానికే మేలు చేస్తుందని సీబీడీటీ(ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు) మాజీ సభ్యుడు అఖిలేశ్ రంజన్ పేర్కొన్నారు. తాజా బడ్జెట్‌లో కొత్త పన్ను విధానంలో మార్పులు చేయనున్నట్టు ఎక్కువమంది నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, పాత పన్ను విధానాన్ని తొలగించబోరని అంకిత్ జైన్ అనే నిపుణుడు తెలిపారు.

వెయ్యి కోట్ల టోకరా!



- ఓ రాజకీయ నాయకుడికి బినామీ ఝలక్
- తెలుగు రాష్ట్రాల నుంచి దుబాయ్ తరలించిన డబ్బుతో పరార్
- కొద్ది రోజులుగా దూరం దూరం.. ఇటీవల యూరప్ దేశానికి
- ప్రత్యర్థి శిబిరం వైపునకు ఫిరాయించారంటూ కథనం
- మారిన పరిస్థితుల్లో ఆయనే పంపారని మరో ప్రచారం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

తెలుగు రాష్ట్రాలకు చెందిన ఓ రాజకీయ నాయకుడి బినామీ ఆయనకే టోకరా ఇచ్చాడా!? తెలుగు రాష్ట్రాల నుంచి దుబాయ్‌కు తరలించిన వెయ్యి కోట్లతో ఉడాయించాడా!? ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా సాగుతున్న చర్చ ఇది! తెలుగు రాష్ట్రాలకు చెందిన రాజకీయ నాయకులు కొంత కాలంగా అక్కడ సంపాదించిన తమ సంపదను దుబాయ్‌కి తరలిస్తున్నారు. కొందరు ఇక్కడ పెట్టుబడులు పెడితే.. మరికొందరు స్థిరాస్తులు కొనుగోలు చేస్తున్నారు. ఇలాగే.. ఎక్కడి నుంచి ఎలా తరలించారనే విషయాన్ని పక్కనపెడితే.. సదరు రాజకీయ నాయకుడు తనకు అత్యంత విశ్వసనీయుడైన ఓ వ్యక్తి ద్వారా స్వదేశం నుంచి దుబాయ్‌కి వెయ్యి కోట్లను తరలించారు. గత కొంత కాలంగా ఇటువంటి అనేక లావాదేవీలను ఆయన నిర్వహించారని కూడా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే, డబ్బును తరలించిన కొద్ది కాలానికే సదరు విశ్వసనీయుడు ఝలక్ ఇచ్చినట్లు తెలుస్తోంది. తొలుత, వివిధ సాకులు చెబుతూ సదరు రాజకీయ నాయకుడికి దూరం పాటించినట్లు సమాచారం. ఆ తర్వాత ఏకంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ విడిచి యూరప్‌లోని ఓ దేశానికి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. సదరు రాజకీయ నాయకుడిని మోసగించి.. ప్రత్యర్థి శిబిరం వైపునకు ఫిరాయించినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. గత ఏడాది కాలంలో సదరు రాజకీయ నాయకుడికి ఇది రెండో ఝలక్ అని కూడా ప్రచారం జరుగుతోంది! అయితే, ఇదే అంశానికి సంబంధించి మరో కథనం కూడా వినిపిస్తోంది. సదరు విశ్వసనీయ మిత్రుడు (బినామీ) ఎటువంటి విశ్వాస ఘాతుకానికి పాల్పడలేదని, మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మరిన్ని ఇబ్బందులను ఎదుర్కోవడం ఇష్టం లేక ఆయనే అజ్ఞాతంలోకి పంపారనే వాదన కూడా వినిపిస్తోంది.

ఇప్పటికే తొమ్మిది మంది సంతానం

- మరోసారి గర్భం దాల్చిన మహిళ.. అబార్షన్ కోసం కౌన్సెలింగ్

చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆ మహిళ తొమ్మిదిమందికి జన్మనిచ్చింది. ఇప్పుడు మళ్లీ గర్భం దాల్చింది. దాంతో ఆరోగ్యశాఖ అధికారులు ఆమెకు అబార్షన్ నిర్వహించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. తమిళనాడులోని నామక్కల్ జిల్లా పెరియకొల్లపట్టిలో జరిగిన ఈ ఉదంతం వివరాలిలా ఉన్నాయి. పెరియకొల్లపట్టికి చెందిన రోజుకూలీ గోపి(40), సంగీత(35) దంపతులకు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి తొమ్మిదిమంది సంతానం. వీరిలో ఒకరు మృతి చెందగా, మరో చిన్నారిని దత్తతకు ఇచ్చారు. ఈ నేపథ్యంలో సంగీత మళ్లీ గర్భం దాల్చింది. ఈ విషయం తెలుసుకున్న బంధువులు, ఆరోగ్యం దెబ్బతింటుందని, అందువల్ల అబార్షన్ చేయించుకోవాలని సూచించారు. వారి సూచనలతో మల్లసముద్రం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లిన సంగీత పరీక్షలు చేయించుకుంది. ఆ వెంటనే మనసు మార్చుకుని అబార్షన్ చేయించుకోకుండానే ఇంటికి వచ్చేసింది. దీంతో అధికారులు ఆమెకు అబార్షన్‌పై కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

ఎవరెస్ట్ అధిరోహణ రుసుం రూ.13 లక్షలు

- 36 శాతం పెంచిన నేపాల్ ప్రభుత్వం

కాఠ్‌మాండూ, జనవరి 23: ఎవరెస్ట్ శిఖర అధిరోహణకు వసూలు చేసే పర్మిట్ ఫీజును కనీసం 36 శాతం మేర పెంచుతూ నేపాల్ మంత్రి వర్గం నిర్ణయం తీసుకొంది. పర్వతారోహకుల కారణంగా చెత్త పేరుకుపోతున్న నేపథ్యంలో ఈ ఫీజులను పెంచుతున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. మార్చి-మే సీజన్‌లో వచ్చే విదేశీయులు రాయల్టీ ఫీజు కింద ఇంతవరకు ఒక్కొక్కరు 11 వేల డాలర్లు చెల్లిస్తుండగా ఇకపై 15వేల డాలర్లు (రూ.13 లక్షలు) చెల్లించాల్సి ఉంటుంది. సెప్టెంబరు-నవంబరు సీజను రుసుము 5,500 డాలర్ల నుంచి 7,500 డాలర్ల (సుమారు రూ.6.50 లక్షలు)కు పెరిగింది. డిసెంబరు-ఫిబ్రవరి, జూన్-ఆగస్టు సీజన్ల రుసుము 2,750 డాలర్ల నుంచి 3,750 (రూ.3.20 లక్షలు)కు పెరిగింది. ఈ నూతన రుసుములు సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. పర్వతంపైకి అనుమతించిన వస్తువులను మాత్రమే తీసుకెళ్లాలని స్పష్టం చేసింది.

లాస్‌ఏంజెలెస్‌లో మళ్లీ మొదలైన కార్చిచ్చు

నివాసాలు విడిచి వెళ్లాలని 50 వేల మందికి ఆదేశాలు

కాలిఫోర్నియా, జనవరి 23 : అమెరికాలోని లాస్‌ఏంజెలెస్‌లో కార్చిచ్చు మళ్లీ విజృంభిస్తోంది. గాలుల తీవ్రతతో వేగంగా వ్యాపిస్తున్న మంటలు వేలాది ఎకరాల్లోని చెట్లు, నివాస సముదాయాలను దగ్ధం చేస్తున్నాయి. ఉత్తర లాస్‌ఏంజెల్స్‌కు 80 కిలోమీటర్ల దూరంలోని కాస్టియిక్ సరస్సు వెంబడి కొండల్లో స్థానిక కాలమానం ప్రకారం బుధవారం వేకువజామున కార్చిచ్చు చెలరేగింది. గంటకు 67 కిమీల వేగంతో గాలులు వీస్తుండడంతో గంటల వ్యవధిలోనే ఈ మంటలు 39 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో భూభాగాన్ని చుట్టుముట్టేశాయి. అగ్నికీలలు అంతకంతకు విస్తరిస్తుండడంతో కాస్టియిక్ సరస్సు వెంబడి ప్రాంతాల్లో నివసిస్తున్న 50వేల మందిని సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని అధికారులు ఆదేశించారు. 31,000 వేల మందిని ఉన్నపళంగా ఖాళీ చేయమని చెప్పగా, మరో 23,000 మందిని ఆ ప్రాంతాన్ని విడిచి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. కార్చిచ్చు వేగంగా వ్యాపిస్తూ మంటలు చెలరేగుతుండడంతో.. మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇక, లాస్‌ఏంజెలెస్‌లోని హాలీవుడ్ సహా పలు ప్రాంతాల్లో ఇటీవల కార్చిచ్చు చెలరేగిన సంగతి తెలిసిందే. జనవరి 7 నుంచి జరిగిన ఈ ఘటనల్లో 14,000 నిర్మాణాలు దగ్ధం అవ్వగా 28 మంది ప్రాణాలు కోల్పోయారు. పాలీసేడ్స్‌లో 68 శాతం, ఈటన్‌లో 91 శాతం మంటలు అదుపులోకి వచ్చాయి. లాస్‌ఏంజెలెస్ దక్షిణ ప్రాంతాల్లో శుక్రవారం నుంచి వర్షాలు కురిసే సూచనలు ఉండడంతో మంటలు పూర్తిగా అదుపులోకి వస్తాయని అధికారులు భావిస్తున్నారు. మరోపక్క, బూడిద, బురద ముప్పును ఎదుర్కోనేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



శ్రీవారి సేవలో అపోలో ప్రతాప్ రెడ్డి



అపోలో హాస్పిటల్స్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి దంపతులు గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో స్వామి వారిని దర్శించుకుని.. రంగనాయక మండపానికి చేరుకున్న ప్రతాప్ సీ రెడ్డి దంపతులకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

- ఆంధ్రజ్యోతి, తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
మార్కెటింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

తిరుమల తిరుపతి దేవస్థానముల మార్కెటింగ్ శాఖకు 50 కిలోల సామర్థ్యం కలిగిన 10,000 నంబర్ల నూతన ఖాళీ జనపనార గోనె సంచులు సరఫరా కొరకు ఇ-టెండరు కోరబడుతున్నవి. టెండరు ప్రకటన మరియు టెండరు వివరాల కొరకు వెబ్‌సైట్ http://www.tirumala.org మరియు https://tender.ap-eprocurement.gov.inకు లాగాన్ కాగలరు. తదుపరి వివరాల కొరకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్: 0877-2264079.

సం/- కార్యనిర్వహణాధికారి

TTD-40021(31)/1/2024-PRO SEC (Adv.No.297) Dt.:23.01.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ

నిట్ నెం.15./టి.ఓ/2024-25, **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు** తేది: 21.01.2025

ఏలూరు జిల్లాలో 2 పనుల కొరకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. **అంచనా విలువ:** రూ.199.40 లక్షలు. టెండరుదారులు టెండరు షెడ్యూళ్ళను ది.28.01.2025, సా.3గం. నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. **టెండర్ల స్వీకరణకు చివరి తేది:** 04.02.2025, సా.3.30. వరకు. ఇతర వివరాలను http://tender.apeprocurement.gov.inలో చూడవచ్చును.

సం/- పర్యవేక్షక ఇంజనీరు (ర.భ), ఏలూరు సర్కిల్, ఏలూరు

DIPR RO No.15206/CL/ADVT/1/1/2021-22, Dt 23.01.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జలవనరుల శాఖ

నెం.04. నుండి 07/2024-25 **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు** తేది: 21.01.2025

పని పేరు: గుంటూరు & బాపట్ల జిల్లాలోని కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని కాలువల మరమ్మత్తుల నిమిత్తం అధిక ప్రాధాన్యత గల పనులు చేపట్టుట. 4 పనుల విలువ: రూ.189.45 లక్షలు. టెండరు షెడ్యూల్ ఆన్‌లైన్‌లో లభ్యమగు తేది: 27.01.2025 ఉ.10.30గం. నుండి 10.02.2025, ఉ.11.గం. వరకు. వివరాలను https://tender.apeprocurement.gov.inలో చూడగలరు. ఫోన్: 9440814947.

సం/- పర్యవేక్షక ఇంజనీరు, ఇరిగేషన్ సర్కిల్, గుంటూరు

DIPR RO No.15205/CL/ADVT/1/1/2021-22, Dt 23.01.2025

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ లిమిటెడ్
(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వరంగ సంస్థ)
O/o ఇంజనీర్-ఇన్-చీఫ్, APIIC లిమిటెడ్, 9వ అంతస్తు, APIIC టవర్-1, ఆటోనగర్, IT పార్క్,మంగళగిరి, గుంటూరు జిల్లా-522 503, web:www.apiic.in

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

టెండరు ప్రకటన నం.20/CE(C)/APIIC/2024-25 తేది: 23.01.2025

టెండరు ప్రకటన నం.20 : 01 (ఒక) సంవత్సరం కాలానికి గుంటూరు జిల్లా, మంగళగిరి, IT పార్క్, APIIC ప్రధాన కార్యాలయంలో ప్రస్తుతం ఉన్నట్టి VRF/VRV టైప్ ఎయిర్ కండిషనింగ్ సిస్టమ్ సమగ్ర వార్షిక నిర్వహణా కాంట్రాక్టు (CAMC) కొరకు ప్రతిపాదన కొరకు అభ్యర్థన. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 23.01.2025న రా.8.00 గం.లకు. బిడ్ల దాఖలుకు ఆఖరి తేది: 07.02.2025న మ.3.00 గం.వరకు. టెండరు ప్రకటన వివరాలు మరియు బిడ్ డాక్యుమెంట్లను www.apeprocurement.gov.in http://tender.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.

సం/- చీఫ్ ఇంజనీర్ (C), APIIC లిమిటెడ్, మంగళగిరి.

DIPR R.O.No.3484PP/CL/ADVT/1/1/2021-22. Dt.:23.01.2025

దక్షిణ మధ్య రైల్వే
ట్విట్టర్ @ SCRailwayIndia అనుసరించండి
దక్షిణ మధ్య రైల్వే టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడగలరు

ఇ-టెండరు ప్రకటన
నం.2 - 2025: తేది: 22.01.2025 PUB/0063

భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ ఇంజనీర్ / కోఆర్డినేషన్ / గుంతకల్ వారు దిగువ పనుల కొరకు ఇ-టెండర్లు కోరుచున్నారు. **ముగింపు తేది & సమయం : 18.02.2025 న 15.00 గం.లకు.**

క్ర.సం.1 : టెండరు నం. Engg-GTL-Central-1758 **పని వివరణ:** గుంతకల్ డివిజన్: గుంతకల్ డివిజన్: కొండాపురం - గుత్తి (అప్ & డౌన్) : 20 కి.మీ. ఫెన్సింగ్ పొడవు (ఫేజ్-1) కొరకు NHAI యాంటీ క్రాష్ బ్యారియర్/ W- భీమ్ ఫెన్సింగ్ ఉపయోగిస్తు 130 kmph మరియు ఆపై కొరకు ట్రాక్ అంతటా సేఫ్టీ ఫెన్సింగ్ ఏర్పాటు. **ప్రకటిత విలువ :** రూ.6,71,30,487.20, **బయానా :** రూ.4,85,700.00/-

క్ర.సం.2 : టెండరు నం. Engg-GTL-Central-1759 **పని వివరణ:** గుంతకల్ డివిజన్: GTL డివిజన్: రేణిగుంట- గుత్తి సెక్షన్ :మెకానికల్ పద్ధతి (2,25,000 క్యూమ్) ద్వారా హాపర్స్/ ట్రాఫిక్ బల్లాస్ట్ వేగన్లలో లోడింగ్ మరియు గుత్తిడిపో వద్ద డ్యూరబుల్ మెషిన్ క్రాష్డ్ స్టోన్ బల్లాస్ట్ మరియు 50 మీ.మీ. గేజ్ హార్ట్ సరఫరా మరియు పేర్చడం. (రెండు ప్యాకెట్లు) **ప్రకటిత విలువ :** రూ.22,71,73,500.00 **బయానా :** రూ.12,85,900.00/-

క్ర.సం.3 : టెండరు నం. Engg-GTL-North-1760 **పని వివరణ:** గుంతకల్ డివిజన్: గుంతకల్ డివిజన్: GY-WADI సెక్షన్: DEN /North అధికార పరిధిలో 70కి.మీ. పొడవు కొరకు NHAI W-భీమ్ యాంటీ క్రాష్ బ్యారియర్ రకం ఫెన్సింగ్ ఉపయోగిస్తు 130 kmph మరియు ఆపై వేగంకొరకు ట్రాక్ అంతటా సేఫ్టీ ఫెన్సింగ్ ఏర్పాటు. (అనుబంధం ప్రకారం ప్రదేశాలు) (రెండు ప్యాకెట్లు) **ప్రకటిత విలువ:** రూ.24,52,68,665.94, **బయానా :** రూ.13,76,400.00/-

క్ర.సం.4 : టెండరు నం. Engg-GTL-South-1761 **పని వివరణ:** గుంతకల్ డివిజన్: RU-KDP & GDR-TPTY : 85 కి.మీలు (ఫేజ్ -1)కొరకు NHAI యాంటీ క్రాష్ బ్యారియర్ / W-భీమ్ స్టీల్‌ఫెన్సింగ్ ఉపయోగిస్తు 130 kmph మరియు ఆపై కొరకు ట్రాక్ అంతటా సేఫ్టీ ఫెన్సింగ్/ బౌండ్రీవాల్ (రెండు ప్యాకెట్లు) **ప్రకటిత విలువ:** రూ.26,69,57,701.14 **బయానా :** రూ.16,34,800.00/-

క్ర.సం.5 : టెండరు నం. Engg-GTL-West-1762 **పని వివరణ:** గుంతకల్ డివిజన్: గుంతకల్ డివిజన్: ధర్మవరం-గుత్తి (UP& DN) : 25 కి.మీ. ఫెన్సింగ్ పొడవు (ఫేజ్-1) కొరకు NHAI యాంటీ క్రాష్ బ్యారియర్ / W-భీమ్ ఫెన్సింగ్ ఉపయోగిస్తు 130 kmph మరియు ఆపై వేగంకొరకు ట్రాక్ అంతటా సేఫ్టీ ఫెన్సింగ్ ఏర్పాటు. **ప్రకటిత విలువ:** రూ.8,38,73,875.05 **బయానా :** రూ.5,69,400.00

క్ర.సం.6 : టెండరు నం. Engg-GTL-West-1763 **పని వివరణ:** గుంతకల్ డివిజన్: SSE(P.Way) ఆఫీస్ కల్లూరు వద్ద నూతన స్టోర్ బిల్డింగ్ నిర్మాణం. **ప్రకటిత విలువ:** రూ70,88,209.9 **బయానా :** రూ.1,41,800.00

క్ర.సం.7 : టెండరు నం. Engg-GTL-Central-1764 **పని వివరణ:** 5 కి.మీ. ఫెన్సింగ్ పొడవు (ఫేజ్-1) కొరకు బెజినాల్ 2000 హైటెన్‌సైల్ స్టీల్ వైర్ కోటెడ్‌తో ఫిక్స్‌డ్ నాట్ ఫెన్సింగ్ ఉపయోగించి 130 Kmph మరియు ఆపై వేగం కొరకు ట్రాక్ అంతటా సేఫ్టీ ఫెన్సింగ్ ఏర్పాటు. **ప్రకటిత విలువ:** రూ 1,31,58,705.6 **బయానా :** రూ.2,15,800.00

క్ర.సం.8 : టెండరు నం. Engg-GTL-West-1765 **పని వివరణ:** DEN/West/GTL అధికార పరిధి క్రింద జంగాలపల్లి బల్లాస్ట్ డిపో వద్ద రైల్వే హాపర్స్/ వేగన్లలో లోడింగ్ మరియు రైల్వే స్పెసిఫికేషన్స్‌కు డ్యూరబుల్ స్టోన్ బల్లాస్ట్ మరియు 50 మీ.మీ. గేజ్ మెషిన్ సరఫరా మరియు పేర్చడం.(216000 క్యూమ్) (రెండు ప్యాకెట్ల విధానం) **ప్రకటిత విలువ :** రూ.20,47,55,040 **బయానా :** రూ.11,73,800.00/-

క్ర.సం.9: టెండరు నం. Engg-GTL-West-1766 **పని వివరణ:** ధర్మవరం-గుత్తి (అప్& డౌన్): 5 కి.మీ. ఫెన్సింగ్ పొడవు (ఫేజ్-1) కొరకు బెజినాల్ 2000హైటెన్‌సైల్ స్టీల్ వైర్ కోటెడ్‌తో ఫిక్స్‌డ్ నాట్ ఫెన్సింగ్ ఉపయోగించి 130 Kmph మరియు ఆపై వేగం కొరకు ట్రాక్ అంతటా సేఫ్టీ ఫెన్సింగ్ ఏర్పాటు. **ప్రకటిత విలువ:** రూ.1,23,36,502 **బయానా :** రూ.2,11,700.00

ఏదేని సవరణ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీ చేయబడుతుంది.

డివిజనల్ రైల్వే మేనేజర్/ పనులు/ గుంతకల్

టెండర్ ప్రకటన నం.G/E. 252/TRSO/ 16-17/2024 - 2025 తేది: 22.01.2025 PUB/0064

భారత రాష్ట్రపతి తరఫున వ్యవహరిస్తున్న సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ TRSO / గుంతకల్ వారు దిగువ తెలిపిన పనుల కొరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.

క్ర.సం.01. టెండరు నం. & పని పేరు: G/E.252/TRSO/16/2024-2025 - రెండు సంవత్సరాలు (24) నెలలు కాలవ్యవధి కొరకు గుత్తి స్టేషన్ వద్ద స్పెసిఫికేషన్ IS: 1987/ 2002, గ్రేడ్ సి మరియు AAR M-916-51 ప్రకారం సీల్డ్ పాలిథిన్ 15 కేజీ బ్యాగుల్లో "లోకో మోటివ్‌లలో ఉపయోగం కొరకు 850/ 425 మైక్రాన్ సైజ్ సాండ్ గ్రెయిన్ సరఫరా. వ్యవధి: (రెండు సంవత్సరాలు) **పని అంచనా విలువ:** రూ.22,45, 320.00/-, **రిమార్కులు:** రీ టెండరు.

క్ర.సం.02. టెండరు నం. & పని పేరు: G/E.252/TRSO/17/2024-2025 - రెండు సంవత్సరాలు (24) నెలలు కాలవ్యవధి కొరకు రేణిగుంట స్టేషన్ వద్ద స్పెసిఫికేషన్ IS: 1987 / 2002, గ్రేడ్ సి మరియు AAR M-916-51 ప్రకారం సీల్డ్ పాలిథిన్ 15 కేజీ బ్యాగుల్లో "లోకో మోటివ్‌లలో ఉపయోగం కొరకు 850/ 425 మైక్రాన్ సైజ్ సాండ్ గ్రెయిన్ సరఫరా. వ్యవధి: (రెండు సంవత్సరాలు) **పని అంచనా విలువ:** రూ.17,64,180.00/-, **రిమార్కులు:** రీ టెండరు.

ముగింపు తేది మరియు సమయం: 14.02.2025న 12.00 గం.లకు

టెండరు బిడ్డింగ్ కొరకు మరియు ఇతర వివరాల కొరకు http://ww.ireps.gov.inకు లాగిన్ అవండి. టెండరుకు ఏదేని సవరణ జారీచేయవలసి ఉంటే, ఆన్‌లైన్‌లో మాత్రమే జారీచేయబడును.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, (TRSO) గుంతకల్

ఇ- టెండర్ ప్రకటన నం. GEM/2025/B/5851784, GEM/2025/B/5855082 & GEM/2025/B/5855256. PUB/0065

దిగువ పనుల కొరకు దిగువ సంతకందారు ద్వారా కాంట్రాక్టర్ల నుండి **17.02.2025**న 17.00 గం.వరకు ఇ-టెండర్లు కోరబడుతున్నవి.

క్ర.సం.01 టెండరు పేరు: GNT డివిజన్ - రెండు సంవత్సరాల కాలానికి TPC/GNT యొక్క అప్‌కీప్ & కాపలా మరియు GNT-PGDP సెక్షన్‌లో 6నం.లు (GNT, NLPD, SAP, NDKD, MRGA & CYTL) టీఆర్డీ డిపోల యొక్క అప్ క్లీన్ & కాపలా. **టెండరు నిర్దేశ నం:** GEM/ 2025/ B/5855082 తేది:23.01.2025. **సుమారు విలువ:** రూ.1,27,37,408.80/-, **బయానా:** రూ.2,13,700/-, **టెండరు ఫారం ధర (వాపసు రానిది):** లేదు.

క్ర.సం.02 టెండరు పేరు: GNT డివిజన్ - రెండు సంవత్సరాల కాలానికి GNT-PGDP సెక్షన్‌లో 5నం.ల TSSs (NLPD, SAP, GZA, MRGA & RMNP) యొక్క అపరేషన్, అప్‌కీప్ & కాపలా. **టెండరు నిర్దేశ నం:** GEM/2025/ B/5855256 తేది:23.01.2025. **సుమారు విలువ:** రూ.1,39,42,623.80/-, **బయానా:** రూ.2,19,800/-, **టెండరు ఫారం ధర (వాపసు రానిది):** లేదు.

క్ర.సం.03 టెండరు పేరు: GNT డివిజన్ - మూడు సంవత్సరాల కాలానికి SAP,V NDKD, MRGA & CTYL TRD డిపోలో కొరకు 6.0 టన్ కనీస సామర్థ్య క్యారియర్‌తో హెవీ డ్యూటీ లారీల అద్దె. **టెండరు నిర్దేశ నం:** GEM/2025/B/5851784 తేది:23.01.2025. **సుమారు విలువ:** రూ.1,54,62,720/-, **బయానా:** రూ.2,27,400/-, **టెండరు ఫారం ధర (వాపసు రానిది):** లేదు.

ఇ-బిడ్ల ఆన్‌లైన్ దాఖలుకు ఆఖరి తేది మరియు సమయం: 17.02.2025న 17.00 గం.వరకు.


ఏదేని సవివరమైన సమాచారం కొరకు **23.01.2025 నుండి 17.02.2025**న 17.00 గం.ల వరకు వెబ్‌సైట్ **www.ireps.gov.in** కు లాగాన్ కాగలరు. ఏదేని తదుపరి సమాచారం/సవరణ **ఇ-పోర్టల్ www.ireps.gov.in** ద్వారా మాత్రమే తెలియజేయబడుతుంది.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ ట్రాక్షన్ /గుంటూరు
A0080

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ : https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద దర్శించండి.

శ్రీశైలం డ్యాంకు 'ప్లంజ్' ముప్పు!

- అధ్యయనానికి ఏళ్లుగా పడని అడుగులు
- చంద్రబాబు సీఎం అయ్యాక ఇందుకోసం రూ.14 కోట్లు మంజూరు
- సీడబ్ల్యూపీఆర్‌సీకి బాధ్యత అప్పగించాలని ప్రభుత్వానికి ఇంజనీర్ల నివేదిక
- ఇటీవలి కృష్ణా బోర్డు భేటీలో దీనిపై చర్చ
- స్టడీకి అభ్యంతరం లేదన్న తెలంగాణ
- తక్షణ చర్యలకు రాష్ట్ర సర్కారుకు బోర్డు సూచన



శ్రీశైలం డ్యాం వద్ద ప్లంజ్‌పూల్ గుంత (ఫైల్)

కర్నూలు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్లంజ్‌పూల్ గుంత వల్ల శ్రీశైలం డ్యాం భద్రతకు ముప్పు పొంచి ఉంది.. దీనిపై అధ్యయనం చేసి.. తక్షణ చర్యలు తీసుకోవాలని శ్రీశైలం ప్రాజెక్టును పరిశీలించిన నిపుణుల బృందాలు పలుమార్లు తేల్చి చెప్పాయి. ప్రభుత్వానికి నివేదికలు కూడా ఇచ్చాయి. కానీ ఏళ్లు గడచినా ఆ దిశగా అడుగులు పడడం లేదు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ అధ్యయనం కోసం రూ.14 కోట్లు మంజూరు చేసింది. పుణేకు చెందిన సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ సెంటర్ (సీడబ్ల్యూపీఆర్‌సీ)కి నామినేషన్‌పై ఇచ్చేందుకు అనుమతి కోరుతూ ఇంజనీర్లు ప్రభుత్వానికి నివేదిక పంపారు. మంగళవారం హైదరాబాద్ జలసౌధలో జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశంలో దీనిపై సుదీర్ఘంగా చర్చించారు. 2009 నాటి భారీ వరదల కారణంగా.. డ్యాం స్పిల్‌వే గేట్ల నుంచి అతివేగంగా కింద పడే ప్రవాహం మళ్లీ ఎగిసిపడే ప్రాంతం (ప్లంజ్‌పూల్)లో భారీ గుంత ఏర్పడింది. ఈ గుంత లోతు 45 మీటర్లు, వెడల్పు 270 మీటర్లు, పొడవు 400 మీటర్లు ఉంటుందని అంచనా వేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక శ్రీశైలం డ్యాంను సీఎం చంద్రబాబు సందర్శించారు. ఆ సమయంలో ప్లంజ్‌పూల్ సమస్యతో పాటు మరమ్మతులపై ప్రాజెక్టు ఇంజనీర్లు ఆయనకు వివరించారు. ఆ తర్వాత ప్లంజ్‌పూల్ గుంత వల్ల ఏ మేరకు ప్రమాదం పొంచి ఉందో అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.14 కోట్లు మంజూరు చేసింది. పుణేలోని సీడబ్ల్యూపీఆర్‌సీకి నైపుణ్యం ఉందని.. టెండర్లు లేకుండా నామినేషన్‌పై అధ్యయన బాధ్యతలు అప్పగించేందుకు అనుమతులు సహా తక్షణమే రూ.3.70 కోట్లు మంజూరు చేయాలని కర్నూలు జిల్లా ప్రాజెక్ట్స్ ఇంజనీర్లు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. దీనిపై కేఆర్ఎంబీ సమావేశంలో చర్చించినప్పుడు.. తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, తక్షణమే ప్లంజ్‌పూల్‌పై అధ్యయనం చేయించాలని తెలంగాణ అధికారులు కోరినట్లు తెలిసింది. దీనిపై ఏపీ ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని బోర్డు సూచించినట్లు సమాచారం.

శాశ్వత మరమ్మతులు ఎప్పుడో..?

శ్రీశైలం డ్యాం 2009 నాటి వరదలకు భారీగా దెబ్బతింది. అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయింది. రిటైనింగ్ వాల్ 2.50 కిలోమీటర్లు ఉంటే.. 600 మీటర్లు పూర్తిగా కొట్టుకుపోయింది. శాశ్వత మరమ్మతులు చేపట్టాలంటే అప్రోచ్ రోడ్డు, రిటైనింగ్ వాల్ నిర్మాణం అత్యవసరమని నిపుణుల కమిటీలు సూచించాయి. ఆయా పనుల కోసం డ్రిప్-2 కింద రూ.190 కోట్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు. గతేడాది ఫిబ్రవరిలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) చైర్మన్ వివేక్ త్రిపాఠి నేతృత్వంలోని నిపుణుల బృందం, కేఆర్ఎంబీ సభ్యులు డ్యాం భద్రత, నిర్వహణ. నీటి నిల్వలు, వినియోగం తదితర అంశాలను పరిశీలించారు. ఆ తర్వాత డ్యాంను సందర్శించిన ప్రపంచ బ్యాంకు బృందం మరమ్మతులకు తొలి విడత రూ.108 కోట్లు ఇచ్చేందుకు ఆమోదం తెలుపుతూ ఎన్ఓసీ కూడా ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫైలు ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉందని ఇంజనీర్లు అంటున్నారు. దాని ఆమోదం లభిస్తే టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి వచ్చే ఖరీఫ్ నాటికి వేసవిలో మరమ్మతు పనులు పూర్తి చేయవచ్చని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం డ్యాం శాశ్వత మర్మతులపై సానుకూల నిర్ణయం తీసుకున్నా.. ఆ ఫైలు ఆర్థిక శాఖ అడ్డంకులు దాటి టెండర్ల దశకు చేరుకుంటుందా అన్న సందేహం తలెత్తుతోంది.



అలిపిరి వద్ద కేక్ కట్ చేస్తున్న అట్లూరి నారాయణ తదితరులు, పక్కన శ్రీనివాసానంద సరస్వతి

తిరుపతిలో ఘనంగా లోకేశ్ జన్మదిన వేడుకలు

- 42 కిలోల కేక్ కట్‌చేసిన సాధు పరిషత్ ప్రతినిధులు

తిరుపతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడు కలు గురువారం అలిపిరిలోని గరుడ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ గౌరవ అధ్యక్షుడు అట్లూరి నారాయణరావు, అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. లోకేశ్ 42వ జన్మదినాన్ని పురస్కరించుకుని 42 కిలోల కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పవిత్రమైన తిరుపతి క్షేత్రంలో లోకేశ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని, కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఆయనకు ఉండాలని వారు అభిలషించారు. రాష్ట్రంలో నిరాశ, నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్న నిరుద్యోగ యువతకు దిక్సూచిలా, అన్నగా వారిని ఆదుకునే శక్తియుక్తులు ఆయనకు భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జగన్నాథం, సుమన్ నాయుడు, నీలకంఠం, గోకుల్, మధు పాల్గొన్నారు.

దళిత ద్రోహి సునీల్‌కుమార్

- జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ జోసఫ్



ప్రొఫెసర్ జోసెఫ్

పొన్నూరుటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ దళిత జాతికి నమ్మకద్రోహం చేశారని జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి ఆరోపించారు. ఈ మేరకు గుంటూరు జిల్లా పొన్నూరులో గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సమయంలో సునీల్‌కుమార్ దళిత జాతిని అడ్డం పెట్టుకుని పరోక్షంగా జగన్‌రెడ్డికి మద్దతు ఇచ్చి సీఐడీ డీజీగా ప్రమోషన్ పొందారని ఆరోపించారు. ఆయనపై విచారణ ప్రారంభమయ్యేసరికి సోషల్ మీడియాలో అంబేడ్కర్ ఇండియా మిషన్ ఆర్మీలో చేరండి అని ప్రకటనలు ఇస్తున్నారన్నారు. ఇలాంటి వారిని నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు. విజయ్‌పాల్, నందిగం సురేష్, బోరుగడ్డ అనిల్ కుమార్, సంజయ్‌కుమార్, పీవీ సునీల్‌కుమార్ లాంటి దళిత, క్రైస్తవ బ్యాక్‌గ్రౌండ్ ఉన్నవారిని జగన్మోహన్‌రెడ్డి వాడుకుని ఇరికించేశారని ధ్వజమెత్తారు. జగన్‌రెడ్డి మావాడు అనుకుని ఓట్లు వేసి క్రైస్తవులు గెలిపిస్తే క్రైస్తవులకు అన్యాయం చేశాడని ఆరోపించారు. దళిత జాతికి సునీల్ కుమార్ చేసిందేమి లేదని జోసఫ్ దుయ్యబట్టారు.

వెంకన్న హుండీలో రూ.2 వేల నోట్లు

- రూ.2.44 లక్షల విలువైన 122 నోట్లు లభ్యం



తెనాలి వైకుంఠపురం ఆలయ హుండీలో లభ్యమైన రూ.2వేల నోట్లు

తెనాలి, జనవరి 23, (ఆంధ్రజ్యోతి): ఆలయ హుండీ లెక్కింపులో చలామణీలో లేని రూ.2వేల నోట్లు ప్రత్యక్షం కావటం ఆశ్చర్యం కలిగించింది. ఒకటి, రెండు కాకుండా ఏకంగా రూ. 2.44 లక్షల విలువైన నోట్లు హుండీలో ఉండటంతో ఆలయ సిబ్బంది అవాక్కయ్యారు. గుంటూరు జిల్లా తెనాలి వైకుంఠపురంలోని శ్రీ లక్ష్మీపద్మావతీ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ 3 నెలల్లో భక్తులు హుండీలో సమర్పించిన కానుకలు, నగదును ట్రస్ట్‌బోర్డ్ సభ్యులు, భక్తుల సమక్షంలో అధికారులు గురువారం లెక్కించారు. ఈ క్రమంలో రూ. 2వేల నోట్లు కనిపించాయి. దీంతో అధికారులు, లెక్కింపు సిబ్బంది విస్తుపోయారు. 2023లోనే చలామణీకి దూరమై, ఈ మధ్యకాలంలో బయట కనిపించని నోట్లు హుండీలో దర్శనమివ్వటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వాటిని జాగ్రత్త చేసినట్టు ఆలయ ఈఓ అనుపమ చెప్పారు.

రూ.1.76 కోట్ల విలువైన నకిలీ సిగరెట్లు సీజ్



అధికారులు స్వాధీనం చేసుకున్న నకిలీ సిగరెట్లు

విజయవాడ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కస్టమ్స్ (ప్రివెంటివ్), సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్ యాంటీ ఎవేజన్ అధికారులు విజయవాడలో సంయుక్తంగా సోదాలు నిర్వహించి స్మగ్లింగ్ చేయడానికి ఉంచిన రూ.1.76 కోట్ల విలువైన నకిలీ సిగరెట్లను గురువారం స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని ఓ గోడౌన్‌లో స్మగ్లింగ్ సిగరెట్లు ఉన్నాయని సమాచారం రావడంతో సోదాలు చేశారు. ఈ గోడౌన్‌లో ప్యారిస్ బ్రాండ్‌కు చెందిన 17.60 లక్షల సిగరెట్లను 88 హై డెన్సిటీ పాలిథిన్ సంచుల్లో ఉంచారు. వీటిని కొంతమంది వ్యాపారులు బిహార్ నుంచి రప్పించినట్టు గుర్తించారు. ఇవన్నీ నకిలీ సిగరెట్లుగా తేల్చారు. ఎలాంటి పన్నులు చెల్లించకుండా, వే బిల్లులు లేకుండా గోడౌన్‌కు తీసుకొచ్చారని అధికారులు గుర్తించారు. ఈ సరకు విలువ రూ.1.76 కోట్లు ఉంటుందని కస్టమ్స్ అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంలో ఇద్దరిని అరెస్టు చేసి, విశాఖపట్నంలోని ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టులో హాజరుపర్చగా, 14 రోజుల పాటు రిమాండ్ విధించింది.

भारत सरकार - अंतरिक्ष विभाग / GOVERNMENT OF INDIA - DEPARTMENT OF SPACE
निर्माण एवं अनुरक्षण समूह, एसडीएससी-शार / CONSTRUCTION AND MAINTENANCE GROUP, SDSC-SHAR
श्रीहरिकोटा / नेल्लूर (जिला), आं.प्र. / SRIHARIKOTA - 524124

संक्षिप्त ई–निविदा सूचना / Brief E-TENDER NOTICE

ई–निविदा सूचना सं./ e- Tender Notice No: CMG/C/CON/248732 तिथि/ Date. 21.01.2025

भारत के राष्ट्रपति की ओर से, **"सूल्लूरुपेट के पुलिकाट नगर (पीसीएन) इसरो / अं.वि. हाऊसिंग कॉलोनी केआरपी में 60 डी प्रकार के क्वार्टर तथा 20 ई प्रकार के क्वार्टरों का निर्माण एवं ईपीसी विधि– III में फेज–1 (सिविल, जनस्वास्थ्य, विद्युतीय तथा यांत्रिक (लिफ्ट) कार्य ।"** (₹ 7686.00 लाख) के लिए ई–निविदा के माध्यम से मद दर निविदाएं आमंत्रित की जाती हैं। निविदा दस्तावेज **13/02/2025** को **14:30** बजे तक डाउनलोड किए जा सकते हैं। विस्तृत सूचना हेतु इच्छुक निविदाकार हमारी वेबसाइट **www.isro.gov.in** या **www.tenderwizard.com/ISRO** देखें।

On behalf of President of India, online EPC tenders are invited through e-tendering for **"Construction of D Type (60 Nos) & E type (20Nos) Quarters at Pulicat Nagar (PCN) ISRO/ DOS Housing Colony, KRP, Sullurpeta - Phase-I (Civil, PH, Electrical & Mechanical (Lift) works in EPC Mode-III)"** (₹ 7686.00 Lakhs); Tender documents can be downloaded up to **13/02/2025, 14:30** hrs. Interested tenderers may visit **www.isro.gov.in** or **www.tenderwizard.com/ISRO** for details.

हस्ताक्षरित- समूह प्रधान, सीएमजी / एसडीएससी शार / Sd/- GROUP HEAD, CMG / SDSC SHAR

సవరణ

మంత్రి లోకేశ్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం 'ఆంధ్రజ్యోతి' సంచిక మొదటి పేజీలో ప్రచురించిన యాడ్‌లో 'నారా లోకేశ్‌గారు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రివర్యులు' అని పొరపాటుగా వచ్చింది. దానిని 'ఐటీ, మానవ వనరుల శాఖామాత్యులు' అని చదువుకోగలరు.

ANDHRA PRADESH STATE COUNCIL OF HIGHER EDUCATION
3rd, 4th and 5th Floors, Neeladri Towers, Sri Ram Nagar, 6th Battalion Road, Atmakur (V), Mangalagiri (M), GUNTUR-522 503, A.P.
Website: www.apsche.org. Email:secretary@apsche.org

Short Tender Notice

APSCHE-CET's-CBT-2025-26 -01 **Dt. 23-01-2025**

Tenders are here by invited from reputed companies/agencies/firms **"For conduct of Computer Based Test (CBT) of AP Common Entrance Tests (APCETs) conducted by APSCHE"** through e-procurement portal **https://tender.apeprocurement.gov.in** with **tender Id No.781577.** Tender schedule is from **23.01.2025** & last date of tender submission is **29.01.2025 by 06.00 P.M.** The schedule & other details of the tender can be downloaded from e-procurement portal **https://tender.apeprocurement.gov.in** or **www.apsche.org**

Sd/- SECRETARY

ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డ్
1వ అంతస్తు, పోర్ట్ అడ్మిన్ బిల్డింగ్, కాకినాడ- 533 007

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

ఇ-టెండరు ప్రకటన నం.11/SE/FH-Phase-II/2025, తేది: **22.01.2025**

ఆంధ్రప్రదేశ్, అనకాపల్లి జిల్లాలో పుడిమడక & శ్రీకాకుళం జిల్లాలో బుడగట్లపాలెం వద్ద ఫిషరీ హార్బర్ల అభివృద్ధి కొరకు సవివరమైన ప్రాజెక్ట్ రిపోర్ట్, ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ తయారీ పనుల కొరకు APMB టెండర్లు కోరుతోంది. ఇ-టెండర్లను వెబ్‌సైట్ https://tender.apeprocurement.gov.in నుండి 27.01.2025 నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. తదుపరి వివరాలు దిగువ సంతకందారు నుండి పొందవచ్చును. సంప్రదించాల్సిన ఫోన్: 9182321350.

సం/- చీఫ్ ఇంజనీర్, APMB, కాకినాడ.

DIPR RO No.3481PP/CL/ADVT/1/1/2021-22, Dt: 23.01.2025

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ లిమిటెడ్
(ఆం.ప్ర. ప్రభుత్వ రంగ సంస్థ)
O/o చీఫ్ ఇంజనీర్-III, 9వ అంతస్తు, APIIC టవర్స్, మంగళగిరి, గుంటూరు జిల్లా-522 503,

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

సంక్షిప్త టెండరు ప్రకటన నం.15,16&17/CE(N)APIIC/2024-25, తేది: **22.01.2025**

దిగువ పని కొరకు చీఫ్ ఇంజనీర్ (N), APIIC లిమిటెడ్, మంగళగిరి వారు బిడ్లను కోరుతున్నారు: **ప్రధాన పని పేరు:- టెండరు ప్రకటన నం.15 :** IALA నిధుల క్రింద విశాఖపట్నం జిల్లా, ఆటోనగర్, బ్లాక్-D వద్ద CC వరద నీటి డ్రైయిన్ల నిర్మాణం మరియు డ్రైయిన్లకు మరమ్మతులు. **ECV** రూ.1,33,39,124.00, **ప్రచురణ తేది:** 22.01.2025న రా.8.00 గం.లకు. **బిడ్ల దాఖలుకు ఆఖరి తేది:**07.02.2025న మ.3.00 గం.లకు. **ప్రధాన పని పేరు:- సంక్షిప్త టెండరు ప్రకటన నం.16:** IALA నిధుల క్రింద విశాఖపట్నం, గాజువాక, ఆటోనగర్ వద్ద బ్లాక్-E ఇంటర్నల్ రోడ్స్ & బ్లాక్-B ఇంటర్నల్ రోడ్స్ వద్ద BC రెన్యువల్ లేయర్స్ మరియు పాట్ హోల్స్ మూసివేయుట, ఆటో నగర్ RTO కార్యాలయం రోడ్ మరియు బ్లాక్ F మెయిన్ రోడ్, బ్లాక్-D (EXP) రోడ్ 400 మీటర్లు వెడల్పు చేయుట మరియు పటిష్టపరుచుట మరియు బ్లాక్ E & G, AEP వద్ద Y-జంక్షన్ నుండి దాజ్కో మరియు Y జంక్షన్ నుండి సబ్ స్టేషన్‌కు ప్రస్తుతం ఉన్నట్టి 10.00 mts రోడ్‌పై 30 mm మందం బిటుమినస్ కాంక్రీట్ B.T. రెన్యువల్ లేయర్ ఏర్పాటు చేయుట. **ECV** రూ.6,71,91,113.00. **బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది:**22.01.2025న రా.08.00గం.లకు, **బిడ్ దాఖలుకు ఆఖరి తేది:**31.01.2025న మ.3.00గం.లకు **పని పేరు: టెండరు ప్రకటన నం.17:** 2024-25 సంవత్సరానికి IALA ఫండ్స్ క్రింద విశాఖపట్నం జిల్లా, A, B, D, D-EXPAN, E, F, G, AEP బ్లాక్స్ & IP పెదగంట్యాడ వద్ద స్ట్రీట్ లైట్ల వార్షిక నిర్వహణ.(3వ పిలుపు). **ECV** రూ.33,47,740/-, **ప్రచురణ తేది:** 22.01.2025న రా.8.00 గం.లకు. **బిడ్ల దాఖలుకు ఆఖరి తేది:** 07.02.2025న మ.3.00 గం.లకు. టెండరు ప్రకటన వివరాలు మరియు బిడ్ డాక్యుమెంట్లు వెబ్‌సైట్ www.apeprocurement.gov.in లేదా https://tender-apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.

సం/- చీఫ్ ఇంజనీర్ (N) , APIIC లిమిటెడ్, మంగళగిరి.

DIPR RO No.3482PP/CL/ADVT/1/1/2021-22, Dt: 23.01.2025

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రష్యా దిగివస్తుందా?

యుద్ధం ఆపకపోతే మరిన్ని ఆంక్షలతో పీల్చిపిప్పిచేస్తానని అధికారంలోకి వచ్చీరాగానే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలకు రష్యా తాపీగా, శాంతంగా ప్రతిస్పందించింది. చర్చలకు తాము సిద్ధమేననీ, కానీ ఆంక్షలకే ట్రంప్ అత్యుత్సాహపడుతూంటారని క్రెమ్లిన్ ప్రతినిధి వ్యాఖ్యానించారు. ఒకపక్క పుతిన్‌ను ప్రశంసిస్తూనే, ఆయనతో సాన్నిహిత్యం ఉన్నదని అంటూనే, రష్యాను ఇబ్బందిపెట్టడం తన ఉద్దేశం కాదని చెబుతూనే ట్రంప్ చాలా విమర్శలు చేశారు. దారికొచ్చి సంధికుదర్చుకోనిపక్షంలో వివిధ రకాల పన్నులు, సుంకాలు, ఆంక్షలతో రష్యాను దెబ్బతీస్తానని హెచ్చరించారు. తానేగనుక అధికారంలో ఉండివుండే అసలు ఈ యుద్ధమే మొదలయ్యేది కాదని ట్రంప్ మళ్ళీ గొప్పచెప్పుకున్నారు. పుతిన్ వల్లే రష్యా నాశనం అవుతోందనీ, ఆర్థికంగా పతనమైపోతోందనీ ఒకపక్క శాపాలు పెడుతూనే తామిద్దరి మధ్యా మంచి అవగాహన ఉన్నదని ట్రంప్ చెప్పుకొచ్చారు. ట్రంప్ వ్యాఖ్యలను బట్టి, ఆయన ఎప్పటినుంచో హామీ ఇస్తున్నట్టుగానే రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని సాధ్యమైనంతవేగంగా ముగించే ప్రయత్నమైతే ఆరంభిస్తున్నట్టు కనిపిస్తోంది.

ఉక్రెయిన్ యుద్ధం నాలుగో ఏడాదిలోకి ప్రవేశిస్తున్న తరుణంలో, అర్థంపర్థంలేని ఈ యుద్ధాన్ని ఇంకా పొడిగించడానికి వీల్లేదనీ, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సైతం యుద్ధం ముగిసిపోవాలని కోరుకుంటున్నారనీ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ ఏడాది చివర్లోగా శాంతి తెస్తానంటూ ఆయన తనకు ప్రమాణంచేశారని జెలెన్‌స్కీ కూడా చెబుతున్నారు. మొత్తంగా యుద్ధాన్ని ముగించడానికో, అందుకు వీలుగా చర్చలకో రంగం సిద్ధమవుతున్నట్టు కనబడుతోంది. యుద్ధం పరిష్కారం కాదని నరేంద్రమోదీ వంటివారు ప్రపంచవేదికలమీద ప్రవచిస్తున్నప్పుడల్లా పుతిన్ సైతం సానుకూలంగా స్పందిస్తూ వచ్చిన విషయం తెలిసిందే.

అయితే, అధికారంలోకి వచ్చిన ఒక్కరోజులోనే యుద్ధాన్ని ఆపేస్తానంటూ ప్రకటించిన ట్రంప్‌కు అది అంత సులభం కాదని తెలియకపోదు. యుద్ధంలో రెండుపక్షాలూ పీకలోతున సుదీర్ఘకాలంగా మునిగి ఉండటం, అపారనష్టాలను మూటగట్టుకోవడం, ఎంతోకొంత కోల్పోనిదే కాలువెనక్కు తీసుకోలేకపోవడం వంటివి పరిష్కారాన్ని జటిలం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉభయపక్షాలనూ కూడా బుజ్జగింపులు, బెదిరింపులతో దారికి తేక తప్పదు. ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధ సరఫరాలతోనో, రష్యాను మరిన్ని ఆంక్షలతో శిక్షించడంవల్లనో యుద్ధాన్ని ఆపడం అసాధ్యం. ఉభయపక్షాలకూ ఎంతోకొంత లబ్ధిచేకూర్చి, రాజీపడేట్టుగా చేయడం తప్ప మార్గం లేదు. ఇన్నేళ్ళు యుద్ధం చేసి కూడా తనకు పక్కలోబల్లెంలాగా ఉంటున్న ఉక్రెయిన్‌ను అలాగే వదిలేయడం పుతిన్‌కు ససేమిరా ఇష్టం ఉండదు. ఉక్రెయిన్‌తో ఇకమీదట ఏ సమస్యా రాకుండా, అది నాటోతో కలిసి తన నెత్తినెక్కే అవకాశాలు లేనప్పుడే రష్యా దిగివస్తుంది. ట్రంప్ బృందం ప్రతిపాదనలకు ఉక్రెయిన్ సరేనంటే, అది ఐదోవంతు భూభాగాన్ని రష్యాకు వదులుకోవలసి వస్తుందని విశ్లేషకులు అంటున్నారు. ఆ మేరకు రష్యాను సంతృప్తిపరచి, మిగతా ఉక్రెయిన్‌ను పునర్నిర్మించడానికీ, ఆర్థికంగానూ, ఆయుధపరంగానూ అండగా ఉండటానికీ అమెరికా హామీ పడవచ్చు.

గెలిచిన యుద్ధాలతోనే కాదు, నిలిపినవాటితోనూ, నిలువరించినవాటితోనూ తాను విజయాన్ని లెక్కిస్తానని ట్రంప్ చెప్పుకున్నారు. పదిహేను నెలలుగా సాగుతున్న గాజాయుద్ధాన్ని ముగించడానికి చాలాకాలం ప్రయత్నాలు జరిగినమాట నిజం. ట్రంప్ అధికారంలోకి రావడానికి ముందే చర్చలు మొదలైనా, దిగిపోతున్న బైడెన్‌మాటకంటే, మరో నాలుగేళ్ళు అధ్యక్షుడుగా ఉండబోతున్న ట్రంప్ హెచ్చరికలకే నెతన్యాహూ దిగివచ్చారని అంతా నమ్ముతున్నారు. కాల్పుల విరమణతో పడిన ఆ తొలి అడుగు అంతిమశాంతికి దారితీస్తుందని భావిస్తున్నారు. స్వల్పకాలంలోనే ఉక్రెయిన్‌ను గెలవగలనని, అంతిమంగా తనదే పైచేయి అవుతుందని దానితో యుద్ధాన్ని ఆరంభిస్తున్న కొత్తలో పుతిన్ నమ్మారు. కానీ, అనేకశక్తుల రంగప్రవేశంతో యుద్ధం మరింత విస్తరిస్తూవచ్చింది, వెయ్యిరోజులకుపైగా ఎడతెగకుండా కొనసాగుతోంది. ఇంకా ఎంతకాలం సాగినా అంతిమంగా విజేతలంటూ ఎవరూ లేకపోయినా, అణ్వాయుధ వినియోగం ప్రమాదం కూడా పెరగవచ్చు. ఈ నేపథ్యంలో ట్రంప్ ఇచ్చిన హామీకి అనుగుణంగా అడుగులు పడితే సంతోషించాల్సిందే.

ప్రపంచ ప్రయాణం 19వ శతాబ్దంలోకి..?




■ రాహుల్ కుమార్

మనుషుల సంతోషాన్ని విస్తృతపరుస్తూ సమాజం ముందుకే వెళుతుందని మనం నమ్ముతాం. మొన్నటికంటే నిన్న మిన్నగా.. నిన్నటి కంటే నేడు ఘనంగా.. నేటి కంటే రేపు మరింత అద్భుతంగా ఉంటుందంటూ రెండుమూడు వందలేళ్లల్లో చాలా రచనలు వచ్చాయి. ఆశలు లేకపోతే అడుగులే పడవు. భవితకు భరోసా కనపడకపోతే మన ప్రయత్నాల్లో ఊపూ ఉత్సాహం ఉండదు. సుదీర్ఘ కాలప్రవాహంలో సమాజం ముందుకు నడవటం నిజం! స్థూలంగా చరిత్ర చెప్పేది ఇదే! కానీ వెనుకంజ లేని సమాజమూ జీవితమూ ఉండవు. ఆ వెనుకంజ ఒక్కోసారి భయం కొల్పుతుంది. గతాన్ని నెత్తిమీదకు తెచ్చి పెడుతుంది. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి డొనాల్డ్ ట్రంప్ గెలిచిన నాటి నుంచి ఒక వెనుకంజ గురించి తరచూ వినపడుతోంది. అంతర్జాతీయ వ్యవహారాల వ్యాఖ్యాత, ప్రముఖ పాత్రికేయుడైన ఫరీద్ జకారియా ఇటీవల తన 'గ్లోబల్ పబ్లిక్ స్క్వేర్ టీవీ కార్యక్రమంలో ట్రంప్ విజయంతో 19వ శతాబ్దం నాటి సామ్రాజ్యవాదపు (ఇంపిరియలిజం) పోకడలు మళ్లీ విజృంభిస్తాయా అనే ప్రశ్నను లేవనెత్తారు. సంతృప్తికరమైన జవాబు మాత్రం రాలేదు. సమాధానాలు రానంత మాత్రాన ప్రశ్నల విలువలు తగ్గిపోవు. చరిత్రలో జవాబులకంటే ప్రశ్నలకే బలం ఎక్కువ. మనిషి అన్వేషణలన్నీ ప్రశ్నలతోనే మొదలయ్యాయి. మహామహా ఆవిష్కారాలన్నీ వాటితోనే సాధ్యమయ్యాయి. వస్తువులను, పరికరాలను సృష్టించుకుని మనుగడ సాగిస్తున్న మనుషులకు ప్రపంచ సృష్టికి కూడా ఎవరో కారణమై ఉంటారనే ప్రశ్న తట్టి.. జవాబుల కోసం సాగించిన చింతనాన్వేషణతోనే మతాలన్నీ ఊపిరులు పోసుకున్నాయి. ఒక పథకంతో, శ్రమతో చేసే వస్తు, పరికర సృష్టే మానవ జీవనసారం కాబట్టి ఈ చరాచర ప్రపంచమూ అటువంటి సృష్టిజనితమేనని మనిషి అనుకున్నాడు. కాబట్టి ప్రశ్నకున్న విశిష్ట ప్రాధాన్యత నుంచి చూస్తే 19వ శతాబ్దం నాటి సామ్రాజ్యవాద పోకడలు మళ్లీ విజృంభిస్తున్నాయా? అన్నది సందర్భోచితమైందిగానే తోస్తుంది. లోతుగా పరిశీలిస్తే ఆ ప్రశ్నకు సమాధానం అవుననే కొంతమేరకు చెప్పుకోవాల్సి వస్తుంది. ఆనాటి పోకడలు కొన్ని ఇప్పుడు స్పష్టంగా కనపడుతున్నాయి. ఇవి ఎంత బలపడితే అంతగా ప్రపంచం వెనుకడుగులు వేస్తున్నట్టుగా కచ్చితంగా భావించొచ్చు.

19వ శతాబ్దంలో సామ్రాజ్యవాదాన్ని అనుసరించిన దేశాలన్నీ జాతీయవాదంతోనే తమ ఆక్రమణలను, ఆధిపత్యాన్ని సమర్థించుకున్నాయి. తమ దేశమే అన్ని రంగాల్లోనూ ముందుండాలనే వాదననే ప్రచారాస్త్రంగా చేసుకుని ప్రజలను యుద్ధోన్ముఖంగా నడిపించాయి. మొదటి ప్రపంచయుద్ధం ఆ విధంగానే వచ్చింది. అగ్రస్థానం కోసం అన్ని నియమాలనూ కాలదన్నాయి. వెనుకబడిన దేశాల ప్రజలకు నాగరికతనూ ఆధునికతనూ సాంకేతిక–శాస్త్ర విజ్ఞానాన్నీ అందివ్వటానికే ఆక్రమణలూ ఆధిపత్యాలూ యుద్ధాలూ అవసరమని వాదించాయి. సామ్రాజ్యవాదం ప్రత్యక్ష ఆక్రమణ రూపంలోనే ఉండాల్సిన పనిలేదు. కీలుబొమ్మ ప్రభుత్వాలను పెట్టి కీలక నిర్ణయాలన్నీ గుప్పెట్లో పెట్టుకుని సంపదను తరలించుకుపోయే పరోక్ష సామ్రాజ్యవాదమూ ఉంటుంది. రెండిటిలోనూ జరిగేది ఒకటే. ముడిసరుకుల సరఫరా కేంద్రంగా ఆక్రమిత దేశాలను మార్చివేయటం, పారిశ్రామిక ఉత్పత్తులకు కొనుగోలు మార్కెట్లుగా దిగజార్చటం సామ్రాజ్యవాదంలో ప్రధానంగా ఉంటుంది. ఇప్పుడైతే కాలుష్యకారక పరిశ్రమలను పెద్దఎత్తున తరలిస్తున్నారు. అన్ని వ్యవస్థలనూ సామ్రాజ్యవాదం తన అవసరాలకు అనుగుణంగా మార్చి వేస్తుంది. రాజకీయాలు మారిపోతాయి. పండే పంటలు మారిపోతాయి. చేసే ఉత్పత్తులు మారిపోతాయి. భూములపై హక్కులు మారిపోతాయి. పాతవర్గాలు పోతాయి. కొత్త వర్గాలు పుట్టుకొస్తాయి. ఇక రైల్వేలు, పోర్టులు, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, ఆధునిక విద్యా సౌకర్యాలు.. శాంతిభద్రతల స్థాపన లాంటివన్నీ సామ్రాజ్యవాద అవసరాల్లో భాగంగా కొంతమేరకు వస్తాయి. సామ్రాజ్యవాదం అహంకారపూరిత జాతీయవాదం చాలా సందర్భాల్లో పెనవేసుకునే ఉంటాయి.

అమెరికా అగ్రస్థానంలో ఉండాలని పదేపదే వినిపిస్తున్న వాదనను పరిశీలిస్తే ఆ తరహా జాతీయవాదమే కనపడుతుంది. ఇతర దేశాల పట్ల అనుసరించాల్సిన మర్యాదలను విపరీత జాతీయవాదం పాటించదు. పన్నుల్లో అసంబద్ధత ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవటం ఆధునిక దౌత్య నీతి. ట్రంప్ హెచ్చరికలను చూస్తే ఆ దౌత్యనీతి ఛాయలు ఎక్కడా కనిపించవు. ఇంతపన్ను విధిస్తాం.. అంత పన్ను విధిస్తాం.. అనే ఏకపక్ష ప్రకటనలే మనం వింటున్నాం. అమెరికాలో 51వ రాష్ట్రంగా కెనడా చేరాలనీ, గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేస్తామనీ, పనామా కాలువను తిరిగి స్వాధీనం చేసుకుంటామనీ చేసే ప్రకటనలు సామ్రాజ్యవాద కాలాన్ని గుర్తుకు తెస్తాయి. దౌత్య పద్ధతులను, ఒప్పందాలను ఖాతరు చేయకపోవటం సామ్రాజ్యవాదంలో ఒక ప్రధాన లక్షణంగా ఉండేది. పరస్పర అంగీకారాల ద్వారా ఏర్పడిన సంస్థలను తప్పుపట్టటం, వాటి నుంచి వైదొలగటం ఆనాటి పోకడల్లో భాగమే. ప్రపంచ ఆరోగ్యసంస్థ నుంచీ ప్రపంచ పర్యావరణ ఒప్పందం నుంచీ తప్పుకోవటాన్ని ఇంకోలా అర్థం చేసుకోలేం. దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్యం జరగాలనీ దిగుమతులు-ఎగుమతులపై పన్నులు కనీస స్థాయిలో ఉండాలనీ ఆర్థిక సంస్కరణల పేరిట వివిధ దేశాలకు నిర్దేశించిందీ అమెరికా పాలకులే. ఇప్పుడు దానికి భిన్నంగా 19వ శతాబ్దంలో చేసినట్టు అధిక పన్నులను విధించి చౌక ఉత్పత్తులతో తమకు పోటీదారులుగా మారిన దేశాలను కట్టడి చేయాలనీ చూస్తున్నారు. చైనాతో వ్యవహరిస్తున్న తీరే దీనికి నిదర్శనం. పారిశ్రామిక విప్లవం తర్వాత ఇప్పటి ధనిక దేశాలన్నీ ఆనాటి పోటీ దేశాల ఉత్పత్తులపై విపరీతంగా పన్నులు వేసి వినియోగదారులు వాటిని కొనకుండా చేశాయి. భారత-చైనా సంప్రదాయ ఉత్పత్తులను అలాగే దెబ్బతీశారు. అధికపన్నుల విధింపులనే 'టారిఫ్ వాల్స్'గా పిలుస్తారు. ట్రంప్ హెచ్చరికలు కూడా ఆ 'వాల్స్' లాంటివే. ట్రంప్ దూకుడు చూస్తుంటే ప్రపంచ వాణిజ్య సంస్థ నుంచి కూడా వైదొలగినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు.

పర్యావరణ విధ్వంసం 19వ శతాబ్దంలో విపరీతంగా పెరిగింది. 1869–1914ల మధ్య కాలాన్ని సామ్రాజ్యవాదం ఉచ్ఛదశగా చరిత్రకారులు పరిగణిస్తారు. ఆ కాలంలో జరిగిన పర్యావరణ విధ్వంసంతో ఏ యుగాన్నీ పోల్చలేం. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లో పర్యావరణం గణనీయ మార్పులకు లోనైంది. ప్రకృతిని మనుషుల మనుగడకు ఆధారమని భావించకుండా దాన్ని జయించటం నాగరికత పరమార్థంగా ఆనాడు మారింది. పర్యావరణ పరిరక్షణ అనే భావనే ఆనాడు పాలకుల్లో లేదు. శిలాజ ఇంధనాలు కలగచేసే నష్టాలు తెలియవు. అడవుల కొట్టివేత విపరిణామాలు తెలియవు. పరిశ్రమల కాలుష్యం అరికట్టే విధానాలూ లేవు. విషయపరిజ్ఞానమూ లేదు. కొన్ని హెచ్చరికలు ఉన్నా లాభాలపై యావతో చెవికెక్కించుకోలేదు. 1970ల తర్వాతే పర్యావరణ చైతన్యం పెరిగింది. ఉష్ణోగ్రతలను పారిశ్రామిక విప్లవం నాటి కంటే రెండు డిగ్రీలు కిందకు దించకపోతే మానవాళి మనుగడే ప్రశ్నార్థకం అవుతుందనే హెచ్చరికలు ఎన్నో ఉన్నాయి. ఇవేమీ పట్టించుకోకుండా 19వ శతాబ్దం నాటి సామ్రాజ్యవాద పోకడలతో పర్యావరణ పరిరక్షణ చర్యలను ఈసడించుకోవటం స్పష్టంగా కనపడుతుంది. పర్యావరణ విపరిణామాలతో ఆర్కిటిక్ మంచుఫలకాలు కరుగుతున్నా ఉపేక్షిస్తూ అక్కడున్న గ్రీన్‌ల్యాండ్‌ను నియంత్రణలోకి తీసుకోవాలన్న ప్రతిపాదన వెనుకా అదే కన్పిస్తుంది. అక్కడున్న అరుదైన లోహాలు, చమురు సంపదపై ధ్యాసతో పాటు సైనిక ప్రయోజనాలే లక్ష్యంగా గ్రీన్‌ల్యాండ్ స్వాధీనం కోసం అడుగులు పడుతున్నాయి. పనామా కాలువను ఎట్లాగైనా స్వాధీనం చేసుకుంటామని చెబుతున్న ట్రంప్.. అసలు ఆ కాలువను కట్టిందే అమెరికానేనని చేస్తున్న వాదన వెనుక పెద్ద చరిత్రే ఉంది. పనామా ఒకప్పుడు కొలంబియా దేశంలో ఒక రాష్ట్రంగా ఉండేది. 19వ శతాబ్దం చివరి నాటికి హవాయి, ఫిలిప్పీన్స్‌లను చేజిక్కించుకున్న అమెరికాకు అట్లాంటిక్-పసిఫిక్ సముద్రాలను కలిపేలా కాలువ కావాల్సివచ్చింది. ఆ కాలువలో యుద్ధనౌకలు తిరగటం ఆనాడు అమెరికాకు అత్యవసరం. కాలువకు భూభాగం అడిగితే కొలంబియా అంగీకరించలేదు. 1903లో పనామాలో తిరుగుబాటు జరిగితే వెంటనే అమెరికా మద్దతు ప్రకటించి ప్రత్యేక దేశంగా గుర్తించింది. ప్రతిఫలంగా కాలువ తవ్వే హక్కునీ కాలువకు అటూఇటూ 8 కిలోమీటర్ల భూమినీ అమెరికాకు అప్పగించింది. కాలువ తవ్వకం 1914 ఆగస్టు 15న పూర్తయింది.

గత ఒప్పందాలన్నీ తిరగతోడితే దేశాల సరిహద్దులే చెదిరిపోతాయి. ఏనాడో వదులుకున్న హక్కులను ఇప్పుడు కావాలనుకుంటే దేశాల తలరాతలు మారిపోతాయి. ఉక్రెయిన్‌తో పాటు మధ్య ఆసియా దేశాలపైనా రష్యా హక్కులు కోరొచ్చు. తైవాన్‌ను చైనా బలవంతంగా స్వాధీనం చేసుకోవచ్చు. అంతెందుకు మెక్సికో తాను అమెరికాకు కోల్పోయిన భూభాగాలనూ తిరిగి అడగొచ్చు.

19వ శతాబ్దం నాటి సామ్రాజ్యవాదం పోకడలనే కాకుండా దాని విశ్వరూపం తెలుసుకుంటే ఇప్పటి తరాలకు ఆశ్చర్యంగా ఉంటుంది. జర్మన్ భౌగోళిక శాస్త్రవేత్త అలెగ్జాండర్ సుపన్ 1900లో ఇచ్చిన లెక్కల ప్రకారం.. అమెరికా, యూరపు దేశాలు ఆఫ్రికా ఖండంలో 90.4 శాతం, పసిఫిక్ ఐలాండ్స్‌లో 98.9 శాతం, ఆసియాలో 56.5 శాతం, ఆస్ట్రేలియాలో 100 శాతం, అమెరికాలో 27.2 శాతం భూభాగంపై ఆధిపత్యం సంపాదించాయి. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ, పోర్చుగల్, నెదర్లాండ్స్, బెల్జియం, ఇటలీ... అంటే తొమ్మిది దేశాలు ప్రపంచాన్ని ఆ రీతిలో పంచుకున్నాయి.

అమెరికాలో ట్రంప్ కోరుకున్నట్టుగా అన్నీ జరిగితే 21వ శతాబ్దం కచ్చితంగా కొన్ని అంశాల్లోనైనా 19వ శతాబ్దంలోకి పరకాయప్రవేశం చేస్తుంది. ఆనాటి సామ్రాజ్యవాద ఆత్మను ఆవాహన చేసుకుంటుంది. జాతి ఆధిక్యతా–న్యూనతా భావాల సుడిలో చిక్కుకుంటుంది. పర్యావరణ పరిరక్షణపై నిబద్ధత పలచబారిపోతుంది. ఇంటాబయటా వైవిధ్యాలను ఆక్షేపించే ఉపద్రవాన్ని తెస్తుంది. అసమానతలపై ఉపేక్షతను ప్రదర్శిస్తుంది. అంతర్జాతీయ సంస్థల మనుగడకు ప్రమాదం వస్తుంది. శరణార్థులకు చోటు కరువవుతుంది. భిన్న లైంగిక ప్రవర్తన బలిపీఠం ఎక్కుతుంది. అబార్షన్ హక్కుకు విఘాతం కలుగుతుంది. జాతీయవాదానికి స్వార్థమే పరమార్థమవుతుంది. చివరకు ఉదార ప్రజాస్వామ్యమే కుదేలవుతుంది!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

> ట్రంప్ కోరుకున్నట్లుగా అన్నీ జరిగితే 21వ శతాబ్దం కచ్చితంగా కొన్ని అంశాల్లోనైనా 19వ శతాబ్దంలోకి పరకాయప్రవేశం చేస్తుంది. ఆనాటి సామ్రాజ్యవాద ఆత్మను ఆవాహన చేసుకుంటుంది. జాతి ఆధిక్యతా–న్యూనతా భావాల సుడిలో చిక్కుకుంటుంది. పర్యావరణ పరిరక్షణపై నిబద్ధత పలచబారిపోతుంది. ఇంటాబయటా వైవిధ్యాలను ఆక్షేపించే ఉపద్రవాన్ని తెస్తుంది. అసమానతలపై ఉపేక్షతను ప్రదర్శిస్తుంది. చివరకు ఉదార ప్రజాస్వామ్యమే కుదేలవుతుంది!

> అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి డొనాల్డ్ ట్రంప్ గెలిచిన నాటి నుంచి ఒక వెనుకంజ గురించి తరచూ వినపడుతోంది. ప్రముఖ పాత్రికేయుడైన ఫరీద్ జకారియా ఇటీవల తన 'గ్లోబల్ పబ్లిక్ స్క్వేర్' టీవీ కార్యక్రమంలో ట్రంప్ విజయంతో 19వ శతాబ్దం నాటి సామ్రాజ్యవాదపు పోకడలు మళ్లీ విజృంభిస్తాయా అనే ప్రశ్నను లేవనెత్తారు.

రాజ్యాంగస్ఫూర్తిని చాటే రేడియో కవి సమ్మేళనం

ఆకాశవాణి 1956 నుంచి నిర్వహిస్తూ వస్తున్న సర్వ భాషా జాతీయ కవి సమ్మేళనం విలక్షణమైనది. రాజ్యాంగ స్ఫూర్తికి, భిన్నత్వంలో ఏకత్వం అనే భావానికి ప్రతిరూపంగా, తనదైన శైలిలో అన్ని భాషల కవులను సంవత్సరానికి ఒకసారి ఒకే వేదిక మీద కలిపే అపూర్వ సందర్భమిది. ప్రతి ఏటా 23 భాషల్లో ఒక్కో కవిని ఎంపిక చేసి, అందరి కవితలనూ అన్ని భాషలలోకి అనువదించి జనవరి 25 రాత్రి పది గంటలకు దేశంలోని అన్ని కేంద్రాల ద్వారా ప్రసారం చేయటం ఆనవాయితీ. మరుసటి రోజు అంటే దేశ రిపబ్లిక్ దినోత్సవం నాడు మరోసారి అన్ని కేంద్రాలు వారి వీలును బట్టి ప్రసారం చేస్తాయి. ఇలా ఏ ప్రసార మాధ్యమంలోనూ జరుగదు. కవులను ఒకే వేదిక మీదకు తీసుకురావటం వల్ల వారి వారి భావాలను, ఆలోచనలను పంచుకోవడానికి వీలుకలుగుతుంది. భిన్న ప్రాంతాల ఆచార సంప్రదాయ సాంస్కృతిక రంగాల అంశాలను కలబోసుకునే అద్భుత అవకాశం ఉంటుంది. ఒక సమైక్య సమభావం బలపడుతుంది.

ఆకాశవాణి 2025 సర్వ భాషా జాతీయ కవి సమ్మేళనానికి ముంబై ఆకాశవాణి కేంద్రం వేదిక అయ్యింది. ఈ కార్యక్రమంలో తెలుగు భాష నుంచి ఏనుగు నరసింహారెడ్డి పాల్గొన్నారు. హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం తన 75 ఏళ్ళ చరిత్రలో 2014లో ఈ సర్వ భాషా జాతీయ కవి సమ్మేళనం అత్యంత వైభవంగా నిర్వహించింది. ప్రతి కవికి ఈ సమ్మేళనంలో పాల్గొనాలనే కోరిక ఉండటం సహజం. అవకాశం వచ్చినవారు గౌరవంగా, కొంచెం గర్వంగా అనుభూతి పొందుతారు కూడా. ఎవ్వరూ దీనికి అతీతులు కాకపోవచ్చు. ఇతర భాషల కవితలను అనువాదం చేయటం కూడా కత్తి మీద సాము లాంటిది. కవిత్వంలో, అనువాదంలో లబ్ధప్రతిష్ఠులతో ఈ పని పూర్తిచేయటం కూడా బృహత్ కార్యక్రమమే. ఈ సంవత్సరం ముకుంద రామారావు, మందలపర్తి కిషోర్, నందిని సిధారెడ్డి, కొలకలూరి ఇనాక్, అమ్మంగి వేణుగోపాల్, యార్లగడ్డ రాఘవేంద్రరావు, సుమనస్పతి రెడ్డి, సమ్మెట నాగమల్లేశ్వరరావు, నాళేశ్వరం శంకరం, సుధామ, యాకుబ్, శిలా లోలిత, చిల్లర భవానిదేవి, మామిడి హరికృష్ణ, ఐనంపూడి శ్రీలక్ష్మి, దర్భశయనం శ్రీనివాసాచార్య, తాడేపల్లి పతంజలి, అనంత పద్మనాభరావు, జింబో (మంగారి రాజేందర్) తదితరులు వివిధ భాషల కవితలను తెలుగులోకి అనువాదం చేశారు. వీరందరినీ హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం ఒకే వేదిక మీదకి తీసుకువచ్చి సత్కరించి, వారి అనువాదాలను వారితోనే చదివించి రికార్డు చేసింది. ఈ మహత్తర కార్యక్రమం ప్రోగ్రామ్ హెడ్ కొమ్మారెడ్డి లక్ష్మీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో సుంకసరి రమేష్, అవధానులు శ్రీహరి, సందీప్‌ల బృందం పూర్తి చేసింది.

గత నాలుగైదు సంవత్సరాలుగా నాకు కూడా ఈ కార్యక్రమాన్ని దగ్గరగా పరిశీలించే అవకాశం దొరికింది. ఇతర భాషలలో కంటే తెలుగులోనే ప్రయోగాలు ఎక్కువగా కనిపించాయి. తెలుగు భాష కవిత్వంలోనే సామాజిక సంక్షోభాలు, మానవ సంబంధాలు, సమకాలీన మానసిక జీవన సంఘర్షణలు ఇలా ఎన్నో ఎన్నెన్నో అంశాలు గురించి కవుల మథనం స్పష్టంగా కనిపించింది. అయితే మన వారి కవిత్వం ఇతర భాషల్లోకి పెద్దగా తర్జుమా అవుతున్నట్లు లేదు. ఇది బాగా లోటు అనిపిస్తోంది. ప్రస్తుత కాలంలో ఆకాశవాణి నిర్వహిస్తున్న సర్వ భాషా జాతీయ కవి సమ్మేళనం సాహిత్య అభిలాషులకు, అభిమానులకు ఎడారిలో ఒయాసిస్సు వంటిందని చెప్పటానికి సందేహించవలసిన అవసరం లేదు.

– వలేటి గోపీచంద్
ఆకాశవాణి విశ్రాంత అధికారి

'స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్'లో వాహనాల 'తుప్పు'ను వదిలించండి!

ప్రతీ మూడో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' పేరుతో పచ్చదనం- పరిశుభ్రత కార్యక్రమాన్ని నిరంతరం చేపట్టాలన్న ఎన్డీఏ కూటమి నిర్ణయం ఆహ్వానించదగినదే. గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు ముగిసిన తరువాత ఫైళ్లను పద్ధతిగా కుట్టి, వాటిని రికార్డు రూమ్‌లో భద్రపరచడం, అలాగే కార్యాలయాలను శుభ్రపరచడం, ఆవరణలో చెత్తను తొలగించి, మొక్కలను నాటడం వంటి పనులు జరిగేవి. మొదట్లో కొంత బాగా జరిగినా తరువాత అదో మొక్కుబడి కార్యక్రమంగా మారింది. కాలక్రమంలో ఆ సంగతిని ప్రభుత్వం సహా అంతా మర్చిపోయారు. ఇప్పుడు ఈ-ఫైల్స్ విధానం రావడంతో కాగితపు ఫైళ్లను భద్రపరిచే పని చాలా వరకు తప్పింది. అయినా ఇంకా కొద్ది మొత్తంలోనైనా భౌతికంగా ఫైళ్లు నడుస్తున్నాయి. వాటికి తుది ఉత్తర్వులు జారీ చేసిన వెంటనే రికార్డ్ రూమ్‌కి పంపేలా ఉద్యోగులు చర్య తీసుకోవచ్చు. మూడో శనివారం వరకు ఆగనక్కర్లేదు. ఫైళ్లను ముగించిన వెంటనే రికార్డు రూముల్లో భద్రపరచడం అనేది నిరంతరం జరిగే ప్రక్రియగా ఉండాలి. అది ఉద్యోగుల నిత్యకృత్యం.

ప్రభుత్వ కార్యాలయాల్లో వినియోగించని వాహనాలు రాష్ట్రవ్యాప్తంగా వందల సంఖ్యలో ఉంటాయి. అవి తుప్పు పట్టి భూమిలోకి కుంగిపోయినట్టుగా కనపడుతుంటాయి. అలాగే వ్యవసాయశాఖ గతంలో రైతులకి అనేక యంత్రాలు, పరికరాలను పంపిణీ చేసేది. మిగిలిపోయిన వాటిని నిరుపయోగంగా ఉంచడంతో కార్యాలయాల్లో అవి తుప్పు పట్టి ఆవరణలో పడి ఉంటున్నాయి. ఇంజినీరింగ్ శాఖల్లో కూడా అనేక యంత్రాలు తుప్పు పట్టి ఉన్నాయి. పోలీసు స్టేషన్ల వద్ద, అటవీ శాఖ అధికారుల కార్యాలయాల వద్ద రాష్ట్రవ్యాప్తంగా వందలాది ద్విచక్ర వాహనాలు, కార్లు ఎండ, వానకు తడుస్తూ తుప్పు పట్టి కనిపిస్తాయి. అవి కోర్టు కేసుల్లో ఉన్నా, అధికారులు శ్రద్ధ తీసుకుని, కోర్టు అనుమతి పొంది వాటిని సకాలంలో వేలం ద్వారా విక్రయించడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో భాగంగా వినియోగంలో లేని యంత్రాలు, వాహనాలను వదిలించుకునే అంశాన్ని కూడా చేరిస్తే, అటు ప్రభుత్వానికి ఆదాయంతో పాటు, ఇటు పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంటాయి.

– మారిశెట్టి జితేంద్ర
రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్

గుండె జారని పాట

చెట్లను నరికేయడం
మొక్కల్ని పెరికేయడం కొత్త కాదు
మట్టి పూసుకున్న విత్తనాల నెట్లేరుతారో!

సగం పగిల్న దుఃఖిత చెమట చుక్కల దగ్గర
చేతులు కలిపిన అడుగుల సుందర ప్రపంచ కలల్ని
ఆదరంగా
అడవి కడుపులో దాచుకొనేది
ఒక్కసారే శిశిర మెందుకొచ్చిందో!

తలల వెలలు ఊరించడం ఇవ్వాళే కాదు గానీ
ఒక్కసారిగా పడమర దిక్కు
అడవినెందుకు ప్రేమించిందో!
చూపు ఎక్కరేకు
మంచుపొగ గాఢతర గోడెన్దుకు కట్టిందో!

మెటల్ డిటెక్టర్‌ను ప్రేమలో పడేసి
తన కన్నును తన వేలే పొడవడం కొత్త కాదు
అడివంతా రేలా పూల పరిమళాలు
నెత్తుటి వాసనెన్దుకేస్తున్నాయో!

ఈ విభూది పొద్దు మాటున
సాల్వాజుడుం తొడుక్కున్న ఎర్ర దుస్తుల చూపులు
కొండ శిఖరం చేరాకే
కగార్ గుడారాల తుపాకి కాళ్ళు మొలిచాయో!

ఈ పురిటి నొప్పుల మీద
అందమైన పదచిత్రాలు పొదగలేక పోతున్నాను
క్షమించండి!
ఈ దుఃఖపు ముద్దల చేతితో
గొంతు పెగలడం లేదు కాని

అదిగో
కల్లోల సముద్రం మీంచే
గుండెజారని జాలరి పాట వినిపిస్తోందిప్పుడు

– వడ్డెబోయిన శ్రీనివాస్

కృత్రిమమేధతో అందరికీ విద్య


ప్రపంచ జనాభా 81 బిలియన్‌లలో 24 శాతం పైగా నిరక్షరాస్యులు ఉన్నారు. 195 దేశాలలో 74 శాతంపైగా దేశాలు నిరక్షరాస్యత, అవిద్యతో నేటికీ పోరాటం సాగిస్తూనే ఉన్నాయి. ఈ భూమిపై ఉన్న ప్రతి మానవుడికి విద్య ఒక ప్రాథమిక మానవ హక్కుగా నిర్ధారిస్తూ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం తీర్మానం చేసింది. నిరక్షరాస్యత, అవిద్యలను పారద్రోలడానికి మానవజాతిని సమాయత్తం చేస్తోంది. ఈ లక్ష్యసాధనలో జనవరి 24ను అంతర్జాతీయ విద్యాదినోత్సవంగా ప్రకటించింది. వివిధ దేశాల ప్రభుత్వ సంస్థలను, విద్యారంగంపై కృషి చేస్తున్న అన్ని సంస్థలను ఏకీకృతం చేసి – తమ కార్యకలాపాలను పునఃసమీక్షించుకుంటూ ముందుకు నడిపేందుకు ఈ అంతర్జాతీయ విద్యాదినాన్ని ప్రతిపాదించింది.

లింగభేదాలు, ఆర్థిక అసమానతలు అధిగమించి 2030 నాటికి అత్యుత్తమమైన ఉన్నత విద్యను, ప్రామాణికమైన వృత్తి శిక్షణలను విశ్వవ్యాప్తంగా అందరికీ సమకూర్చాలని ఐక్యరాజ్యసమితి విధివిధానాలను సిద్ధంచేసింది. ప్రపంచదేశాలు విద్యను ప్రతి పౌరుడికి తప్పనిసరి చేస్తూ, ఉచితంగా అందరికీ సమకూరే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కోరింది. దేశాలన్నీ పాఠశాలలో మౌలిక వసతులను మెరుగుపరుస్తూ, ఉపాధ్యాయుల సంఖ్యను పెంచి, డిజిటల్ విద్యావిధానంవైపు పురోగమించటం నేటి అనివార్య అవసరంగా ఐక్యరాజ్యసమితి భావిస్తోంది. ఈ నేపథ్యంలో 2025 జనవరి 24 విద్యాదినోత్సవాన్ని 'Artificial Intelligence and Education: Preserving Human Agency in a World of Automation' అంశంగా నిర్వహిస్తోంది.

20వ శతాబ్దంలో శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రపంచం సాధించిన పురోగతి విద్యారంగంలో పెనుమార్పులకు కారణం అయ్యింది. ఇంటర్నెట్, కంప్యూటర్లు, ట్యాబులు, మొబైల్స్ దైనందిన పాఠ్యాంశ బోధనలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. ఇంటరాక్టివ్ డిజిటల్ బోర్డులు, ఈ బుక్స్ కంప్యూటర్ ల్యాబ్‌లు ఆధునిక తరగతి గదులకు చిరునామాగా మారాయి. ఇంటర్నెట్ సహకారంతో ఆన్‌లైన్ తరగతులు, వర్చువల్ క్లాసులు విద్యాబోధనలో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించాయి. అంతర్జాలం కేంద్రంగా వెబ్‌నార్ల సహకారంతో ప్రపంచ స్థాయి విద్యాబోధన విశ్వవ్యాప్తంగా లభిస్తున్నది. ఈ నేపథ్యంలో కృత్రిమమేధతో విద్యాబోధన, పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యా ప్రణాళికల రూపకల్పన ఇత్యాది అవకాశాలను ఐక్యరాజ్యసమితి పరిశీలిస్తున్నది. ఈ సంవత్సరం జనవరి 24న నిర్వహిస్తున్న అంతర్జాతీయ విద్యా దినోత్సవంలో ఈ అవకాశాలపై ప్రపంచ దేశాలతో సమావేశాలు నిర్వహిస్తోంది.

కృత్రిమ మేధను విద్యారంగంలో మరింత ఎక్కువగా ఉపయోగించడానికి ప్రపంచ దేశాలు ప్రయత్నాలు ప్రారంభించాయి. కృత్రిమ మేధతో విద్యార్థుల గ్రహణశక్తిని పసిగట్టడానికి, తదనుగుణంగా పాఠ్య బోధనా ప్రణాళికలను రూపొందించడానికి కృషి జరుగుతోంది. కృత్రిమ మేధ సహాయంతో విద్యార్థుల ప్రజ్ఞా పాటవాలను గుర్తించడం, గ్రేడులను నిర్వహించడం వంటి పద్ధతులను పెంపొందిస్తున్నారు. పాఠ్యాంశాలపై ప్రశ్నోత్తరాలను నిర్వహించి, విద్యార్థుల సందేహాలను నివృత్తిచేసే కంప్యూటర్ అనువర్తనాలను తయారు చేస్తున్నారు. కృత్రిమ మేధతో విద్యార్థుల బలహీనతలను గుర్తించడం అపూర్వ విజయాలు సాధించడానికి తగిన సూచనలు సలహాలు అందించే 'అల్గారిథమ్'లను రూపొందిస్తున్నారు. ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యం మెరుగుపరచడానికి, విద్యార్థులు త్వరితగతిన పాఠ్యాంశాలు నేర్చుకునే నైపుణ్యాన్ని పెంపొందించడానికి కృత్రిమ మేధతో కంప్యూటర్ వ్యవస్థలను తయారు చేయటం ప్రారంభించారు. పాఠ్యప్రణాళికల రూపకల్పనకు, పాఠశాలల నిర్వహణకు, విద్యార్థుల ప్రజ్ఞా పాటవాలను అంచనా వేయడానికి కృత్రిమ మేధను పెద్దఎత్తున వినియోగించే ప్రయోగాలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నాయి. విద్యార్థులు చదువు మానివేయకుండా నియంత్రించడానికి, చదువులో వెనకపడకుండా పర్యవేక్షించడానికి, చదువుపై ఆసక్తిని పెంపొందించడానికి సరికొత్త అప్లికేషన్లను కృత్రిమ మేధతో అభివృద్ధి చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

> కృత్రిమ మేధతో విద్యార్థుల గ్రహణశక్తిని పసిగట్టడానికి, తదనుగుణంగా పాఠ్య ప్రణాళికలను రూపొందించడానికి కృషి జరుగుతోంది. ఏఐ సహాయంతో విద్యార్థుల ప్రజ్ఞాపాటవాలను గుర్తించడం, గ్రేడులను నిర్వహించడం వంటి పద్ధతులను పెంపొందిస్తున్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తిచేసే కంప్యూటర్ అనువర్తనాలను తయారు చేస్తున్నారు.



ఆధునిక పరిజ్ఞానాన్ని, కృత్రిమ మేధను అందిపుచ్చుకోవటంతో పాటు భారతదేశం నేటి జనాభా అవసరాలకు తగినన్ని పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలను పెంపొందించుకోవాలి. 1.4 బిలియన్ల జనాభాగల మన దేశంలో 1,113 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. సుమారు 14 లక్షల పైచిలుకు పాఠశాలలున్నాయి. ఈ సంస్థలకు మెరుగైన మౌలిక వసతులను కల్పిస్తూ సంఖ్య మరింత పెంచుకోవాలి. భారతదేశం జీడీపీలో 2.8 శాతం మాత్రమే విద్య కోసం కేటాయిస్తున్నది. దేశ జనాభాకు తగినంతగా ఈ కేటాయింపులు మరింత పెంచవలసివుంది. ప్రపంచంలో అత్యధిక జనాభాగల దేశాల జాబితాలో ప్రథమ స్థానంలో ఉన్న మన దేశం అక్షరాస్యతా శాతంలో 128వ స్థానంలో ఉంది. నూటికి నూరు శాతం అక్షరాస్యత సాధించిన దేశాలు ప్రపంచంలో అనేకం ఉన్నాయి.

దేశంలో 1.5 మిలియన్లపైగా విద్యార్థులు ఇంజనీరింగ్ మరియు సాంకేతిక శాస్త్రాలలో, 8.5 మిలియన్‌లపైగా విద్యార్థులు బి.యస్‌సి., బి.ఏ., బి.కామ్., మొదలైన సాధారణ శాస్త్రాలలో, 60 వేలకుపైగా వైద్యవిద్యార్థులు ప్రతి సంవత్సరం పట్టభద్రులు అవుతున్నారు. 1.4 బిలియన్ జనాభా గల మన దేశంలో ప్రతి సంవత్సరం పది మిలియన్ల జనాభాను మాత్రమే పట్టభద్రులుగా రూపొందించుకోగలుగుతున్నాం. ఇది భారతీయ సమాజాన్ని అప్రమత్తం చేస్తున్న ప్రమాదఘంటిక. ఈ సంఖ్య మరింత పెరగాలి అంటే కళాశాలల, విశ్వవిద్యాలయాల సంఖ్యను పెంచుకోవాలి. స్థాపించబడిన సంస్థలను మరింత బలోపేతం చేసుకోవాలి. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల జాబితాలో నేటికీ మన విశ్వవిద్యాలయాల ర్యాంకులు 145 అంతకన్నా క్రిందస్థాయిలోనే ఉంటున్నాయి. ఈనాడు ప్రపంచంతో పోటీపడుతున్న భారతదేశం విద్యారంగంపై మరిన్ని ఆర్థిక వనరులను వెచ్చించక తప్పదు. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగినన్ని కళాశాలలను, విశ్వవిద్యాలయాలను నెలకొల్పక తప్పదు.

భారతదేశ జనాభాలో 74 శాతంపైగా అక్షరాస్యులు ఉన్నప్పటికీ, వారిలో 66 శాతం ఇంటర్మీడియట్ అంతకంటే తక్కువ స్థాయిలోనే విద్యను విరమిస్తున్నారు. వీరిలో ఎక్కువ శాతం హైస్కూలు స్థాయిలోనే విద్యను విరమిస్తున్నారు. ఇలా విద్యను వదిలేస్తున్న వారిలో ఎక్కువశాతం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారే కావటం గమనార్హం. వీరు చదువులు వదిలేసి పొట్టకూటికోసం కార్మికులుగా మారుతున్నారు. జాతీయ స్థాయిలో, రాష్ట్రస్థాయిలో ప్రభుత్వాలు ఈ సమస్య పరిష్కారం కోసం అనేక ప్రయత్నాలు ఇప్పటికీ కొనసాగిస్తూనే ఉన్నాయి. భారతదేశం ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. శాస్త్ర సాంకేతిక అభివృద్ధిని అందిపుచ్చుకుంటూ విజ్ఞాన ఆధారిత ఆర్థిక శక్తిగా అత్యున్నత స్థానం పొందాలని పరుగులు పెడుతున్నది. ఈ ప్రయాణంలో విద్యారంగం కీలకం. నైపుణ్యం ఆధారిత ఉపాధి అవకాశాలు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యవల్లనే సాధ్యపడతాయి. మన దేశ విద్యారంగ ప్రణాళికలు ఈ దిశలో రూపుదిద్దుకోవలసి ఉంది.

■ భరత్ వేదాంతం
(నేడు అంతర్జాతీయ విద్యాదినోత్సవం)



పెనుగంచిప్రోలు తహసీల్దార్ కార్యాలయంలో ఊడుతున్న పెచ్చులు

నిత్యం ప్రజల రాకపోకలతో కిటకిటలాడే తహసీల్దార్ కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఎక్కడ చూసినా పగుళ్లిచ్చిన గోడలు, కారుతున్న పైకప్పులు దర్శనవిస్తున్నాయి. స్లాబ్ పెచ్చులు ఊడిపడుతుండటంతో విధులు నిర్వహించడానికి ఉద్యోగులు భయపడుతున్నారు. వర్షం వస్తే రికార్డులు తడిచిపోగా, కంప్యూటర్లలోకి నీరు చేరి మొరాయిస్తున్నాయి. నేటికీ బ్రిటిషు వారి కాలంలో నిర్మించిన భవనాల్లోనే కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని ఎక్కువశాతం కార్యాలయాలు కొనసాగుతున్నాయి. దినదినగండంగా మారిన తహసీల్దార్ కార్యాలయాల భవనాల స్థితిగతులపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్ కథనం.

దినదినగండం..

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయ భవనాలు

పగుళ్లిచ్చిన గోడలు.. కారుతున్న పైకప్పులు

వర్షం వస్తే తడుస్తున్న రికార్డులు.. మొరాయిస్తున్న కంప్యూటర్లు

ఊడి పడుతున్న పెచ్చులు.. పనిచేసేందుకు భయపడుతున్న ఉద్యోగులు

నేటికీ బ్రిటిషు వారి కాలం నాటి భవనాల్లోనే కొనసాగింపు

కార్యాలయాలకు రావడానికి జంకుతున్న జనం



జగ్గయ్యపేట తహసీల్దార్ కార్యాలయం పైకప్పుపై కప్పిన నల్ల ప్లాస్టిక్ పట్టాలు



నందిగామ తహసీల్దార్ కార్యాలయంలో కుంగిన ఫ్లోరింగ్

(ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్): కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఇప్పటికీ అనేక చోట్ల బ్రిటీషు కాలం నాటి భవనాలనే తహసీల్దార్ కార్యాలయాలుగా ఉపయోగిస్తున్నారు. వీటికి మరమ్మతులు చేసుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. వీటిలో వర్షం పడితే తడిచిపోయే కార్యాలయాలు ఎన్నో ఉన్నాయి. స్లాబులు పెచ్చులూడి పోతున్నాయి. ఇలాంటి కార్యాలయాల్లో పనిచేసేందుకు ఉద్యోగులు భపడుతున్నారు. ఒకటి, రెండు కార్యాలయాలకు నూతన భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరైనా పనులు అసంపూర్తిగా ఉన్నాయి. పునాదులు, మొండిగోడలతో ఏళ్ల తరబడి దర్శనమిస్తున్నాయి.

● బ్రిటిష్‌కాలం నాటి పాత భవనంలో జగ్గయ్యపేట తహసీల్దార్ కార్యాలయం నడుస్తోంది. భవనానికి మరమ్మతులు చేయించడం మినహా నూతన భవన నిర్మాణానికి ప్రయత్నాలు ఇప్పటి వరకు జరగలేదు. పాత భవనం కావడంతో వర్షం వస్తే లోనికి నీరు వస్తుంది. వర్షం పడకుండా పైన కవర్లు వేసి నడిపిస్తున్నారు. ఆవరణ అంతా అక్రమ రవాణాలో భాగంగా స్వాధీనం చేసుకున్న ఇసుక కుప్పలు, పిచ్చిచెట్లతో నిండిపోయి చిట్టడవిని తలపిస్తోంది. 2013లో వీఆర్వో భవన్ పేరిట కార్యాలయానికి ఒక పక్క నూతన భవనాన్ని నిర్మించారు. వీఆర్వోలు, ఆర్‌ఐలు అక్కడే పనిచేస్తున్నారు.

● రెండు దశాబ్దాల కిందట నిర్మించిన చందర్లపాడు తహసీల్దార్ కార్యాలయం మరమ్మతులకు గురైంది. బండలు కుంగిపోవడంతో ఉద్యోగులు, ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. తక్షణమే మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

● పెనుగంచిప్రోలు తహసీల్దార్ కార్యాలయ భవనం నిర్మాణం జరిగి 20 సంవత్సరాలు అవుతోంది. పలు చోట్ల స్లాబు పెచ్చులూడి కింద పడిపోతోంది. పనిచేయాల్సి రావటం తమకు ఇబ్బందిగా ఉందని కార్యాలయ సిబ్బంది వాపోతున్నారు. ఇక్కడ తాగునీటి సదుపాయం కూడా లేదు. రికార్డు రూమ్‌కు భద్రత కరువైంది. వర్షం వస్తే భవనం నుంచి నీరు లోపలికి వస్తోంది.

● నాగాయలంక తహసీల్దార్ కార్యాలయంలో మొదటి అంతస్తులో శ్లాబు పెచ్చులూడిపోయి మిగతా 6లో..

ఆంధ్రజ్యోతి ఫోకస్

● కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో బ్రిటీషు కాలంలో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం శిథిలమైంది. దీంతో భారీ వర్షం వచ్చిన రోజున ఫైళ్లు, కంప్యూటర్లు తడుస్తున్నాయి. భవనం నిర్మించి 110 ఏళ్లు అయినప్పటికీ విలువైన కలప చెక్క చెదరకుండా ఉంది. అయితే పైకప్పు బంగళాపెంకులతో నిర్మించడం వల్ల భారీ వర్షాల సమయంలో వర్షపునీరు లోపలకు వస్తోంది. కంప్యూటర్లు ఉండే ఒక గదిపైన సిబ్బంది పైకప్పుపై టార్పాలిన్‌లు పరిచారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో శిథిలమైన భవనం స్థానంలో నూతన భవనాన్ని నిర్మించేందుకు రూ.90 లక్షల నిధులు కేటాయించారు. అప్పటి ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, అప్పటి మంత్రి కొల్లు రవీంద్ర, అప్పటి ఎంపీ కొనకళ్ల నారాయణరావు శంకుస్థాపన చేశారు. భవనం పునాదుల వరకు వచ్చింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రివర్స్ టెండరింగ్ వల్ల భవన నిర్మాణం కొనసాగలేదు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణం ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. కాగా ప్రస్తుతం బందరు మండలం సౌత్, నార్త్ మండలాలుగా విభజించినందు వల్ల ఎస్టిమేట్లు మార్చి రెండు కార్యాలయాలకు కావలసిన భవనాలను నిర్మించాల్సి ఉంది.



బందరులో పునాది దశలోనే నిలిచిపోయిన తహసీల్దార్ కార్యాలయ భవనం

బైపాస్ వేదన!

ఎన్‌హెచ్ ఆర్‌వో తప్పు చేస్తున్నారు.. ఏమీ చేయలేకపోతున్నాం!

విజయవాడ ఈస్ట్ బైపాస్ వద్దని కమిటీకి రాసింది ఆర్‌వోనే

- బాంబు పేల్చిన జిల్లా ప్రజా ప్రతినిధులు
- ఆయన చేతిలో అనేక రాష్ట్ర ఎన్‌హెచ్ ప్రాజెక్టులున్నాయి
- ఈస్ట్ బైపాస్‌లాగా మరే ప్రాజెక్టు బలికాకూడదు!
- వెస్ట్ బైపాస్‌లో ల్యాంకో పవర్ లైన్స్ అలైన్‌మెంట్ ఆయన చెప్పినట్టే కానిద్దాం
- కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే వసంత
- ఆర్‌వో సూచించిన అలైన్‌మెంట్‌ను అంగీకరించం.. ఎంతవరకైనా పోరాటం చేస్తామని రైతుల వెల్లడి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): "రాష్ట్ర జాతీయ రహదారి ప్రాజెక్టులన్నీ ఆయన చేతిలో ఉన్నాయి. వెస్ట్ బైపాస్ ల్యాంకో ట్రాన్స్ మిషన్ పవర్‌లైన్స్ అలైన్‌మెంట్ మార్పునకు ఎన్‌హెచ్ ఆర్‌వో అంగీకరించడం లేదు. ఇప్పటికే ఈస్ట్ బైపాస్ అవసరం లేదని కేంద్ర ఉపరితల మంత్రిత్వ శాఖ(మోర్తు)కు లేఖ రాశారు. ఈస్ట్ బైపాస్ ఆగిపోయింది. వెస్ట్ బైపాస్‌లో ల్యాంకో పవర్ లైన్స్ పాత 11 టవర్ల అలైన్‌మెంట్ ప్రతిపాదనసే మళ్లీ ముందుకు తెస్తున్నారు. మీరు ఆందోళన చేస్తున్నారని, మేము వద్దంటున్నామని ఈస్ట్ బైపాస్‌ను అడ్డుకున్నారు. ఆయన చేస్తున్నది తప్పని తెలిసినా రాష్ట్ర విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఏమీ చేయలేకపోతున్నాం. దయచేసి పాత అలైన్‌మెంట్‌కు అంగీకరించండి. మెరుగైన పరిహారం ఇప్పిస్తానని ఆర్‌వో చెబుతున్నాడు" అంటూ నైనవరం, జక్కంపూడి రైతులకు జిల్లా ప్రజా ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ లక్ష్మీశా అధ్యక్షతన రహస్యంగా రైతులతో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సమావేశమయ్యారు. గతంలో ఇదే కమిటీ నిర్వహించిన సమావేశంలో ఎన్‌హెచ్ ఆర్‌వోపై విరుచుకుపడి రైతులకు మద్దతుగా నిలబడిన ప్రజా ప్రతినిధులు గురువారం నాటి సమావేశంలో ఆర్‌వో తీరుపై తీవ్ర అసహనంతో తామేమీ చెయ్యలేకపోతున్నామని బాధపడ్డారు. తప్పు జరుగుతుందని తెలుస్తున్నా.. ఆర్‌వో చేతిలో అనేక జాతీయ రహదారి ప్రాజెక్టులు ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వంలో ముఖ్యంగా కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ (మోర్తు)లో ఆయనకు ఉన్న సత్సంబంధాల రీత్యా ఈ విషయంలో ఏమీ చేయలేకపోతున్నామన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఈ విషయంలో జిల్లా అధికారులు, రైతులు ఒక అవగాహనకు రావాల్సిందిగా సూచించారు. దీనికి రైతులు మాత్రం ససేమిరా అన్నారు. మూతపడి, వేరేవాళ్లకు లైన్లను మిగతా 6లో..



ల్యాంకో పవర్ లైన్ల మార్పిడి కథ మళ్లీ కొత్త మలుపు

విజయవాడ వెస్ట్ బైపాస్ ల్యాంకో పవర్ లైన్ల మార్పిడి కథ మళ్లీ కొత్త మలుపు తిరిగింది. కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన గురువారం రైతులతో సమావేశం జరిగింది. సుమారు ఏడాది కాలంగా పోరుబాట సాగిస్తున్న రైతుల అభీష్టానికి వ్యతిరేకంగా మళ్లీ 11 టవర్లతో కూడిన అర్ధ చంద్రాకారపు అలైన్‌మెంట్‌నే కొనసాగిస్తామని ఎన్‌హెచ్ ఆర్‌వో తేల్చి చెప్పడంతో విధిలేని పరిస్థితుల్లో రైతులను సముదాయించడం కోసం ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. అర్ధ చంద్రాకారపు అలైన్‌మెంట్‌తో ఎన్‌హెచ్ ఆర్‌వో చేసిన స్కామ్‌పై ఇప్పటికే కోర్టులో విచారణ జరుగుతోందని, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ కూడా విచారణ జరుపుతోందని, ఈ వ్యవహారంలో తాను దోషిగా మిగులుతానన్న భయంతోనే వెస్ట్ బైపాస్ ల్యాంకో పవర్ లైన్స్ అలైన్‌మెంట్ మార్పుపై ఒత్తిడి తెస్తున్నాడని రైతులు ఆరోపిస్తున్నారు. దీనికి ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌లు కూడా అంగీకరించారు. విజయవాడ వెస్ట్ బైపాస్‌లో ల్యాంకో పవర్ లైన్స్ అలైన్‌మెంట్ విషయంలో మేము కూడా మీ వెంటే ఉండి పోరాడిన విషయాన్ని గుర్తుంచుకోవాలని ప్రజా ప్రతినిధులు రైతులకు గుర్తు చేశారు.



కమ్యూనిటీ పోలీసింగ్‌కు **బెజవాడ గొప్ప ఉదాహరణ**

● పోలీసులపై సీఎం ప్రశంసలు

8లో

అమరావతికి శాశ్వతంగా వరద విముక్తికి చర్యలు



రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 26న జరిగే గణతంత్ర వేడుకలకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ముస్తాబవుతోంది. స్టేడియాన్ని మూడు రంగులతో అందంగా తీర్చిదిద్దుతున్నారు.




జిల్లాను ఇంధన హబ్‌గా తీర్చిదిద్దుదాం

● కలెక్టర్ లక్ష్మీశ

ఎనికేపాడులో సోలార్ ప్యానల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

8లో

సీఆర్‌డీఏ కమిషనర్‌గా కన్నబాబు బాధ్యతల స్వీకరణ



కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కన్నబాబు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) కమిషనర్‌గా కన్నబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాయంత్రం సీఆర్‌డీఏ కార్యాలయానికి వచ్చిన ఆయనకు అడిషనల్ కమిషనర్లు మల్లారపు నవీన్, జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించిన కన్నబాబు సీఆర్‌డీఏ అధికారులను పరిచయం చేసుకున్నారు. ఆ తర్వాత సీఆర్‌డీఏ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమావేశమయ్యారు. అమరావతి రాజధాని అభివృద్ధి ప్రాజెక్టు పనులకు సంబంధించిన అంశాలపై సమీక్ష చేశారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పాటులో లోకేశ్ కీలక పాత్ర

- జన్మదిన వేడుకల్లో ఎంపీ కేశినేని చిన్ని

6లో



కృష్ణా వర్సిటీలో అవకతవకలపై విజిలెన్స్ విచారణ

ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మచిలీపట్నం, జనవరి23(ఆంధ్రజ్యోతి) : కృష్ణా యూనివర్సిటీలో ఆర్థికపరమైన అంశాలలో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. యూనివర్సిటీలో భవనాల నిర్మాణం జరగకుండానే గతంలో పనిచేసిన వీసీలు, రిజిస్ట్రార్‌లు రూ.25కోట్ల వరకు బిల్లులు చేయడం, ఇటీవల కాలంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, సీడీసీ విభాగాల నుంచి రూ.4 కోట్ల నిధులను మళ్లించడం, నాక్ బృందం వచ్చిన సమయంలో యూనివర్సిటీ ఖాతా నుంచి రూ.5 లక్షలను డ్రా చేయడం, యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలల నుంచి నగదు రూపంలో వసూలు చేయడంపై ఇటీవల యూనివర్సిటీలో పనిచేసే ప్రొఫెసర్లు రెక్టార్ సమక్షంలో రిజిస్ట్రార్‌ను నిలదీశారు. దీంతో పాటు ప్రభుత్వానికి ఫిర్యాదు కూడా చేశారు. ఈ అంశంపై 'ఆంధ్రజ్యోతి' ఈ నెల 22న 'కృష్ణాయూనివర్సిటీలో వివాదాలు' అనే శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీలో జరుగుతున్న పరిణామాలపై విచారణకు ఆదేశించింది.

మూల్యాంకనం బిల్లులు రూ.78 లక్షలు విడుదల

కృష్ణా యూనివర్సిటీలో గత ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న జవాబు పత్రాల మూల్యాంకనం బిల్లులను గురువారం విడుదల చేసినట్లు ప్రొఫెసర్లు చెబుతున్నారు. ఆయా కళాశాలల యాజమాన్యాలను, యూనివర్సిటీ అకౌంట్స్ విభాగం అధికారులను పిలిపించిన వీసీ శ్రీనివాసరావు మూల్యాంకనం బిల్లులు రూ. 78 లక్షలను మంజూరు చేశారు.

భవనాల నిర్మాణంపై దృష్టి సారించాలని వినతి

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమం, ఎంఎల్‌సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ గురువారం కృష్ణాయూనవర్సిటీకి వచ్చారు. ఈ సందర్భంగా పలువురు ప్రొఫెసర్‌లు, సిబ్బంది ఎంతోకాలంగా నిలిచిపోయిన భవనాలను వారికి చూపించారు. రెండు సంవత్సరాలుగా యూనివర్సిటీలో భవనాల పనులు నిలిచిపోయాయని తెలిపారు. దీంతో నిర్మాణంలో ఉపయోగించిన ఇనుము తుప్పు పట్టిపోతోందని, దీని వల్ల నాణ్యత దెబ్బ తింటుందని వివరించారు. యూనివర్సిటీలో భవనాల నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని ఆలపాటి, ఏఎస్ రామకృష్ణ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

బ్యాంకుల్లో నకిలీ కలకలం

నకిలీ బంగారంతో రుణాలు తీసుకున్న వ్యక్తి

- సుమారు పది బ్యాంకులకు టోకరా
- రూ.కోట్లలో రుణాలు ఇచ్చిన బ్యాంకర్లు
- తలలు పట్టుకున్న మేనేజర్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): నకిలీ బంగారం వ్యవహారం బ్యాంకర్లను కలవరపెడుతోంది. కొద్దిరోజుల కిందట ఈ నకిలీ బంగారం వ్యవహారం బయటపడింది. బ్యాంకు అధికారులు దీన్ని చాలా గోప్యంగా ఉంచుతున్నారు. ప్రస్తుతం బ్యాంకుల మేనేజర్ల దగ్గర నుంచి ఏజీఎంల వరకు ఈ వ్యవహారంలో ఏం చేయాలో తెలియక నానా హైరానా పడుతున్నారు. విజయవాడ కొత్తపేటకు చెందిన ఓ వ్యక్తి నగరంలోని పలు బ్యాంకుల్లో బంగారు ఆభరణాలపై రుణం తీసుకుంటున్నాడు. రెండేళ్లుగా అతడు ఈవిధంగా రుణాలు తీసుకుంటున్నాడు. కొద్ది నెలల కిందట అతడు నకిలీ బంగారాన్ని బ్యాంకుల్లో పెట్టి లక్షలాది రూపాయలను రుణంగా పొందాడు. ఒక వస్తువుకు పైన బంగారం పూతను పూసి బ్యాంకుల్లో పెట్టినట్టు తెలిసింది. వాస్తవానికి బంగారు ఆభరణాలపై రుణాలు ఇచ్చేటప్పుడు వాటిని బ్యాంకుల్లోని అప్రైజర్లు పరిశీలిస్తారు. ఆ ఆభరణాలు నకిలీవా, నాణ్యమైనవా అని నిర్ధారిస్తారు. సాధారణంగా అప్రైజర్లు ఆభరణాలను ఒక రాయిపై గీసి పరిశీలించి బంగారంలోని నాణ్యతను నిర్ధారిస్తారు. దాని ప్రకారం బ్యాంకు మేనేజర్లు ఎంత వరకు రుణం ఇవ్వాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటారు. బ్యాంకుల్లో అప్రైజర్లను నమ్మించడానికి ఇనుముతో తయారు చేయించిన వస్తువులకు పైభాగంలో బంగారం పూత వేయించాడు. వాటిని బ్యాంకులకు ఇచ్చాడు. పై పూతలో బంగారం ఉండడంతో అప్రైజర్లు ఆ వస్తువు నాణ్యమైనదేనని నిర్ధారించారు. ఈవిధంగా ఒక్కో బ్యాంకు రూ.20 లక్షల నుంచి 25 లక్షల వరకు రుణాన్ని మంజూరు చేశాయి. ఇలా విజయవాడలో పది బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నట్టు సమాచారం. బెంజ్‌సర్కిల్‌లో ఉన్న ఒక జాతీయ స్థాయి బ్యాంకు ఈ నకిలీ ఆభరణాలపై అతడికి రూ.25లక్షలు రుణం ఇచ్చినట్టు విశ్వసనీయంగా మిగతా 6లో..



కలెక్టర్ బాలాజీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్, మచిలీపట్నం డీఎస్పీ చప్పిడి రాజా

ఉత్తమ ఎలక్టోరల్ అధికారిగా కృష్ణా కలెక్టర్ బాలాజీ



మచిలీపట్నం/విజయవాడ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ ఎలక్టోరల్ అధికారిగా కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ ఎంపికయ్యారు. 2024లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడం, నూతన ఓటర్లను చేర్పించడం, ఎన్నికల సంఘం సూచనలను తు.చ తప్పకుండా పాటించినందుకుగాను కలెక్టర్ బాలాజీని ఉత్తమ ఎలక్టోరల్ అధికారిగా ఎంపికచేస్తూ రాష్ట్ర ఎన్నికలసంఘం సీఈవో వివేక్ యాదవ్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 25న 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఎస్పీలు

ఇటీవల జిల్లాలో నూతనంగా నియమితులైన గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్, మచిలీపట్నం డీఎస్పీ చప్పిడి రాజా గురువారం కలెక్టర్ బాలాజీని ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలను అందజేశారు. శాంతిభద్రతలు పరిరక్షించడంలో నిత్యం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డీఎస్పీలకు సూచించారు.

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు



ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించినందుకు ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ లక్ష్మీశను బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీసెస్ అవార్డుకు ఎంపిక చేశారు. ఎస్ఎస్ఆర్-2024 తర్వాత ఓటర్ల జాబితాల రూపకల్పన, ఓటర్ల నమోదు కార్యక్రమాలు, ఓటర్ల అవగాహనా కార్యక్రమాలను సమర్థవంతంగా లక్ష్మీశ నిర్వహించారు.



తాత, తండ్రి బాటలో నారా లోకేశ్

» మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : తాత ఎన్టీఆర్, తండ్రి నారా చంద్రబాబు నాయుడు బాటలో నడుస్తూ.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకుని వెళ్లేందుకు మంత్రి నారా లోకేశ్ చేస్తున్న కృషి అందరికీ స్ఫూర్తిదాయకమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం మచిలీపట్నం నియోజక వర్గంలో ఘనంగా నారా లోకేశ్ జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, నారా లోకేశ్ మానవ వనరుల శాఖా మంత్రిగా ఉంటూ విద్యా రంగ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు.

చంద్రబాబు తర్వాత లోకశే ముఖ్యమంత్రి

» మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న



వన్‌టౌన్: చంద్రబాబు తర్వాత టీడీపీ దశదిశా నారా లోకేశేనని, తర్వాత ముఖ్యమంత్రి కూడా ఆయనేనని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న పేర్కొన్నారు. విజయవాడలోని తన కార్యాలయంలో గురువారం లోకేశ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు, నాయకుల సమక్షంలో భారీ కేక్ కట్ చేశారు. బుద్దా వెంకన్న మాట్లాడుతూ లోకేశ్ ప్రజల మధ్యలో నుంచి వచ్చిన నాయకుడని కొనియాడారు. చంద్రబాబు పాదయాత్ర తర్వాత లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రకు అంతటి స్పందన వచ్చిందన్నారు. రాజకీయ వారసత్వంగా లోకేశ్ రాలేదని, ఆయన ప్రజల మధ్య ఎదిగిన నాయకుడని కొనియాడారు. ఎన్టీఆర్ తర్వాత చంద్రబాబు, చంద్రబాబు తర్వాత లోకేశ్ పార్టీకి వెన్నెముకలన్నారు.



కేక్ కట్‌చేస్తున్న నెట్టెం రఘురాం, కొనకళ్ల నారాయణ, తదితరులు

రాష్ట్ర ప్రజల భవిష్యత్తు ఆశాజ్యోతి : నెట్టెం

వన్‌టౌన్ : విజయవాడ ఆటోనగర్‌లోని జిల్లా కార్యాలయంలో గురువారం మంత్రి నారా లోకేశ్ 42వ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, కృష్ణాజిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి కేక్‌లను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ శ్రేణులకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నెట్టెం మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజల భవిష్యత్తు ఆశాజ్యోతి నారా లోకేశ్ అని కొనియాడారు. రాబోయే తరానికి ఉజ్వల భవిష్యత్తు ఇవ్వాలని ఆయన పడుతున్న తపన శ్లాఘనీయమన్నారు. కొనకళ్ల మాట్లాడుతూ, ఏ పార్టీలో లేనివిధంగా పార్టీ కార్యకర్తలకు కష్టమొచ్చినా, చనిపోయినా వారి కుటుంబసభ్యులకు బీమా మొత్తం, పిల్లలకు ఉచిత విద్య అందేలా పార్టీ ప్రణాళికను రూపొందించారన్నారు. లుక్కా సాయిరామ్ గౌడ్, గన్నే ప్రసాద్, వాసం మునియ్య, శొంఠి శివ ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, బంకా నాగమణి, కోగంటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

కేశినేని చిన్ని కార్యాలయంలో..



కేక్ కట్ చేస్తున్న ఎంపీ కేశినేని చిన్ని

గురునానక్ కాలనీలోని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, గత ప్రభుత్వ అరాచక విధానాలను నిగ్గదీసి ఎండగట్టి ప్రజలకు అండగా నిలిచి ప్రజా ప్రభుత్వ ఏర్పాటులో లోకేశ్ కీలక పాత్ర వహించారన్నారు. కేక్ కట్ చేసి లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. గొట్టుముక్కల రఘురామరాజు, చెన్నుపాటి ఉషారాణి, తాడి శకుంతల, కోగంటి రామారావు, నరసింహచౌదరి, తూమాటి ప్రేమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేశ్ పుట్టిన రోజు సందర్భంగా కేశినేని శివనాథ్ సొంత నిధులతో జిల్లాలోని 145 ప్రభుత్వ పాఠశాలలో క్రీడ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చదివిన గాంధీజీ మునిసిపల్ హైస్కూల్‌లో నారా లోకేష్ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా కిట్లను పంపిణీ ప్రారంభించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

ఆయకట్టుకు నీటి కష్టాలు!



ఎక్స్‌కవేటర్ సహాయంతో కృష్ణా ప్రవాహాన్ని ఎత్తిపోతల పథకాల వైపు మళ్లిస్తున్న రైతులు,

చింతలపాడులో అన్నదాత భగీరథ ప్రయత్నంతో ఇన్‌టెక్ వెల్‌కు చేరుతున్న నీరు

» ఎత్తిపోతల పథకాలకు చేరని నీరు

» ఎండుతోన్న పంటలతో అన్నదాత అవస్థలు

» సప్లయి ఛానళ్ల ద్వారా పంటలకు తరలింపు

నందిగామ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పంటను కాపాడుకునేందుకు ఎత్తిపోతల పథకాల ఆయకట్టు రైతులు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. అత్యంత వ్యయ ప్రయాసలకోర్చి కృష్ణానీటిని పథకాలకు మళ్లిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని పలు నియోజకవర్గాలలో కృష్ణానదిపై పెద్దఎత్తున ఎత్తిపోతల పథకాల నిర్మాణం జరిగింది. ఆయా ఆయకట్టులో రైతులు వాణిజ్య ఆహార పంటలు సాగుచేస్తున్నారు. తొలకరి బాగున్నప్పటికీ ఆయకట్టు రైతులు పలు ఆటుపోటులు ఎదుర్కొంటున్నారు. నిన్నమొన్నటి వరకూ వరదలతో భీతిల్లిన అన్నదాతలు నేడు పంటలకు నీరందక ఇబ్బంది పడుతున్నారు. ఒకవైపు పకృతి వైపరీత్యాలతో పోరాడుతూనే మరోవైపు సాగు నీటి కోసం ఆరాటపడుతున్నారు. ఎత్తిపోతల పథకాల ఆయకట్టులో మిర్చి, మాగాణి పంటలకు ప్రస్తుతం నీటి అవసరాలు ఉన్నాయి. ఒక్కసారిగా కృష్ణానదికి ఎగువ నుంచి నీటి విడుదల నిలిపివేయడంతో సాగునీటి పథకాలకు నీరందడం లేదు. ప్రవహిస్తున్న కొద్దిపాటి నీరు గుంటూరు జిల్లా వైపు వెళుతుంది. పథకాల ఇన్‌టెక్‌వెల్‌కు నీరందకపోవడంతో నీటికోసం పంటలు నోర్లు తెరుకున్నాయి. కళ్ల ఎదుటే పంటలు ఎండిపోతుంటే చూడలేని రైతాంగం ఆవేదన చెందుతోంది. నీటిని విడుదల చేసి పంటలు కాపాడాలని వారు చేసిన విజ్ఞప్తులను అధికారులు పట్టించుకోలేదు. దీంతో నడుంబిగించిన అన్నదాతలు గుంటూరు జిల్లా వైపు ప్రవహిస్తున్న నదీ ప్రవాహాన్ని సప్లై చానళ్ల ద్వారా పథకాల వైపునకు మళ్లిస్తున్నారు. ఆర్థిక భారాన్ని సైతం లెక్క చేయకుండా అపర భగీరథులై కృష్ణ నీటిని పథకాల ఇన్‌టెక్ వెల్‌కు అందిస్తు పంటలను కాపాడుకుంటున్నారు. అయినప్పటికీ సమర్థవంతంగా పథకాలకు నీరు చేరడం లేదు. లక్షలాది రూపాయల పెట్టుబడులు పెట్టి సాగునీటి కోసం తపిస్తున్న అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలవాల్సి ఉంది. తెలంగాణ అధికారులతో మాట్లాడి చెర్వుమాధవరం ట్యాంక్ నుంచి రెండు టీఎంసీల నీటిని విడుదల చేయిస్తే సాగుకు మేలు జరుగుతుంది. ఈ సమస్యపై స్పందించిన ఎన్ఎస్పీ అధికారులు మాట్లాడుతూ, నిబంధనల ప్రకారం ఈ సమయంలో నీరు విడుదల చేయాలంటే డెల్టా ప్రాంతం నుంచి విజ్ఞప్తి రావాల్సి ఉందన్నారు. వారి అవసరాలకు మాత్రమే నీరు విడుదల చేస్తారని చెప్పారు. ఎమ్మెల్యేలు, మంత్రులు స్పందించి డెల్టా అధికారులు, తెలంగాణా అధికారులతో సంప్రదింపులు జరిపి కనీసం రెండు టీఎంసీల నీటిని విడుదల చేయించాలని రైతులు కోరుతున్నారు.

వంశీపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చెల్లదు

» భిన్న ఉత్తర్వుల నేపథ్యంలో వ్యవహారాన్ని విస్తృత ధర్మాసనానికి రిఫర్ చేయండి

» వంశీ తరపున సీనియర్ న్యాయవాది వాదనలు

» సీనియర్ న్యాయవాది వాదనను వ్యతిరేకించిన పీపీ

» ఐఏపై కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థన

» విచారణ ఫిబ్రవరి 5కి వాయిదా

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి సమయంలో నిందితుడు వల్లభనేని వంశీ అక్కడలేరని, దాడి ఘటనలో నేరుగా పాల్గొనందున ఆయనపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చెల్లుబాటు కాదని వంశీ తరపు సీనియర్ న్యాయవాది పట్టాభి గురువారం హైకోర్టులో వాదనలు వినిపించారు. నిందితుడిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదైనప్పుడు ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టు వద్ద మొదట ముందస్తు బెయిల్ పిటిషన్ వేసుకోవాలని ఓ బెంచ్, చట్టం వర్తింపుకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు లేనప్పుడు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు నేరుగా విచారించవచ్చని మరో బెంచ్ భిన్న ఉత్తర్వులు ఇచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారాన్ని విస్తృత ధర్మాసనానికి రిఫర్ చేయాలని కోరుతూ అనుబంధ పిటిషన్ వేశామన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ.. అనుబంధ పిటిషన్‌కు(ఐఏ)కు విచారణార్హత లేదన్నారు. ఇదే కేసులో పలువురు నిందితులు హైకోర్టులో నేరుగా ముందస్తు బెయిల్ పిటిషన్లు వేయడాన్ని ఇదే కోర్టు తప్పుపట్టిందన్నారు. ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టు ముందు పిటిషన్లు వేసుకొనేందుకు వెసులుబాటు ఇచ్చిందన్నారు. ఎస్సీ ఎస్టీ చట్టంలోని సెక్షన్ 14(ఏ) ప్రకారం ప్రత్యేకకోర్టు నిర్ణయంపై హైకోర్టులో అప్పీల్ మాత్రమే దాఖలు చేసుకోగలరన్నారు. ఈ తీర్పుకి భిన్నంగా పిటిషనర్ విషయంలో ఉత్తర్వులు జారీ చేయడానికి వీల్లేదన్నారు. ఐఏ పై కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని కోరారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ విచారణను ఫిబ్రవరి 5కి వాయిదా వేస్తూ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు.

ఏషియన్ యోగాలో భాష్యం విద్యార్థికి స్వర్ణం



ధీరజ్ శ్రీకృష్ణను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు (విద్య), జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : భాష్యం విద్యార్థులు చదువుతోపాటు ఎంచుకున్న రంగాల్లో రాణిస్తూ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపడం గర్వంగా ఉందని సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. భాష్యం మెయిన్ క్యాంపస్‌లో ఇటీవల సింగపూర్‌లో జరిగిన యోగ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన 9వ తరగతి విద్యార్థి ధీరజ్ శ్రీకృష్ణ అభినందన కార్యక్రమంలో భాగంగా గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6 నుంచి మూడు రోజులపాటు సింగపూర్‌లో జరిగిన ఏషియన్ యోగ స్పోర్ట్స్ చాంపియన్ షిప్ పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ధీరజ్ కృష్ణ ఒక పసిడి, రెండు రజిత, ఒక కాంస్య పతకం సాధించినట్టు తెలిపారు. జూనియర్ విభాగంలో ధీరజ్ శ్రీకృష్ణ ఆర్టిస్ట్ యోగాలో పసిడి పతకం, యోగాసన ఆర్టిస్ట్ ఫెయిర్ యోగాలో రజిత పతకం, రిథమిక్ యోగాలో కాంస్య పతకాలు సాధించినట్టు తెలిపారు. భవిష్యత్తులో జరిగే ఒలింపిక్ పోటీల్లో యోగా ప్రవేశపెట్టిన నేపథ్యంలో విద్యార్థి ధీరజ్ శ్రీకృష్ణ ప్రపంచస్థాయి గుర్తింపు సాధిస్తాడని భాష్యం రామకృష్ణ ఆకాంక్షించారు. ధీరజ్ శ్రీకృష్ణ మాట్లాడుతూ, యోగాలో ప్రతిభ చూపుతున్న తనకు రూ.లక్ష ప్రోత్సాహకం చైర్మన్ భాష్యం రామకృష్ణ అందజేశారని తెలిపారు.

బై‘పాస్’ వేదన!

(5వ పేజీ తరువాయి)

అమ్ముకున్న ల్యాంకోకు కోట్లాది రూపాయలు చెల్లించి ఆర్వో తప్పు చేశాడని రైతులు అన్నారు. ఆయన తప్పు చేశాడు కాబట్టి ఖచ్చితంగా శిక్ష పడుతుందని.. ఈ విషయంలో మీరు పునరాలోచన చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులు దీనికి అంగీకరించకపోవడంతో సమావేశం అసంపూర్ణంగా ముగిసింది.

ఈస్ట్ బైపాస్ లేకుండా చేశాడు..!

విజయవాడ వెస్ట్ బైపాస్ అంశాన్ని అడ్డుపెట్టుకుని ఎన్‌హెచ్ ఆర్వో విజయవాడ ఈస్ట్ బైపాస్ లేకుండా చేసిన విషయాన్ని రైతుల ముందు బయట పెట్టారు. విజయవాడ ఈస్ట్ బైపాస్‌కు సైంధవుడిలా ఎన్‌హెచ్ ఆర్వో అడ్డుపడినట్టుగా ప్రజా ప్రతినిధులు బాంబు పేల్చారు. డీపీఆర్ కూడా పూర్తి చేసుకుని కేంద్రానికి పంపించిన ప్రతిపాదనను కూడా అవసరం లేదని మోర్త్‌కు రాశాడని చెప్పుకొచ్చారు. అన్నీ సిద్ధమైన తర్వాత విజయవాడ వెస్ట్ బైపాస్ వివాదం తర్వాతే ఆయన ఈ పని చేశాడన్న విషయాన్ని కూడా ప్రజా ప్రతినిధులు వివరించినట్టుగా తెలుస్తోంది. స్థూలంగా ఎన్‌హెచ్ ఆర్వో రాష్ట్రంలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా ప్రభావంతమైన పాత్ర పోషిస్తున్నాడని రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తప్పటం లేదని ప్రజాప్రతినిధులు చెప్పినట్టు సమాచారం. దీనిపై రైతుల తరఫున శివరామకృష్ణ కూడా ఎన్‌హెచ్ ఆర్వో కిందటి వైసీపీ ప్రభుత్వానికి తాబేదారుగా పనిచేసి తమను ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశంతోనే 11 టవర్ల అలైన్‌మెంట్‌ను తెర మీదకు తెచ్చాడని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు టవర్ల ఎత్తు పెంచితే అయిపోయే దానిని 11 టవర్లకు అది కూడా రైతుల పొలాల నుంచి బైపాస్‌కు సుదూరంగా అర్ధచంద్రాకారంలో తీసుకువెళ్లాల్సిన అవసరమేమిటని ప్రశ్నించారు. ఎన్‌హెచ్ ఆర్వో చేసిన తప్పు వల్ల కేంద్ర ప్రభుత్వంపై రూ.100 కోట్ల భారం పడుతోందని, రైతులకు మరో రూ. 50 కోట్ల నష్టం వాటిల్లుతోందని రైతులు వాదించారు. ఈ వ్యవహారంలో రూ.20 కోట్ల మేర ఎన్‌హెచ్ ఆర్వో కార్యాలయం మూతపడిన ప్లాంట్ యాజమాన్యానికి చెల్లించిందని ఇది పెద్ద కుంభకోణమని చెప్పారు. తప్పు జరిగిందన్న విషయాన్ని తాము కూడా ఏకీభవిస్తున్నామని ప్రజా ప్రతినిధులు అన్నట్లు తెలిసింది. మీ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లిన తర్వాత కమిటీ ఏర్పాటు జరిగిందన్నారు. కమిటీలో ఉమ్మడిగా అలైన్‌మెంట్ మార్చకూడదన్న నిర్ణయాన్ని మళ్లీ ఎన్‌హెచ్ ఆర్వో మార్చుకున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి దగ్గర ఆర్వో పాత అలైన్‌మెంట్ ప్రకారమే వెళతామని చెప్పలేదని, ఆ తర్వాతే ఈస్ట్ బైపాస్ ప్రాజెక్టును ఆపటం వంటివి జరిగాయని చెప్పినట్లు తెలిసింది. ఈ విషయంలో ముందుకు వెళ్లటానికి జిల్లా అధికారులు, రైతులు కూర్చుని సయోధ్యకు రావాల్సిందిగా సూచించారు. అయితే రైతులు అంగీకరించలేదు. ఈ విషయంలో ఇప్పటికే చాలా పోరాటం చేశామని, తమ పోరాటాన్ని ఇంకా తీవ్ర స్థాయిలో చేస్తామని, ఎన్‌హెచ్ ఆర్వో కుంభకోణాలను ఎట్టి పరిస్థితిలో వదిలిపెట్టే ప్రసక్తి లేదని చెప్పారు. దీంతో సమావేశం అర్ధంతరంగా ముగిసింది.

దినదినగండం..

(5వ పేజీ తరువాయి)

కిందపడుతోంది. ఇటీవల పెచ్చులు ఊడిపోయినపుడు సందర్శకులకు తృటిలో ప్రమాదం తప్పింది. పెచ్చులూడిన ప్రాంతంలో సిమెంట్ కాంక్రీట్ పనులు కూడా చేయించకపోవటం గమనార్హం.

● బంటుమిల్లి తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. రెండు దశాబ్దాల కంటే ముందుగానే నిర్మించిన భవనం కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఎక్కడికక్కడ తహసీల్దార్ కార్యాలయం నెర్రలిచ్చిపోతోంది. నెర్రలిచ్చిన చోట పిచ్చి మొక్కలు మొలిచి ఏపుగా పెరుగుతున్నాయి. ఈ భవనం ఏ క్షణంలో కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

● ఉయ్యూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయాన్ని తొలగించాల్సి రావడంతో అప్పటి నుంచి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలోని పాత భవనంలో అద్దె ప్రాతిపదికన కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యలయం స్లాబు, గోడలు పెచ్చులూడిపోయి కూలటానికి సిద్ధంగా ఉన్నాయి. పగుళ్లిచ్చిన చోట సిమెంట్ రాసినా వేరే చోట పగుళ్లు వస్తున్నాయి. ఇలా ఎక్కడ పడితే అక్కడ పగుళ్లతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో తహసీల్దార్ కార్యాలయం ఉంది.

● గన్నవరం తహసీల్దార్ కార్యాలయం బ్రిటీషు కాలంలో నిర్మించిన భవనంలోనే ఇప్పటికీ కొనసాగుతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఉమ్మడి కృష్ణా జేసీ విజయకృష్ణన్ ప్రత్యేక చొరవ చూపి గన్నవరంలో రెండు అంతస్థుల రెవెన్యూ కాంప్లెక్స్ పనులు చేపట్టారు. పిల్లర్లు, శ్లాబులు పూర్తయ్యాయి, కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించలేదు. పనులు ఆగిపోయాయి. ఇప్పటికీ అసంపూర్ణంగా ఉంది.

● బాపులపాడు తహసీల్దార్ కార్యాలయాన్ని నిర్మించి మూడు దశాబ్దాలు కావస్తోంది. కార్యాలయంలోని ఫ్లోరింగ్ అంతా కుంగిపోయింది. గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. భవనంపై మొక్కలు పెరిగాయి. తహసీల్దార్ కూర్చునే గదిలోనే గోడలు బీటలు వారి ఉన్నాయి. వర్షం పడితే నీరు కారుతోంది.

ధర తగ్గుతున్న సుబాబుల్!

వైసీపీ హయాంలో పతనం.. కూటమి ప్రభుత్వం రాకతో ఊరట

» మద్దతు కూడా లభించక రైతుల ఆందోళన

» నానాటికీ దిగజారుతున్న ధర

(ఆంధ్రజ్యోతి - కంచికచర్ల)

సుబాబుల్ కర్ర ధర తగ్గటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. టన్నుకు రూ.ఐదు వందలు తగ్గింది. మిల్లుల వద్ద కర్ర నిల్వలు పుష్కలంగా ఉండటం, డిమాండ్‌ను మించి సరఫరా ఎక్కువ కావటం వల్ల ధర తగ్గిందని దళారులు చెబుతుండగా, మిల్లుల ప్రతినిధులు, దళారులు కుమ్మక్కై కావాలని ధర తగ్గించారని రైతులు ఆరోపిస్తున్నారు.

వైసీపీ పాలనలో సుబాబుల్ రైతులు నిలువు దోపిడీకి గురయ్యారు. గిట్టుబాటు ధర సంగతి దేవుడెరుగు? మద్దతు ధర కూడా లభించలేదు. మద్దతు ధర టన్నుకు రూ.4,400 ఖర్చులు పోను రైతుల చేతికి నికరంగా రూ. 3,500 నుంచి రూ. 3,600 అందాయి. అలాంటిది ఒక దశలో టన్నుకు రూ. 1,500 లభించటం గగనమైంది. రైతులు తీవ్రంగా నష్టపోయినప్పటికీ అప్పట్లో పాలకులు అణుమాత్రం కూడా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల సమయంలో సుబాబుల్ ధరలో కదలిక వచ్చింది.

కూటమి ప్రభుత్వంలో ఊహించని ధర..

కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఊరట లభించింది. ఊహించని విధంగా కర్ర ధర పెరిగింది. గత డిసెంబరు నెలలో రైతుల చేతికి రూ. 7,200 నుంచి రూ. 7,400 అందాయి. ఎందువల్లనో కొద్ది రోజుల నుంచి మార్కెట్లో ధర దిగజారుతోంది. పక్షం రోజుల క్రితం వరకు రూ. 7,000 వచ్చాయి. ప్రస్తుతం రైతులకు రూ.6,500 మాత్రమే అందుతున్నాయి. ధర ఎందుకు తగ్గుతుందో రైతులకు అర్థం కావటం లేదు. పేపరు మిల్లులు ధర తగ్గించాయా లేక దళారులు తగ్గిస్తున్నారా అన్నది తెలియటం లేదు. ప్రతి రోజూ ఈ ప్రాంతం నుంచి ఏపీపీఎం (రాజమండ్రి), ఐటీసీ (భద్రాచలం), ఎస్‌పీఎం (సిర్పూర్ కాగజ్ నగర్) బలార్షా మిల్లులకు కర్ర సరఫరా అవుతున్నది.



సుబాబుల్ కర్ర లారీకి లోడింగ్

దళారులను ఆశ్రయిస్తున్న రైతులు

రైతులు నేరుగా మిల్లులకు అమ్మటం లేదు. డంపింగ్ యార్డులు ఉన్నప్పటికీ రైతులు ఎక్కువగా దళారులను ఆశ్రయిస్తున్నారు. కర్ర నరికే కూలీలందరూ దళారుల అధీనంలో ఉన్నారు. రైతులు సొంతంగా కర్ర నరికించేందుకు కూలీలు దొరకటం లేదు. మరో గత్యంతరం లేక దళారులపైన ఆధారపడాల్సి వస్తున్నది. దళారులు టన్నుకు రూ. 6,500 వంతున చెల్లించి, మిల్లులకు సరఫరా చేస్తున్నారు. కర్ర నిల్వలు పుష్కలంగా ఉండటం వల్లనే మిల్లులు ధర తగ్గించాయని దళారులు చెబుతున్నారు. ఈ విషయం అంత నమ్మశక్యంగా లేదని రైతులు పేర్కొంటున్నారు.

కలవరపెడుతున్న ధర

సుబాబుల్ ధర ఇంకా పెరుగుతుందన్న ఆశతో ఉన్న రైతులను ధర తగ్గటం కలవర పరుస్తున్నది. వైసీపీ పాలనలో ధర దారుణంగా పడిపోయినపుడు ఎక్కువ మంది రైతులు సుబాబుల్ తోటలు తొలగించి, ఇతర పంటలు సాగు చేశారు. గత ఏడాది ధర అనూహ్యంగా రికార్డు స్థాయిలో పెరగటతో రైతులు సుబాబుల్ సాగుపై దృష్టి పెట్టారు. పేపరు మిల్లులు కూడా పరోక్షంగా ప్రోత్సహించాయి. దీంతో నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో సుబాబుల్ తోటల విస్తీర్ణం పెరిగింది. అలాంటిది ధర తగ్గుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. డిమాండ్ ఉన్నప్పటికీ మిల్లుల ప్రతినిధులు, దళారులు కల్సి కావాలని ధర తగ్గిస్తున్నారన్న అనుమానాలు రైతులు వ్యక్తం చేస్తున్నారు.

142 పోస్టులకు 5320 దరఖాస్తులు

మచిలీపట్నం టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కళాశాల పరిధిలో 27 కేటగిరీలకు చెందిన 142 (కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్) పోస్టుల భర్తీకి చివరిరోజైన గురువారం నాటికి మొత్తం 5320 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి స్క్రూటినీ అనంతరం ఫిబ్రవరి 15న ప్రొవిజనల్ లిస్టు ప్రదర్శిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డి.టి.కె. రెడ్డి తెలిపారు. 16, 17 తేదీల్లో జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. అనంతరం తిరిగి 24న మరొక ప్రొవిజినల్ లిస్టును ప్రకటిస్తామన్నారు. మళ్లీ అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పడిన కమిటీ పరిశీలించి ఫిబ్రవరి 28న తుది జాబితా ప్రకటిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు వికలాంగులు, మాజీ సైనికుల రిజర్వేషన్‌ను పాటిస్తూ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఈ పోస్టుల భర్తీకి దళారీల మాటలు నమ్మవద్దని ప్రిన్సిపాల్ తెలిపారు.

బ్యాంకుల్లో నకిలీ కలకలం

(5వ పేజీ తరువాయి)

తెలిసింది. ఈ విషయం కొద్దినెలల క్రితమే బయటపడినప్పటికీ అత్యంత గోప్యంగా ఉంచారు. తాజాగా కొద్దిరోజుల క్రితం మరో జాతీయ బ్యాంకు ఈ విషయాన్ని గుర్తించింది. అతడిపై పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు ఆ మోసగాడిని పిలిపించి విచారించారని సమాచారం. దీనిపై పోలీసులను వివరణ కోరగా అటువంటిదేమీ లేదని చెబుతున్నారు. విషయం బయటకు పొక్కకుండా ఆ మొత్తం రుణాన్ని వసూలు చేయాలని ఆయా బ్యాంకుల ఏజీఎంలు సంబంధిత బ్యాంకు మేనేజర్లపై ఒత్తిడి చేస్తున్నారు. దీన్ని భరించలేని మేనేజర్లు ఆగ్రహజ్వాలలపై పడుతున్నారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు	(రూ.లలో)
అమరావతి	
బ్రాయిలర్ బర్డ్	148,157, 168
చికెన్ విత్ స్కిన్	286
చికెన్ స్కిన్‌లెస్	296

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 500

గంజాయి కేసులో ఇద్దరు అరెస్టు

వన్‌టౌన్: అక్రమంగా గంజాయి తరలించిన కేసులో వన్‌టౌన్ పోలీసులు గురువారం పల్లెవీధికి చెందిన గజేంద్ర రాజ్ పురోహిత్ (24), రాజస్థాన్ రాష్ట్రం జాలోర్ జిల్లా దస్తాన్ గ్రామానికి చెందిన కృష్ణకుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు కారులో ఉన్న 101 కేజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఎస్ఆర్ఆర్‌లో వ్యాసరచన, వక్తృత్వం పోటీలు

భారతీనగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు గురువారం వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలను నిర్వహించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ పోటీల్లో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, పీబీ సిద్ధార్థ, ఎస్ఆర్ఆర్, నలంద కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు జాతీయ ఓటర్ల దినోత్సవం నాడు రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు. జిల్లా ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ యుగంధర్, అధ్యాపకులు, పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ప్రభుత్వాసుపత్రి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సూర్యారావుపేట సెక్షన్, చుట్టుగుంట సబ్‌స్టేషన్ 11 కేవీ ఎస్ఆర్ఆర్ కళాశాల ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రవీంద్ర బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చుట్టుగుంట లయన్స్‌క్లబ్ రోడ్డు, రామాలయం వద్ద కొండ ప్రాంతం, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్, ఎస్‌బీఐ భవనం, మారుతీనగర్ ఏలూరు రోడ్డు, మైహోమ్ అపార్ట్‌మెంట్స్, ఎస్ఆర్ఆర్ కళాశాల ఏరియా, కళాశాల వెనుక, మాచవరం ఓల్డ్ మలేరియా ఆఫీస్ రోడ్డు, హిందీ కళాశాల రోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.





కేక్ కట్ చేస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీ చిన్ని, ఎమ్మెల్యే గద్దె తదితరులు, కేక్ కట్ చేస్తున్న గద్దె క్రాంతికుమార్, మహారాష్ట్రలో కేక్ కట్ చేస్తున్న 17వ డివిజన్ టీడీపీ నాయకులు

సమర్థత గల నాయకుడు నారా లోకేశ్

పుట్టినరోజు వేడుకల్లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీ చిన్ని, ఎమ్మెల్యే గద్దె

భారతీనగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్ర విజయవంతం చేయడం ద్వారా టీడీపీని మరింతగా పటిష్టపరిచి నారా లోకేశ్ తనలోని సమర్థతను, నాయకత్వ లక్షణాలను నిరూపించుకున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. రాష్ట్ర విద్యాశాఖా మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 42వ పుట్టిన రోజు వేడుకలు గురువారం తూర్పు పరిధి 4వ డివిజన్‌లోని శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో వారు కేక్ కట్ చేశారు. అనంతరం రూ.20లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన శ్రీనివాసనగర్ బ్యాంక్‌కాలనీలోని దీప్తిభవన్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ 42వ పుట్టినరోజు జరుపుకుంటున్న లోకేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నందమూరి తారకరామారావు స్థాపించిన టీడీపీ సిద్ధాంతాలను గత 30ఏళ్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు తీసుకువెళుతున్నారని, నారా లోకేశ్ ఆధ్వర్యంలో టీడీపీని భవిష్యత్‌లో మరింత ముందుకు తీసుకువెళ్లాలని అన్నారు. ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌లు నారా లోకేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ తన నాయకత్వ లక్షణాలను నిరూపించుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, దేవినేని అపర్ణ, యలమంచిలి పండు, వడ్లపట్ల గోపాలకృష్ణ, కోరపాటి సురేంద్ర, చలసాని రోజా, జాస్తి కృష్ణరావు, కోడూరు ఆంజనేయ వాసు, షేక్‌మతిన్ పాల్గొన్నారు.

పటమట: లోకేశ్ జన్మదినం సందర్భంగా 11వ డివిజన్‌లో పేదలకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దుప్పట్లు, కేకులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ముమ్మనేని ప్రసాద్, యలమంచిలి ప్రసాద్, జాస్తి సురేష్, యనమర్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

- ఎన్టీఆర్ సర్కిల్ వద్ద జరిగిన లోకేశ్ జన్మదిన వేడుకల్లో టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ కేక్ కట్ చేశారు. పొట్లూరి సాయిబాబు, జాస్తి సాంబశివరావు, నర్రా కిషోర్, బద్రి, దాసరి గాబ్రియేలు, నందిపాటి దేవానంద్, బుజ్జి, వీరంకి డాంగియా కుమారి తదితరులు పాల్గొన్నారు.
- చెన్నుపాటి గాంధీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్‌లో లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేశారు. ముమ్మనేని ప్రసాద్, బెజవాడ నజీర్, ఫిరోజ్, చెన్నుపాటి క్రాంతిశ్రీ, యలమంచలి దేవేంద్ర, అన్నాబత్తుని బాబీ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్రలో...

రాణిగారితోట: నారా లోకేష్ 42వ జన్మదినోత్సవాన్ని మహారాష్ట్రలోని ఘృష్ణేశ్వర జ్యోతిర్లింగ దేవాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ అర్బన్ కార్యదర్శి మైలమూరి పీరుబాబు, 17వ డివిజన్ టీడీపీ అధ్యక్షురాలు రాయి రంగమ్మ, మహేష్, సునాబీ, వెంకటేశ్వరరావు, లక్ష్మి, అమీనాబీ, భద్ర, ఫాతిమా రమీజీ తదితరులు పాల్గొన్నారు.

17వ డివిజన్‌లో...

టీడీపీ నాయకులు కొప్పోలు శ్రీనివాస చౌదరి ఆధ్వర్యంలో రాణిగారితోట 17వ డివిజన్‌లోని నందమూరి తారకరామారావు విగ్రహం వద్ద గురువారం సాయంత్రం నారా లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించి, పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతికుమార్ ఎన్టీఆర్ విగ్రహనికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. స్థానిక నాయకులు మునిపోలిపల్లి, వెంకటేశ్వరరెడ్డి, పల్లా సాగర్, పుట్ల రమణ తదితరులు పాల్గొన్నారు.



ఏపీ అడ్వకేట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్

కో ఆపరేటివ్ సొసైటీ డైరీ ఆవిష్కరణ



సొసైటీ డైరీని ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

విజయవాడ లీగల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ అడ్వకేట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ 2025 డైరీని గురువారం సిటీ సివిల్ కోర్టుల ఆవరణలో న్యాయవాదులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు కె.చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి, కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అరిగెల శివరాంప్రసాద్ (రాజా), బార్ మాజీ అధ్యక్షులుచేకూరి శ్రీపతిరావు, వి.గురునాథం, సంపర శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. ఈ సొసైటీని 2002 మార్చిలో 19 మంది న్యాయవాదులతో ప్రారంభించారని తెలిపారు. అప్పట్లో సొసైటీ సభ్యత్వ రుసుము రూ.2 వేలు వుండగా, ఇప్పుడు అది రూ.20 వేలకు చేరిందన్నారు. ప్రస్తుత సభ్యుల సంఖ్య దాదాపు 300కు చేరిందన్నారు. బార్ కౌన్సిల్ సభ్యులు సూరాబత్తుల మల్లేశ్వరరావు, సుంకర రాజేంద్రప్రసాద్, చలసాని అజయ్‌కుమార్‌లు మాట్లాడుతూ భవిష్యత్తులో ఈ సొసైటీని రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సొసైటీ అభివృద్ధి చెందితే సభ్యుల సహా న్యాయవాదులందరికీ ఆర్థిక అవసరాలు తీర్చేందుకు అడ్వకేట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ బ్యాంకును స్థాపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో న్యాయ వాదులు పడవల ఏడు కొండలు, సిహెచ్. మన్మధరావు, ఆలూరి సుధాకరరావు, కె.ఎస్.సుధాకరరాజు, సప్పా రమేష్, బోను జయమ్మ, కేవీవీ పరమేశ్వరరావు పాల్గొన్నారు.



జనసేన జిల్లా అధ్యక్షుడు ఉదయభానుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్

మర్యాదపూర్వక కలయిక

భారతీనగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి):గురునానక్ కాలనీలోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభానును బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెండోసారి బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు అడ్డూరి శ్రీరామ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నగర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వన్‌టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సీతారామపురం కొత్తవంతెన కాలువగట్టు దుర్గాఅగ్రహారం బోడేవారి వీధిలో ఉంటున్న సరిపల్లి సురేష్(35) బుధవారం రాత్రి ఆత్మహత్య కు పాల్పడ్డాడు. వివరాల ప్రకారం సురేష్ బైండింగ్ పనులు చేస్తాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు. మద్యానికి బానిసైన అతను భార్యతో గొడవ పడుతూ ఉంటాడు. రెండు రోజుల క్రితం సురేష్ భార్యతో గొడవపడి చనిపోతానని బెదిరించి, ఇంట్లో ఉన్న వస్తువులను బయట పడవేశాడు. బుధవారం రాత్రి బయటకు వెళ్లి మద్యం సేవించి వచ్చి గడియ పెట్టుకుని ఇంట్లో పడుకున్నాడు. కొద్దిసేపటి తరువాత భార్య సత్యవతి ఇంటి తలుపు కొట్టగా తీయకపోవటంతో అనుమానం వచ్చి స్థానికుల సహాయంతో ఇంటిలోపల చూడగా సురేష్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. ఆమె స్థానికుల సహాయంతో సురేష్‌ను కిందకి దించి పరిశీలించగా అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహితను వేధిస్తున్న ఇద్దరి పై కేసు...

విద్యాధరపురం మిథిలా నగర్‌లో ఉంటున్న ఓ వివాహితను అసభ్యకరంగా మాట్లాడుతూ బెదిరిస్తున్న ఇద్దరు యువకుల పై గురువారం భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం మిథిలానగర్‌లో ఓ వివాహిత (35) కుటుంబ సభ్యులతో ఉంటుంది. పశ్చిమగోదావరి జిల్లా, ఆకివీడు ప్రాంతానికి చెందిన కోరాడ దుర్గామధు తరచూ బాధితురాలికి ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడుతూ తాను చెప్పినట్లు వినకపోతే తన వద్ద ఉన్న ఫొటోలు యూట్యూబ్‌లో పెడతానంటూ బెదిరిస్తున్నాడు.

దుర్గామధు అతని స్నేహితుడు అజ య్‌తో బాధితురాలికి ఫోన్ చేసి తాము చెప్పినట్లు వినకపోతే నిన్ను, నీభర్తను చంపుతామని బెదిరిస్తున్నారు. దీంతో బాధితు రాలి ఫిర్యాదుపై పోలీసులు వారిద్దరి పై కేసు నమోదు చేశారు.

హెల్మెట్ ధరించండి... ప్రాణాలను కాపాడుకోండి

- ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు



అవగాహన కల్పిస్తున్న సిటీ ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు

వన్‌టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్‌లను ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని విజయవాడ సిటీ ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు విద్యార్థులకు అవగాహన కల్పించారు. గురువారం కొత్తపేటలోని పొట్టిశ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన ఒక కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై, హెల్మెట్‌ధారణ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన ప్రమాదాల వల్ల జరిగే నష్టాలను విద్యార్థులకు తెలియజేశారు. కుటుంబ పెద్ద ప్రాణాలను కోల్పోతే జరిగే నష్టాన్ని వివరించారు. వాహనాలు నడిపే విద్యార్థులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇదే సమయంలో వాహనాలు నడిపే కుటుంబ సభ్యులందరి చేత హెల్మెట్ ధరించేలా చూడాలన్నారు. వన్‌ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు, సెక్టర్ వన్ సీఐ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులకు రేర్ కెమెరాలు ఏర్పాటు చేయాలి

వన్‌టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులకు రేర్ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు.యూనియన్ నాయకులు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య గురువారం ఒక ప్రకటన చేస్తూ సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సులకు రేర్ కెమెరా ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఎండీకి లేఖ ఇచ్చినట్లు పేర్కొన్నారు. బస్టాండ్లలో ఇతర ప్రాంతాల్లో రివర్స్ చేస్తున్నప్పుడు చిన్న ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రాణ నష్టం జరుగుతుందన్నారు. మరోవైపు ఆర్టీసీ డ్రైవర్ల ఉద్యోగ భద్రతకు కూడా ముప్పు ఉన్నందున్న ప్రస్తుతం ఉన్న సాంకేతికను అనుసరించి ఈమధ్య వచ్చిన కొత్త బస్సులకు, రాబోయే బస్సులకు రేర్ కెమెరా ఏర్పాటు చేయాలని కోరారు.

మీ కోసం

మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా?
అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుంది.
మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కాకూడదు.
పది మందికి, మీ ప్రాంత వాసులందరీ సమస్య అయి ఉండాలి.
మీరు పంపాల్సిన వాట్సప్ నెంబరు
9985411602
సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి

ఒకటి నుంచి బ్యూటీషియన్ కోర్సు శిక్షణ

గవర్నర్‌పేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఫిబ్రవరి ఒకటి నుంచి బ్యూటీషియన్ అండ్ టైలరింగ్ శిక్షణకు కొత్త బ్యాచ్ ప్రారంభిస్తున్నట్లు ఎంబీవీకే మహిళా విభాగం కన్వీనర్ పి. విజయ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శిక్షణ ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుం దన్నారు. బ్యూటీషియన్ కోర్సుకు మూడు నెలలు, టైలరింగ్ కోర్సుకు 4 నెలలు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న మహి ళలు 30లోగా ఎంబీవీకే కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

జాయింట్ సమావేశాలు ఏర్పాటు చేయాలి

బస్టేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం తరువాత నిలిపివేసిన జాయింట్ మీటింగ్‌లు కొనసాగించాలని, బీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ప్రజా రవాణా సంస్థ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు కోరారు. గురువారం ఆయన కార్యాలయంలో నాయకులు కలిసి ఈ మేరకు ఆయనకు వినతి పత్రం అందజేశారు.

రాష్ట్రానికి ఐదు 'జైవిక్' అవార్డులు

● ప్రకృతి సేద్యంలో ప్రగతికి గుర్తింపు

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంలో సాధించిన ప్రగతికి గుర్తింపుగా రాష్ట్రానికి ఐదు 'జైవిక్' అవార్డులు వచ్చాయి. రెండు రోజుల పాటు బెంగళూరులో జరిగిన ప్రకృతి వ్యవసాయ సదస్సులో జాతీయస్థాయిలో ఐదు విభాగాల్లో రాష్ట్రానికి దక్కిన అవార్డులను వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్ ఢిల్లీరావు గురువారం అందుకున్నారు. ఉత్తమ సేంద్రియ రైతు విభాగంలో ఏ రవీంద్ర (మన్యం) రూ.లక్ష, సీ లత (నంద్యాల) రూ.50 వేలు అవార్డు అందుకున్నారు. ఉత్తమ సేంద్రియ రైతు ఉత్పత్తిదారుల సంఘ విభాగంలో క్షేత్ర ప్రకృతి ఉత్పత్తిదారుల సంఘం (బాపట్ల), ఉత్తమ సేంద్రియ వ్యవసాయ పరిశోధన సంస్థ విభాగంలో ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ (పులివెందుల), ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహక విధానాల రూపకల్పనలో ప్రభుత్వాలు... విభాగంలో ఏపీ రైతు సాధికార సంస్థ, బయో ఇన్‌పుట్స్ - జీవ వనరుల తయారీ విభాగంలో సుబ్రహ్మణ్యేశ్వర ప్రకృతి వనరుల శిక్షణ కేంద్రం(ఏలూరు)కు అవార్డులు వచ్చాయి. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం మరింత పెంచడానికి రైతులకు ప్రేరణగా, మార్గదర్శిగా జైవిక్ అవార్డులు నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.

అమరావతికి శాశ్వతంగా వరద విముక్తికి చర్యలు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: రాజధాని అమరావతిలో శాశ్వత వరద విముక్తికి వీలుగా అమరావతి రాజధాని అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) మరో రెండు ముఖ్యమైన ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతోంది. రాజధానికి వెళ్లే కరకట్ట రోడ్డుకు అనుసంధానంగా ప్రకాశం బ్యారేజీ సమీపంలో కొండవీడు వాగు పంపింగ్ స్టేషన్‌కు సమాంతరంగా మరో అదనపు పంపింగ్ స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న పంపింగ్ స్టేషన్ పక్కనే దీన్ని ఏర్పాటు చేస్తారు. అలాగే, ఉండవల్లి సమీపంలోని గ్రావిటీ కెనాల్ పంపింగ్ స్టేషన్‌కు సమాంతరంగా మరో పంపింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తారు. ఈ రెండు పంపింగ్ స్టేషన్ల కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. డీపీఆర్ రూపకల్పన కోసం గురువారం ఏడీసీఎల్ టెండర్లు పిలిచింది.

సచివాలయంలో నేతాజీకి ఘన నివాళి

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భారతదేశ స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని పలువురు ఉన్నతాధికారులు ఘన నివాళులర్పించారు. గురువారం అమరావతి సచివాలయంలో సీఎం ముఖ్య కార్యదర్శి రవిచంద్ర, సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, సీఎం కార్యదర్శులు ఏవీ రాజమౌళి, ప్రద్యుమ్న, బోస్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. సచివాలయంలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ

ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు భారత ఎన్నికల సంఘం ఏటా జనవరి 25న దేశ వ్యాప్తంగా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తోందని రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు. రాష్ట్ర సచివాలయానికి ఈ నెల 25న సెలవుదిన మైనందున 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని 24న శుక్రవారం ఉదయం 11 గంటలకు సచివాలయం మొదటి భవనం ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. సచివాలయంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఈ జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞలో పాల్గొని విజయవంతం చేయాలని మీనా కోరారు



ప్రపంచ రోలర్ బాస్కెట్ బాల్ పోటీలకు ధీరజ్ ఎంపిక

గుణదల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇండోనేషియా వేదికగా ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో జరగనున్న ప్రపంచ రోలర్ బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్‌లో నగరానికి చెందిన సాయి గౌతమ్ ధీరజ్ భారతదేశం తరపున తలపడనున్నట్టు కోచ్ పతివాడ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న ఆర్. సాయి గౌతమ్ ధీరజ్ ఇటీవల మహారాష్ట్రలోని నాగపూర్ పట్టణంలో జరిగిన 4వ జాతీయ స్థాయి రోలర్ బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొని మ్యాన్ ఆఫ్ టోర్నమెంట్‌తోపాటు గోల్డ్ మెడల్ సాధించాడన్నారు.

27 నుంచి 8వ ఆహ్వాన నాటకోత్సవాలు

విజయవాడ కల్చరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తపస్వి కల్చరల్ ఆర్ట్స్ 8వ ఆహ్వాన నాటకోత్సవాలను ఈనెల 27 నుంచి 3 రోజుల పాటు గాంధీనగరంలోని హనుమంతరాయ గ్రంథాలయంలోని కళావేదికపై జరుగుతాయని సంస్థ అధ్యక్షుడు డాక్టర్ వేములు హజరత్తయ్య గుప్తా తెలిపారు. గాంధీనగర్‌లోని 'నరసింహ నివాస్'లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజుకి రెండు నాటికలు ప్రదర్శితమవుతాయన్నారు. ఆంధ్ర నాటక కళా సమితి, కొడాలి బ్రదర్స్‌తో సంయుక్తంగా డాక్టర్ నందమూరి తారక రామారావు కళాపరిషత్ పేరిట ఈ ఆహ్వాన నాటకోత్సవాలు జరుపుతున్నట్లు తెలిపారు. సంస్థ కార్యదర్శి ఎస్.జగన్నాథరావు, బాయన శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

జగ్గయ్యపేట ఏఎంసీ చైర్మన్‌గిరీ కోసం పోటాపోటీ





● ఎస్సీ మహిళకు రిజర్వుతో టీడీపీ ఎస్సీ నేతల్లో ఆనందోత్సాహాలు

● సతీమణులతో కలిసి ఎమ్మెల్యే తాతయ్య, నెట్టెం చుట్టూ ప్రదక్షిణలు

ఆంధ్రజ్యోతి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎస్సీ మహిళకు రిజర్వ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటంతో తెలుగుదేశం ఎస్సీ నేతల్లో ఆనందోత్సాహాలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే తర్వాత అంత ప్రాధాన్యత ఉన్న పదవి ఇది. పేట ఏఎంసీ పరిధి చిల్లకల్లు సంతతో పాటు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులు అనేకం ఉన్నాయి. ఈ ప్రాంతం వ్యవసాయాధారితం కావటంతో ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని నేతలు పదవి కోసం పోటీ పడుతున్నారు. గతంలో ఈ పరిధి జగ్గయ్యపేట, వత్సవాయి మండలాలకే పరిమితం కాగా, గత వైసీపీ ప్రభుత్వం నియోజకవర్గం మొత్తం పెనుగంచిప్రోలు, నందిగామ మండల పరిధిలో 10 గ్రామాలను కలిపేయటంతో పదవికి మరింత ప్రాధాన్యత లభించింది. గత ఐదేళ్లలో ఈ పదవి బీసీ మహిళ, జనరల్‌కు లభించగా, తొలిసారి ఎస్సీలకు, అందునా మహిళకు దక్కటం ఇదే ప్రథమం. దీంతో ఆయా వర్గాల నేతలు తమ సతీమణులను రంగంలోకి దించుతున్నారు. తమ సేవలను గుర్తించి అవకాశం ఇవ్వాలని ఎస్సీ సెల్ నేతలు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సోదరులు, టీడీపీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు నెట్టెం రఘురాం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. పట్టణం నుంచి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మాజీ చైర్మన్ శ్రీరాం బదరీ నారాయణకు నమ్మిన బంటుగా, 30ఏళ్లుగా శ్రీరాం సోదరులతోనే కలిసి ప్రయాణం చేస్తున్న మాజీ ఏఎంసీ డైరెక్టర్ మల్లెల కొండ తన సతీమణి అంగన్‌వాడీ వర్కర్ సీతమ్మకు ఇవ్వాలని మునిసిపల్ కౌన్సిలర్లతో కలిసి నెట్టెం, తాతయ్యను కోరారు. అలాగే కొండా సోదరుడు దివంగత బాబురావు జిల్లా స్థాయిలో ఎస్సీ సెల్ నేతగా కాంగ్రెస్‌లో పనిచేశారు. ఆయన సతీమణి చిట్టెమ్మ కౌన్సిలర్‌గా తాతయ్య వర్గం నుంచి ఎన్నికయ్యారు. తన కుటుంబ సేవలను గుర్తించి అవకాశం ఇవ్వాలని కొండా గట్టిగా కోరుతున్నారు. జగ్గయ్యపేట జడ్పీటీసీగా పనిచేసిన అమ్మనబోయిన రాణి, చిల్లకల్లు టీడీపీ ఎస్సీ నేత కారుపాటి డేవిడ్ తన సతీమణి, సర్పంచ్‌గా పనిచేసిన మణికి ఇవ్వాలని, ట్రేడ్ యూనియన్ నేత మాదుగుల సురేష్ తన సతీమణికి, పెనుగంచిప్రోలు నుంచి తాజాగా జడ్పీటీసీగా పోటీ చేసి ఓడిపోయిన ముండ్లపాటి జయమ్మకు ఇవ్వాలంటూ పెనుగంచిప్రోలు నేతలు తాతయ్య, రఘురాంను కోరారు. వత్సవాయి మండలంలో కన్నెవీడుకు చెందిన మాజీ ఎంపీటీసీ అయిన తన భార్యకు ఇవ్వాలని ఆదిమళ్ల రమేష్ కోరారు. బూదవాడ మాజీ సర్పంచ్ పొట్టపొంగు బాబురావు సహా పలువురు ఎస్సీ నేతలు తమకు చాన్స్ ఇవ్వాలని కోరుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో హోంగార్డు, యువకుడి మృతి

ఘంటసాల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లాలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో హోం గార్డు, యువకుడు మృతి చెందిన సంఘటనలు గురువారం జరిగాయి. ఘంటసాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళాపురం గ్రామానికి చెందిన గొరిపర్తి యశ్వంత్ (20) మచిలీపట్నం హెడ్‌క్వార్టర్‌లో బుధవారం రాత్రి విధులు నిర్వహించుకుని గురువారం ఉదయం బైక్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా 6.40 నిముషాలకు జీలగలగండి కాలనీ సమీపంలోని దెయ్యపు కాలువ వద్ద తెల్లటి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యశ్వంత్‌కు తీవ్ర గాయాలవగా మచిలీపట్నం ఆంధ్రా ఆసుపత్రికి తరలించారు. యశ్వంత్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం విజయవాడ ప్రైవేట్ హాస్పటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. యశ్వంత్ తండ్రి శ్రీనివాస్ హోంగార్డుగా పనిచేస్తూ హార్ట్ ఎటాక్‌తో చనిపోగా, డిపార్ట్‌మెంట్ కుమారుడికి అవకాశం ఇచ్చింది. దీంతో యశ్వంత్ గత డిసెంబర్‌లో హోం గార్డుగా జాయినయ్యాడు. ఘంటసాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విలపిస్తున్న సుధీర్

జంక్షన్‌లో యువకుడి మృతి

హనుమాన్‌జంక్షన్: ఏలూరు జిల్లా పెదపాడు మండలం కడింకుంట గ్రామానికి చెందిన నక్కా క్రాంతి (19), అతడి బావమరిది పరిశే సుధీర్ ద్విచక్ర వాహనంపై విజయవాడ రోడ్డు నుంచి జంక్షన్ సెంటర్ వైపు వెళుతుండగా వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనం వెనుక కూర్చున్న క్రాంతి లారీ కింద పడి దుర్మరణం చెందాడు. వాహనాన్ని నడుపుతున్న సుధీర్ ప్రాణాలతో బయటపడ్డాడు. యువకుడు మృతికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని జంక్షన్ ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



ర్యాలీలో పాల్గొన్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

ఇంధన హబ్‌గా ఎన్టీఆర్ జిల్లా

గుణదల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాను పునరుత్పాదక ఇంధన హబ్‌గా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. విద్యుత్‌శాఖ, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఎనికేపాడులో గురువారం నిర్వహించిన పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన జనజాగృతి ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. సూర్యఘర్ పథకం ద్వారా ఎనికేపాడు నివాసి ఆర్.వీరరాఘవయ్య 15 రోజుల కిందట ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్యానల్ వ్యవస్థను కలెక్టర్ పరిశీలించారు. ఈ పథకం ద్వారా ఇంటి పైకప్పుపై అధిక రాయితీతో అతి తక్కువ ఖర్చుతో సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకుని కరెంట్ బిల్ భారాన్ని తగ్గించుకోవచ్చన్నారు. రూ.2లక్షల విలువైన 3 కేడబ్ల్యూ సోలార్ ప్యానెల్‌ను రూ.78వేల రాయితీతో ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. రాయితీ మినహా మిగిలిన సొమ్మును తక్కువ వడ్డీతో బ్యాంకు రుణంగా పొందే అవకాశం ఉందన్నారు. దాదాపు 20 ఏళ్లపాటు ఉచితంగా సౌర విద్యుత్‌ను పొందవచ్చన్నారు. ఈ పథకం ద్వారా జిల్లాల్లో 2 లక్షల కనెక్షన్లను లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ఇప్పటి వరకు దాదాపు 60 వేల రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు.

విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎ.మురళీమోహన్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, నోడల్ అధికారి ఎం.భాస్కర్, సర్పంచ్ ఆర్.పూర్ణచంద్రరావు, ఉప సర్పంచ్ టీవీవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక సదుపాయాలు

● విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలోని విద్యార్థులు క్రీడల్లోనూ రాణించేందుకు ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా కేశినేని శివనాథ్ తన సొంత నిధులతో జిల్లాలోని 145 ప్రభుత్వ పాఠశాలలో క్రీడ కిట్ల పంపిణీ గురువారం నిర్వహించారు. గాంధీజీ మునిసిపల్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ మాజీ సీఎం, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చదివిన గాంధీజీ మునిసిపల్ హైస్కూల్‌లో లోకేష్ జన్మదినం సందర్భంగా క్రీడా కిట్లను పంపిణీ ప్రారంభించటం ఆనందంగా ఉందన్నారు. ఆటల్లో బాగా రాణించాలన్న కారణంగా విద్యార్థులకు ఉపయోగపడేందుకు తన సొంత నిధులతో 145 ప్రభుత్వ పాఠశాలలో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేసి లాంగ్ జంప్ కిట్లను సిద్ధం చేయించినట్టు తెలిపారు. అనంతరం డీఈవో సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడా కిట్లను అందజేయటంతో పాటు పాఠశాలల మైదానాలను అభివృద్ధికి కృషి చేసిన శివనాథ్‌కు ధన్యవాదాలు తెలిపారు. స్టేట్ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ భానుమూర్తి, ఎన్టీఆర్ జిల్లా సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు, గాంధీజీ మునిసిపల్ హైస్కూల్ హెడ్ మాస్టర్ మల్లిఖార్జునరెడ్డి, టీడీపీ నేతలు ఫతావుల్లా, గొట్టుముక్కల రఘురామరాజు, ఎన్డీయే కూటమి నేతలు పాల్గొన్నారు. గాంధీజీ మునిసిపల్ హైస్కూల్, గొల్లపల్లి నాగేశ్వరరావు మునిసిపల్ కార్పొరేషన్, దళవాయి సుబ్బరామయ్య మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్, పాదర్తి సుందరమ్మ బాలికల హైస్కూల్, మౌలానా అజాద్ మునిసిపల్ హైస్కూల్స్‌కు కిట్లను అందజేశారు.



క్రీడా కిట్లను అందచేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జగ్గారావు

కౌలు రైతుల పేరుతోనే ఈ-క్రాప్

● వ్యవసాయ శాఖ డీడీ జగ్గారావు

గవర్నర్‌పేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కౌలు గుర్తింపు కార్డు లేకపోయినా వాస్తవంగా సాగు చేస్తున్న కౌలురైతుల పేరుతోనే ఈ-క్రాప్ నమోదు చేయాలని నిబంధనలు మార్పు చేసినట్టు వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జగ్గారావు తెలిపారు. ఎంజీ రోడ్డులోని కౌలు రైతుల సంఘ రాష్ట్ర కార్యాలయంలో సంఘ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నిబంధన మార్పు గురించి వివరిస్తూ భూయజమాని పేరుతో ఈ-పంట నమోదైనప్పటికీ మార్పు చేయడానికి, కౌలురైతుల పేర్లు నమోదు చేయడానికి అవకాశం ఉందన్నారు. పొరపాటున కౌలు రైతుల స్థానంలో భూ యజమాని పేరు నమోదు చేసినా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సరిచేయించే బాధ్యత కౌలు రైతుల సంఘం తీసుకోవాలన్నారు. కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై. రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. హరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం, వ్యవసాయ శాఖ విడుదల చేసిన కొన్ని జీవోలు, నిబంధనల మార్పు గురించి వివరించారు. వివిధ జిల్లాలకు చెందిన కౌలు రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటి తాళాలు పగలకొట్టి చోరీ

● రూ.11.50 లక్షల నగదు, 15 గ్రాముల బంగారం అపహరణ

● నిందితుల కోసం పోలీసుల గాలింపు

గుణదల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలకొట్టి బీరువాలో భద్రపరచిన రూ.11.50 లక్షల నగదు, 15 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన గుణదల మురళీనగర్లో బుధవారం అర్ధరాత్రి జరిగింది. కాల్వకట్టమీద నివాసముంటున్న తానికాటిల్ రామ్మోహన్ రావు (40) రామవరప్పాడు బల్లెంవారి వీధిలోని ఆర్ ఆర్ దర్బార్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. ఇంకా వివాహం కాలేదు. కొన్నేళ్ల క్రితం తల్లిదండ్రులు చనిపోగా, అక్కకు వివాహం చేసేందుకు నగదు, బంగారు ఆభరణాలు ఇంట్లోనే జాగ్రత్త చేస్తున్నాడు. విశాఖపట్నంలో వీరి బంధువు ఒకరు చనిపోవడంతో ఇంటికి తాళం వేసి ఈనెల 20న అక్కతో కలిసి వెళ్లి గురువారం ఉదయం ఇంటికి తిరిగి రాగా ఇంటితాళాలు పగలకొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగలకొట్టి ఇల్లంతా చిందరవందరగా ఉంది. గుణదల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్, సెంట్రల్‌జోన్ ఏసీపీ దామోదర్ ఘటనా స్థలానికి చేరుకుని పూర్వాపరాలు సేకరించారు. ప్రత్యేక బృందాలతో గాలింపు ప్రారంభించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గుణదల సీఐ తెలిపారు.



చోరీ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సెంట్రల్ జోన్ ఏసీపీ, గుణదల సీఐ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న డీసీపీ నాయుడు, డీటీసీ మోహన్

వాహనం నడపటంపై దృష్టి పెట్టాలి

● డీసీపీ కృష్ణమూర్తి నాయుడు

కృష్ణలంక, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వాహనాలను నడిపేటప్పుడు మనస్సు శరీరం ఒకటిగా చేసుకొంటూ వాహనం నడపడంపై దృష్టి పెట్టాలని డీసీపీ కృష్ణమూర్తి నాయుడు హితవు పలికారు. కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో 'లార్జ్ అర్బన్ ఏరియా ట్రాఫిక్ వలంటీరింగ్' వారోత్సవాల ముగింపు గురువారం నిర్వహించారు. డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, డీటీసీ మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్‌ను, కారు నడిపేవారు సీట్ బెల్ట్‌ని ధరించి వాహనాలు నడపాలన్నారు.డీటీసీ మోహన్ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాలన్నారు. నెహ్రూ యువ కేంద్రం యువ అధికారి సుంకర రాము మాట్లాడుతూ రోడ్డు భద్రత వారోత్సవాలు ఈ నెల 17 నుంచి 23 వరకు, అర్బన్ ఏరియా ట్రాఫిక్ వలంటీరింగ్ ప్రోగ్రాంను నిర్వహించామన్నారు. సిద్ధార్థ విద్యార్థులు, విజయ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఫర్ ఉమెన్, కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు, 500 మంది మై భారత్ వలంటీర్స్ పాల్గొన్నారన్నారు. అనంతరం డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, డీటీసీ ఎ.మోహన్ చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్స్‌ను అందజేశారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివరామ్‌గౌడ్, పెనమలూరు సబ్ ఇన్‌స్పెక్టర్ లంక సురేష్, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి కోళ్ల నరేంద్ర, మై భారత్ వలెంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ పోలీసింగ్‌కు బెజవాడ గొప్ప ఉదాహరణ

● పోలీసులపై సీఎం ప్రశంసలు

విజయవాడ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు విజయవాడ పోలీసులపై ప్రశంసల వర్షం కురిపించారు. ప్రజల భాగస్వామ్యంతో 1000 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించడం, ప్రజలతో సురక్ష కమిటీలను ఏర్పాటు చేయడం, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన పెంచడానికి హైటెక్ ఈగల్ వాహనాలను రహదారులు పైకి తీసుకురావడాన్ని ఆయన ఎక్స్‌లో అభినందించారు. టెక్నాలజీని ఉపయోగించుకుని సురక్షిత వాతావరణాన్ని ప్రజలకు అందించడానికి ఇదొక గొప్ప స్ఫూర్తి అని కొనియాడారు. కమ్యూనిటీ పోలీసింగ్‌కు విజయవాడ గొప్ప ఉదాహరణని పేర్కొన్నారు.

● సత్కారం



విజయవాడలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎస్ఎల్‌వీ గ్రూపు చైర్మన్ పెనుమత్స శ్రీనివాసరాజు బుధవారం రూ.20లక్షలు విరాళంగా ఇచ్చారు. నగరంలో జరిగిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో ఆయన్ను డీజీపీ ద్వారకా తిరుమలరావు, పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు సత్కరించారు. - వన్‌టౌన్, ఆంధ్రజ్యోతి



టెన్త్ తరగతి స్టడీ మెటీరియల్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి టీచర్లు కృషి చేయాలి

● టెన్త్ స్టడీ మెటీరియల్ పుస్తకం ఆవిష్కరణ

గవర్నర్‌పేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో విశేష అనుభవమున్న సీనియర్ టీచర్లు తయారు చేసిన పదో తరగతి స్టడీ మెటీరియల్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందని ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి.విజయరామరాజు అన్నారు. డెమొక్రటిక్ పీఆర్‌టీయూ, ఉపాధ్యాయ సేవాదళ్ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన పదో తరగతి స్టడీ మెటీరియల్ పుస్తకాన్ని గురువారం విద్యాశాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను మాట్లాడుతూ సమాధానాలతో కూడిన మోడల్ ప్రశ్నాపత్రాల పుస్తకాన్ని రూపొందించామన్నారు. అన్ని జిల్లాల్లో నమూనా కాపీలను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. సంఘ రాష్ట్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ నేతలు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భానుమూర్తి రాజు

నేటినుంచి సెపక్ తక్రా పోటీలు ప్రారంభం


లబ్బీపేట (స్పోర్ట్స్), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): 68వ నేషనల్ స్కూల్ గేమ్స్ సెపక్ తక్రా అండర్-14 బాలబాలికల టోర్నమెంట్ శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఏపీ కార్యదర్శి భానుమూర్తి రాజు తెలిపారు. గురువారం పటమటలోని జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ టోర్నీ నిర్వహణకు విజయవాడ నగరం ఆతిథ్యం ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. రెండు ఫ్లడ్‌లైట్ల కోర్టుల్లో జరిగే ఈ టోర్నీ లీగ్, నాకౌట్ పద్ధతిలో జరుగుతుందన్నారు. క్రీడాకారులకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని, 12 రాష్ట్రాల క్రీడాకారులు ఈ టోర్నీలో పాల్గొంటున్నారని, ఇప్పటికే వారు నగరానికి చేరుకోగా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, అధికారులు పాల్గొంటారన్నారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు, సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టోర్నీ సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు.



శిక్షణలో పాల్గొన్న మహిళా సమాఖ్య అధ్యక్షులు

స్వయం సహాయక సమాఖ్య అధ్యక్షులకు ముగిసిన అవగాహన సదస్సు

వన్‌టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థ నిర్వహించిన ఒకరోజు అవగాహన సదస్సు గురువారం ముగిసింది. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో విజయవాడ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని నందిగామ, తిరువూరు, మైలవరం, జగ్గయ్యపేట నియోజకవర్గాలకు చెందిన 16 మండలాల స్వయం సహాయక సమాఖ్య అధ్యక్షులతో పాటు 30 మంది పాల్గొన్నారు. జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ లైవ్‌లీ గుడ్ మిషన్ అసోసియేట్ ప్రొఫెసర్ రాధికా రాణి, ఎన్.ఆర్.ఎం. ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ బాబూరావు, మురళీధర్ వికసిత పంచాయత్ లక్ష్యంలో భాగంగా గ్రామాలను అభివృద్ధి చేయటంపై అవగాహన కల్పించారు. ఎన్టీఆర్ జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కందుల కల్పన ఆధ్వర్యంలో మండల సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.



నూతన భవనంలో రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందుకుంటున్న యజమాని

31 వరకే బీఫారం రిజిస్ట్రేషన్లు

చిట్టినగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వీఎంసీ పరిధిలోని పాయకాపురం కాలనీలు, కొత్త రాజరాజేశ్వరిపేట తదితర ప్రాంతాల్లో బీ-ఫామ్ పట్టాల రిజిస్ట్రేషన్ (వీఎంసీ) ఈనెల 31 వరకు జరుగుతాయని ఇంకా రిజిస్ట్రేషన్ చేయించుకోని వారు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం వీఎంసీ ప్రధాన కార్యాలయం నూతన భవనంలో రాజరాజేశ్వరిపేట, పాయకాపురం ప్రాంతాలకు చెందిన పలువురి పట్టాల రిజిస్ట్రేషన్ జరిగింది. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో నూతన భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో రెండు ప్రత్యేక రిజిస్ట్రేషన్ కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చేస్తున్నారన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయని, పదేళ్లుగా యజమానులుగా ఉంటున్న వారికి గజం రూ.100 చొప్పున తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఇచ్చుకుందాం బేబీ..



విష్వక్‌సేన్ హీరోగా రామ్‌నారాయణ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'లైలా'. సాహు గారపాటి నిర్మాత. ఆకాంక్ష శర్మ హీరోయిన్‌గా నటించారు. ఫిబ్రవరి 14న విడుదలవుతోంది. ఈ సినిమా నుంచి 'ఇచ్చుకుందాం బేబీ..' పాటను గురువారం విడుదల చేశారు. పూర్ణాచారి సాహిత్యానికి జేమ్స్ స్వరపరిచిన ట్రాక్ ఆప్ బీట్ మోడ్రన్ స్టయిల్ బ్లెండ్‌తో ఆకట్టుకుంటోంది. ఆదిత్య ఆర్కే, ఎంఎం మానసిక ఆలపించారు. ఈ సందర్భంగా విశ్వక్‌సేన్ మాట్లాడుతూ 'ఇలాంటి క్యారెక్టర్ చేయాలని ఎప్పటి నుంచో ఉండేది. నా కెరీర్‌లో యాక్షన్ టచ్‌తో అవుట్ అండ్ అవుట్ కామెడీ ఫిల్మ్ ఇదే' అని అన్నారు. చిత్ర దర్శకుడు రామ్‌నారాయణ్ మాట్లాడుతూ 'ఈ కథను ఇద్దరు, ముగ్గురు హీరోలకు చెప్పాను. లేడీ గెటప్ వేయడం అంత ఈజీ కాదు. సినిమా అంటే పిచ్చి వున్నోడే చేయాలి. అలాంటి పిచ్చి ఉన్న విశ్వక్ నాకు దొరికారు' అని అన్నారు. నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ 'సినిమా కోసం విశ్వక్ చాలా కష్టపడ్డారు. ఈ క్యారెక్టర్ తన కెరీర్‌లో నిలిచిపోతుంది' అని అన్నారు.

హైలెస్సో.. హైలెస్సా



నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న లవ్, యాక్షన్ ఎంటర్‌టైనర్ 'తండేల్' చిత్రం నుంచి మూడో పాటను గురువారం విడుదల చేశారు. శ్రీమణి రాసిన 'హైలెస్సో హైలెస్సా' పాటను దేవిశ్రీప్రసాద్ స్వరపరచగా శ్రేయా ఘోషల్, నకాశ్ అజీజ్ పాడారు. ప్రేమజంట మధ్య ఉన్న అనుబంధాన్నీ, అనురాగాన్నీ అద్భుతంగా ఆవిష్కరించే పాట ఇదని దర్శకుడు చందూ మొండేటి చెప్పారు. ఈ పాటలో నాగచైతన్య మాస్ లుక్‌లో కనిపించి అభిమానుల్ని అలరించనున్నారు. అలాగే సాయిపల్లవి క్లాసికల్ డాన్స్ మూమెంట్స్‌తో మరింత ఆకట్టుకోనున్నారు. అద్భుతమైన ఈ జోడీ తమ అభినయంతో కనువిందు చేయనున్నారు. సీనియర్ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న విడుదల కానుంది.

అన్నీ అద్భుతంగా కుదిరాయి



'ఈ సినిమా చేస్తున్నప్పుడు ఒక పాజిటివ్ ఎనర్జీ ఉండేది. ఇది ఒక మ్యూజికల్ జర్నీలా అనిపించింది. అన్నీ అద్భుతంగా కుదిరాయి. ఇదంతా డివైన్ ఎనర్జీగా భావిస్తున్నా. చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో దగ్గుబాటి వెంకటేశ్. ఆయన హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్‌రాజు, శిరీశ్ నిర్మించారు. ఇటీవలె విడుదలై బ్లాక్‌బస్టర్ విజయంతో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చిత్ర యూనిట్ పాల్గొంది. ఈ కార్యక్రమంలో వెంకటేశ్ మాట్లాడుతూ 'సంక్రాంతికి కుటుంబ చిత్రాన్ని ఇవ్వాలనుకున్నాం. కానీ ప్రేక్షకులు నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్లారు. హిట్ కాదు... ట్రిపుల్ బ్లాక్ బస్టర్ అంటున్నారు' అని అన్నారు. చిత్రదర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'సినిమాకు దూరమైన ప్రేక్షకులు మా చిత్రాన్ని చూసేందుకు థియేటర్లకు రావడం ఆనందంగా ఉంది. వచ్చిన ప్రతీ రూపాయి ప్రేక్షకుడి నవ్వుతో రావడం హ్యాపీగా ఉంది. ఈ విజయం ఎప్పటికీ గుర్తుండిపోతుంది. కుటుంబ కథా చిత్రాలకు ఉండే బలాన్ని ఈ సినిమా మరోసారి నిరూపించింది' అని అన్నారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో మాట్లాడుతూ "సంక్రాంతికి వస్తున్నాం" ఓ అమ్మలాంటి జ్ఞాపకం. ఈ సినిమాతో ప్రతి గడపకు వెళ్లగలిగాను 'కలిసుందాం రా' పాటలని ప్రేక్షకులు తమ గుండెల్లో పెట్టుకున్నట్టే ఈ చిత్రంలోని పాటలను కూడా అంతలా ఆస్వాదించారు' అని అన్నారు.

హ్యాపీగా రిటైరవుతా



నటనకు ఆస్కారమున్న విభిన్న పాత్రలతో ప్రేక్షకులను మెప్పిస్తూ దక్షిణాది చిత్రాలతో పాటు బాలీవుడ్‌లోనూ సత్తా చాటుతున్నారు రష్మిక మందన్న. విక్కీ కౌశల్ సరసన ఆమె నటించిన తాజా చిత్రం 'ఛావా'. ఫిబ్రవరి 14న విడుదలవుతోంది. ఈ చిత్రంలో రష్మిక శంభాజీ మహారాజ్ భార్య యేసుబాయి పాత్రలో కనిపించనున్నారు. ఇటీవలే చిత్రబృందం నిర్వహించిన ట్రైలర్ విడుదల కార్యక్రమంలో రష్మిక తన పాత్ర గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'యేసుబాయి పాత్రలో నటించే అవకాశం తనకు దక్కడం గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు రష్మిక చెప్పారు. ఒక నటిగా నాకు ఇంతకు మించి ఏం కావాలి. ఈ సినిమా తర్వాత నేను సంతోషంగా రిటైర్ అవ్వగలను అని దర్శకుడితో చెప్పాను. ఈ పాత్ర అంత గొప్పగా ఉంటుంది. షూటింగ్ టైంలో ఎన్నిసార్లు భావోద్వేగానికి గురయ్యానో లెక్కలేదు. ట్రైలర్ చూస్తున్నప్పుడు కూడా అంతే ఉద్వేగానికి గురయ్యాను' అన్నారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో దినేష్ విజయన్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

ఆస్కార్ నామినేషన్ల జాబితా విడుదల



సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆస్కార్ నామినేషన్ల జాబితా విడుదలైంది. 97వ అకాడమీ అవార్డుల కోసం పోటీపడుతున్న ఫీచర్ ఫిల్మ్ జాబితాను కమిటీ విడుదల చేసింది. వీటిల్లో 'ఎమీలియా పెరెజ్' చిత్రం 13 నామినేషన్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఒక ఆంగ్లేతర చిత్రం ఇన్ని నామినేషన్లు పొందడం ఓ రికార్డ్. 10 నామినేషన్లతో 'విక్డ్' చిత్రం రెండో స్థానంలో ఉంది. మెయిన్‌స్ట్రీమ్ ఫీచర్ ఫిల్మ్ జాబితాలో భారతీయ చిత్రాలేవీ అర్హత సాధించలేదు. సాధారణంగా ప్రతీ ఏడాది జనవరి 8 నుంచి 14 తేదీలలో ఈ నామినేషన్ల ప్రక్రియ జరుగుతుంది. కానీ కాలిఫోర్నియాలో ఏర్పడిన కార్చిచ్చు కారణంగా రెండుసార్లు వాయిదా పడింది. ఎట్టకేలకు గురువారం ఈ జాబితాను ప్రకటించారు. అయితే ఈ జాబితాను ప్రకటించిన సమయంలోనూ కాలిఫోర్నియాలో మరోసారి కార్చిచ్చు చెలరేగింది.

అనూజ లఘుచిత్రానికి నామినేషన్



ఢిల్లీ నేపథ్యంలో తెరకెక్కిన 'అనూజ' చిత్రం ఈ ఏడాది లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ విభాగంలో పోటీలో నిలవడమే భారతీయులకు కొంత ఊరటనిచ్చే విషయం. తొమ్మిదేళ్ల బాలకార్మికురాలి జీవితం ఆధారంగా దర్శకద్వయం ఆడమ్.జే.గ్రేవ్స్, సుచిత్ర మట్టై ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. రెండు సార్లు ఆస్కార్ అవార్డు గెలిచిన నిర్మాత గునీత్ మోంగా, నటి ప్రియాంక చోప్రా ఈ లఘు చిత్రానికి సహ నిర్మాతలుగా వ్యవహరించారు. 'ఏ లైన్', 'ఐ యామ్ నాట్ ఏ రోబోట్', 'ద లాస్ట్ రేంజర్', 'ద మాన్ హు కుడ్ నాట్ రిమైన్ సైలెంట్' లఘు చిత్రాలతో 'అనూజ' పోటీపడుతోంది. ముందు ప్రకటించిన విధంగానే మార్చి 2న ఆస్కార్ అవార్డుల వేడుక జరగనుంది.

ప్రీపెయిడ్ కస్టమర్ల కోసం
కొత్త టారిఫ్ ప్లాన్స్

వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌ల కోసమే..
ట్రాయ్ చర్యలతో దిగొచ్చిన టెలికాం సంస్థలు

న్యూఢిల్లీ: డేటా అవసరం లేని ప్రీపెయిడ్ కస్టమర్ల కోసం టెలికాం సంస్థలు కొత్త ప్లాన్స్ ప్రకటించాయి. ఈ ప్లాన్స్‌లో వినియోగదారులకు వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్ సేవలు మాత్రమే అందుబాటులో ఉంటాయి. టెలికాం నియంత్రణ మండలి ట్రాయ్ మొట్టికాయలతో టెల్కోలు ఈ ప్లాన్స్ తీసుకొచ్చాయి. ఇందులో భాగంగా ఎయిర్‌టెల్ రూ.499, రూ.1,959 టారిఫ్‌తో రెండు ప్రీపెయిడ్ ప్లాన్స్ ప్రకటించింది. ఇందులో రూ.499 టారిఫ్ ప్లాన్ 84 రోజుల వ్యాలిడిటీ, అపరిమిత వాయిస్ కాల్స్, 900 ఎస్ఎంఎస్‌లతో లభిస్తుంది. రూ.1,959 ప్లాన్ 365 రోజుల వ్యాలిడిటీ, అపరిమిత వాయిస్ కాల్స్, 3,600 ఎస్ఎంఎస్‌లతో లభిస్తుంది. రిలయన్స్ జియో కూడా దాదాపు ఇదే సదుపాయాలతో రూ.458, రూ.1,958 టారిఫ్‌తో రెండు ప్రీపెయిడ్ ప్లాన్స్ ప్రకటించింది. ఇందులో రూ.458 ప్లాన్ వ్యాలిడిటీ 84 రోజులు. ఈ ప్లాన్ ద్వారా వినియోగదారులు అపరిమిత వాయిస్ కాల్స్, వెయ్యి ఎస్ఎంఎస్‌లు పంపుకోవచ్చు. రూ.1,958 ప్లాన్ వ్యాలిడిటీ 365 రోజులు. ఈ ప్లాన్ ద్వారా చందాదారులు అపరిమిత వాయిస్ కాల్స్, 3,600 ఎస్ఎంఎస్‌లు పంపుకోవచ్చు. డేటా అవసరం లేని ప్రీపెయిడ్ చందాదారులకు ఈ ప్లాన్స్ ఎంతగానో ఉపయోగపడతాయని భావిస్తున్నారు.

తగ్గిన సైయెంట్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇంజనీరింగ్ సర్వీసెస్ సంస్థ సైయెంట్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.124 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.179 కోట్లు)తో పోల్చితే లాభం 28.3 శాతం తగ్గింది. సమీక్షా త్రైమాసికంలో డీఈటీ (డిజిటల్, ఇంజనీరింగ్, టెక్నాలజీ) మొత్తం ఆదాయం కూడా స్వల్పంగా క్షీణించి రూ.1,480 కోట్లుగా నమోదైంది. కాగా డీఈటీ విభాగంలో కొత్తగా 13 డీల్స్‌ను కుదుర్చుకున్నట్లు కంపెనీ తెలిపింది.

డాక్టర్ రెడ్డీస్ లాభం
రూ.1,413 కోట్లు
డిసెంబరు త్రైమాసిక ఆదాయం రూ.8,359 కోట్లు.. కలిసొచ్చిన ఎన్ఆర్‌టీ వ్యాపారం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,413 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.1,379 కోట్లు) తో పోల్చితే లాభం 2 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రెవెన్యూ రూ.7,215 కోట్ల నుంచి రూ.8,359 కోట్లకు పెరిగింది. ఇటీవల కొనుగోలు చేసిన నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ (ఎన్ఆర్‌టీ) వ్యాపారంతో పాటు కొత్త ఔషధాల విడుదల, నిర్వహణపరంగా సామర్థ్యాలను మెరుగుపరుచుకోవటం ఎంతగానో కలిసి వచ్చిందని డాక్టర్ రెడ్డీస్ కో చైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ తెలిపారు. అంతేకాకుండా అఫర్డబిలిటీ, నవకల్పనలపై దృష్టి పెట్టడం ద్వారా రోగుల అవసరాలను తీర్చేందుకు తాము కట్టుబడి ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్ఆర్‌టీ వ్యాపారం నుంచి అదనంగా రూ.605 కోట్ల రెవెన్యూ రావటం కలిసివచ్చిందని కంపెనీ తెలిపింది.

అమెరికా వ్యాపారంలో స్వల్ప వృద్ధి

డిసెంబరు త్రైమాసికంలో ఉత్తర అమెరికా వ్యాపారం స్వల్పంగా 1 శాతం వృద్ధితో రూ.3,349 కోట్ల నుంచి రూ.3,383 కోట్లకు పెరిగిందని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది. మరోవైపు యూరప్ వ్యాపారం ఏకంగా 143 శాతం వృద్ధితో రూ.497 కోట్ల నుంచి రూ.1,210 కోట్లకు పెరిగినట్లు పేర్కొంది. ఇదే సమయంలో భారత్‌లో అమ్మకాలు కూడా రూ.1,180 కోట్ల నుంచి రూ.1,346 కోట్లకు పెరగగా వర్ధమాన మార్కెట్లలో విక్రయాలు 12 శాతం పెరుగుదలతో రూ.1,436 కోట్లకు చేరుకున్నాయని తెలిపింది. డిసెంబరు త్రైమాసికంలో ఆర్ అండ్ డీ వ్యయాలు రూ.665.80 కోట్లుగా ఉన్నట్లు డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. కంపెనీ మొత్తం ఆదాయాల్లో ఇది 8 శాతానికి సమానమని పేర్కొంది.



కీలక వ్యాపారాలపై మరింత దృష్టి

కంపెనీకి చెందిన ప్రస్తుత ఔషధాల పోర్టుఫోలియోను మరింత పటిష్ఠం చేయటంతో పాటు కీలకమైన వ్యాపారాలైన జెనరిక్స్, ఏపీఐలపై మరింత దృష్టి పెట్టనున్నట్లు డాక్టర్ రెడ్డీస్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ ఎంవీ నరసింహం తెలిపారు. అంతేకాకుండా వ్యూహాత్మక విభాగాలైన కన్స్యూమర్ హెల్త్, ఇన్నోవేటివ్ ఉత్పత్తులు (డిజిటల్ థెరాప్యుటిక్స్, ప్రత్యేకమైన మాలిక్యూల్స్), బయోసిమిలర్స్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టనున్నట్లు చెప్పారు. ఇందుకు తగ్గట్టుగానే ఆర్ అండ్ డీపై పెట్టుబడులు పెంచుకుంటూ వస్తున్నట్లు నరసింహం తెలిపారు.

మారుతి కార్లు మరింత ప్రియం

- రూ.32,500 వరకు పెరుగుదల
- ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ: పెరిగిన ముడిసరుకు ధరలు, నిర్వహణ వ్యయాల భారాన్ని పాక్షికంగా తగ్గించుకునేందుకు తమ కార్ల ధరలు రూ.32,500 వరకు పెంచనున్నట్టు దేశీయ కార్ల దిగ్గజం మారుతి సుజుకీ తెలిపింది. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ధరల పెరుగుదల అమల్లోకి వస్తాయని తెలిపింది. కంపెనీ ప్రస్తుతం రూ.3.99 లక్షల నుంచి (ఆల్టో కే-10) నుంచి రూ.28.92 లక్షల (ఇన్విక్టో) శ్రేణిలో కార్లను విక్రయిస్తోంది. కాంపాక్ట్ కారు సెలేరియో ధర గరిష్ఠంగా రూ.32,500 పెరుగుతుంది. ప్రీమియం కారు ఇన్విక్టో ధర రూ.30,000, వ్యాగన్-ఆర్ ధర రూ.15,000, స్విఫ్ట్ ధర రూ.5,000 పెరుగుతాయి. ఎస్‌యూవీల్లో బ్రెజ్జా ధర రూ.20,000, గ్రాండ్ విటారా ధర రూ.25,000 వరకు పెరగనున్నాయి. ఎంట్రీ లెవెల్ కార్లలో ఆల్టో కే10 ధర రూ.19,500, ఎస్-ప్రెసో ధర రూ.5,000 పెరుగుతుంది. ప్రీమియం కాంపాక్ట్ కారు బాలెనో ధర రూ.9,000, ఎస్‌యూవీ ఫ్రాంక్స్ ధర రూ.5,500, కాంపాక్ట్ సెడాన్ డిజైర్ ధర రూ.10 వేలు పెరగనుంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	127	విజయవాడ	141
వరంగల్	127	గుంటూరు	137
కరీంనగర్	127	ఒంగోలు	137
మహబూబ్‌నగర్	127	చిత్తూరు	112
కర్నూలు	127	నెల్లూరు	117
విశాఖపట్నం	132	అనంతపురం	117
గోదావరి	141		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	490
వరంగల్	462	గోదావరి	485
చిత్తూరు	503	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ. 72	



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	82,100 ▲	75,260 ▲	1,04,000 ▲
విజయవాడ	82,000 ▼	77,000 ▼	93,500 ▼
విశాఖపట్నం	79,810 ▼	73,160 ▼	91,280 ▼
రాజమండ్రి	82,090 ▲	75,250 ▲	94,600 ▲
ప్రొద్దుటూరు	81,150 ▲	75,140 ▲	93,000 ▼
ముంబై	80,039 ▼	73,316 ▼	90,633 ▼

ఆర్‌బీఐ నుంచి భారీ డివిడెండ్!

రూ.2 లక్షల కోట్ల వరకు ఉండే అవకాశం

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కూడా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నుంచి కేంద్ర ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో డివిడెండ్ లభించే సూచనలు కనిపిస్తున్నాయి. ఇది రూ.1.5 లక్షల కోట్ల నుంచి రూ.2 లక్షల కోట్ల వరకు ఉండవచ్చని క్వాంట్‌ఎకో రీసెర్చ్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ అంచనా వేస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2023-24) కూడా ఆర్‌బీఐ కేంద్ర ప్రభుత్వానికి రూ.2.01 లక్షల కోట్లు డివిడెండ్‌గా చెల్లించింది. అయితే ఈ ఆర్థిక సంవత్సరానికి ఎంత మొత్తం డివిడెండ్‌గా చెల్లించాలనే విషయాన్ని మే నెలలో జరిగే ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు సమావేశం నిర్ణయించనుంది.

పెట్టుబడులు, రూపాయి-డాలర్ మారకం రేటులో తేడా, కరెన్సీ నోట్లు ప్రింట్ చేసినందుకు వచ్చే ఫీజు ద్వారా ఆర్‌బీఐకి పెద్ద మొత్తంలో ఆదాయం వస్తుంది. అందులో కొంత మొత్తాన్ని తన అవసరాలకు ఉంచుకుని, మిగతా మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్‌గా చెల్లిస్తుంది. ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడులు నీరసించి, పన్నుల వసూళ్ల వృద్ధి రేటు తగ్గిపోతున్న ప్రస్తుత తరుణంలో కేంద్ర ప్రభుత్వానికి ఇది ఎంతగానో ఉపకరిస్తుందని భావిస్తున్నారు.

డాలర్‌తోనే రూపాయికి కష్టాలు

ఆర్‌బీఐ జోక్యం మంచిది కాదు: రాజన్

దావోస్ (స్విట్జర్లాండ్): డాలర్ మారకం రేటు పుంజుకోవడం వల్లే.. మన రూపాయి మారకం రేటు క్షీణిస్తోందని ప్రముఖ ఆర్థికవేత్త, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలు డాలర్ మారకం రేటును మరింత పెంచుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రూపాయి మారకం రేటును నిలబెట్టేందుకు ఆర్‌బీఐ జోక్యం చేసుకోవడం ఏమాత్రం మంచిది కాదన్నారు. అలా చేస్తే మన ఎగుమతులూ దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డాలర్-రూపీ మారకం రేటులో మరీ తీవ్రమైన ఆటుపోట్లు ఏర్పడితే తప్ప ఆర్‌బీఐ జోక్యం చేసుకోవడం ఏమాత్రం మంచిది కాదని రాజన్ స్పష్టం చేశారు.



బడ్జెట్‌లో సామాన్య ప్రజానీకంపై దృష్టి పెట్టండి

రాజకీయంగా పటిష్ఠ స్థితిలో ఉన్న కేంద్రంలోని ఎన్‌డీఏ 3.0 ప్రభుత్వం రాబోయే కేంద్ర బడ్జెట్లో వృద్ధిని, ఉపాధి కల్పనను ఉత్తేజితం చేయగల, సంక్లిష్టమైన సంస్థాగత సంస్కరణలకు నడుం బిగించాలని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు సూచించారు. ఆర్థిక వ్యవస్థను సుస్థిర వృద్ధి బాటలో నడపడమే బడ్జెట్ ప్రాథమిక లక్ష్యం కావాలన్నారు. కేవలం వృద్ధిని పెంచితే చాలదని, సమాజంలో అసమానతలు తగ్గించాలన్నారు. ప్రధానంగా దేశ జనాభాలో దిగువ అర్ధభాగం భారీ వినియోగ శక్తి వృద్ధికి చోదకంగా ఉంటుందని చెప్పారు. వారు మరింతగా సంపాదించినట్టయితే మరింతగా వ్యయం చేస్తారని, ఫలితంగా ఉత్పత్తి పెరిగి మరిన్ని ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని సుబ్బారావు చెప్పారు.

- ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.103 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం లాభం రూ.300 కోట్లతో పోలిస్తే 64 శాతం క్షీణించింది. త్రైమాసిక కాలంలో మొత్తం ఆదాయం రూ.1,655 కోట్ల నుంచి రూ.1,763 కోట్లకు పెరిగింది. మొండి పద్దుల కోసం చేసిన కేటాయింపులు పెరగటం బ్యాంక్ పనితీరుపై ప్రభావం చూపించింది. ఈ కాలంలో బ్యాంక్ వడ్డీ ఆదాయం కూడా రూ.1,471 కోట్ల నుంచి రూ.1,591 కోట్లకు చేరుకుంది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఎస్‌హెచ్‌సీ ఫుడ్స్ రూ.73.52 కోట్ల రెవెన్యూపై రూ.2.08 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 58 శాతం, లాభం 384 శాతం వృద్ధి చెందింది. కాగా హెల్త్, వెల్‌నెస్ బ్రాండ్ బైసెప్స్ మాతృ సంస్థ ఇన్వెల్కో సైన్స్‌లో పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది.

నష్టాల్లో నుంచి లాభాల్లోకి..

ముంబై: ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాలతో స్టాక్ మార్కెట్ రెండో రోజు కూడా లాభపడింది. ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ కమోడిటీ స్టాక్‌లలో కొనుగోళ్లు మార్కెట్‌కు మద్దతు ఇచ్చాయి. అయితే స్థూలంగా మార్కెట్ ఆటుపోట్లతో ట్రేడయింది. ఆరంభంలో 202 పాయింట్ల నష్టంతో ప్రారంభమైన సెన్సెక్స్ తదుపరి దశలో లాభాల బాట పట్టింది. ఇంట్రాడేలో 338.55 పాయింట్ల మేరకు లాభపడిన సెన్సెక్స్ చివరికి ఆ లాభాన్ని 115.39 పాయింట్లకు పరిమితం చేసుకుని 76,520.38 వద్ద స్థిరపడింది. మరోవైపు ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 పాయింట్ల లాభంతో 23,205.35 వద్ద ముగిసింది. కాగా గురువారం నాడు డాలర్ మారకంలో రూపాయి 9 పైసలు క్షీణించి 86.44 వద్ద ముగిసింది.

జడ్చర్లలో డెయిరీ ప్రాసెసింగ్ ప్లాంట్

రూ.20 కోట్లతో ఏర్పాటు: అక్షయకల్ప ఆర్గానిక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆర్గానిక్ డెయిరీ ఉత్పత్తుల సంస్థ అక్షయకల్ప ఆర్గానిక్.. హైదరాబాద్‌లో తన కార్యకలాపాలను మరింత పటిష్ఠం చేస్తోంది. ఇందులో భాగంగా జడ్చర్లలో రూ.20 కోట్ల పెట్టుబడితో ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు శశి కుమార్ తెలిపారు. హైదరాబాద్ మార్కెట్లో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఈ ప్లాంట్‌ను రోజుకు 40 వేల లీటర్ల ప్రాసెసింగ్ సామర్థ్యంతో నెలకొల్పుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్లాంట్‌లో మొత్తం 8 రకాలైన ఉత్పత్తులను తయారు చేయనున్నట్లు ఆయన చెప్పారు. 2019లో తెలంగాణ మార్కెట్లోకి అడుగుపెట్టామని, ప్రస్తుతం 65 మందికి పైగా రైతులతో కలిసి పనిచేస్తుండగా దీన్ని 385 మందికి పెంచుకోవాలని చూస్తున్నట్లు శశి తెలిపారు.

జడ్చర్ల ప్లాంట్ ఈ ఏడాది అక్టోబరు నాటికల్లా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుందని తెలిపారు. జడ్చర్లతో పాటు కంపెనీ ఇప్పటికే కర్ణాటకలోని తిప్టూర్, తమిళనాడులోని చెంగల్పట్టులో రెండు యూనిట్లను నిర్వహిస్తోందని తెలిపారు. పూర్తిగా ఆర్గానిక్ విధానంలో రైతుల నుంచి పాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. కాగా బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ మార్కెట్లలో ఇప్పటి వరకు ఆవు పాలను మాత్రమే విక్రయిస్తున్న అక్షయకల్ప అక్టోబరు నుంచి గేదె పాలను అందుబాటులోకి తీసుకురానుందని తెలిపారు. కంపెనీ ఇప్పటి వరకు రూ.200 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టిందన్నారు.

స్పోర్ట్స్

నేడు పురుషుల సెమీస్	జొకోవిచ్ X జ్వెరెవ్ (ఉ.9) సిన్నర్ X షెల్టన్ (మ.2)	సోనీ లివ్‌లో..

అర్జున్‌ను వెనక్కినెట్టిన గుకేష్

ఫిడే ర్యాంకింగ్స్




న్యూఢిల్లీ: సూపర్ ఫామ్‌లో ఉన్న వరల్డ్ చాంపియన్ గుకేష్.. ఫిడే ర్యాంకింగ్స్‌లో అర్జున్ ఇరిగేసిని వెనక్కు నెట్టాడు. 2784 ర్యాంకింగ్ పాయింట్లతో గుకేష్ నాలుగో ర్యాంక్‌లో నిలవగా.. కొన్ని నెలలుగా భారత టాప్ ప్లేయర్‌గా కొనసాగుతున్న అర్జున్ (2779.5 పాయింట్లు) ఐదో స్థానానికి పడిపోయాడు. ఇటీవలి కాలంలో ఇరిగేసి వరుసగా విఫలమవుతుండడం అతడి ర్యాంక్‌పై ప్రభావం చూపింది. నార్వే దిగ్గజం కార్ల్‌సన్ టాప్‌లో కొనసాగుతుండగా.. హికరు నకమురు, ఫాబియానో కరువానా తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

భారత్ పోరు ముగిసింది

లక్ష్య, సాత్విక్ జోడీ ఓటమి — ఇండోనేసియా మాస్టర్స్

జకార్తా: ఇండోనేసియా మాస్టర్స్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ పోరాటం ముగిసింది. గురువారం జరిగిన రెండో రౌండ్‌లో లక్ష్యసేన్ 16-21, 21-12, 21-23తో నిషిమోటో (జపాన్) చేతిలో పోరాడి ఓడాడు. పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో సాత్విక్/చిరాగ్ ద్వయం కూడా 20-22, 21-23తో థాయ్‌లాండ్ జంట కెడ్రెన్/ఫువారన్ చేతిలో పోరాడి ఓడింది. అంతకుముందు మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్/తనీషపై 18-21, 21-15, 21-19తో పాంగ్ రాన్/సు యిన్ (మలేసియా) జోడీ గెలుపొందింది. మహిళల డబుల్స్‌లో అశ్విని/తనీష జంట 21-13, 22-24, 18-21తో కీ గే/మీ జింగ్ (మలేసియా) చేతిలో పరాజయం పాలైంది.



14,505 బంతులతో
ఎంసీఏ గిన్నిస్ రికార్డు

ముంబై: ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) అరుదైన ఘనత సాధించింది. 'క్రికెట్ బంతులతో కూడిన అతిపెద్ద వాక్యం' పేరిట గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సాధించింది. స్థానిక వాంఖడే స్టేడియం 50 ఏళ్ల సంబరాలను ఇటీవల ఎంసీఏ ఘనంగా నిర్వహించింది. దీంట్లో భాగంగానే 14,505 బంతులను ఉపయోగిస్తూ 'ఫిఫ్టీ ఇయర్స్ ఆఫ్ వాంఖడే స్టేడియం' అని ఇంగ్లీషులో రాయడంతో రికార్డుల కెక్కింది.



సబలెంక

ఆఖర్లో తప్పిదం!

- స్వియటెక్ భారీ మూల్యం
- సెమీస్‌లో పరాజయం ● కీస్ విజయం
- ఫైనల్లో సబలెంకతో అమీతుమీ



ఆస్ట్రేలియన్ ఓపెన్

కీస్



స్వియటెక్

మెల్‌బోర్న్: పాపం..స్వియటెక్..23 ఏళ్ల ఈ పోలెండ్ భామ ఈసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. సెమీఫైనల్ చేరే క్రమంలో ఒక్కటంటే ఒక్క సెట్టు కూడా చేజార్చుకోకుండా ఆడింది. అన్ని మ్యాచ్‌లనూ వరుస సెట్ల విజయాలతో ముగించింది. దాంతో..ఈ రెండో సీడ్ క్రీడాకారిణి తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ గెలుచుకోవడం ఖాయమే అనిపించింది. కానీ 19వ సీడ్ అమెరికన్ మాడిసన్ కీస్..స్వియటెక్ కలలను కల్లలు చేసింది. మూడు సెట్ల హోరాహోరీ సెమీఫైనల్లో ఐదు గ్రాండ్‌స్లామ్‌ల చాంపియన్ స్వియటెక్‌కు షాకిచ్చింది. అయితే మూడో సెట్‌లో..మ్యాచ్ పాయింట్‌పై నిలిచిన స్వియటెక్ బ్యాక్‌హ్యాండ్ షాట్‌ను సరిగా కొట్టలేకపోవడంతో మూల్యం చెల్లించుకుంది. ఇక..డిఫెండింగ్ చాంపియన్ అర్యానా సబలెంక వరుసగా మూడోసారి మెల్‌బోర్న్ పార్క్ విజేతగా నిలిచేందుకు కేవలం ఒక్క మ్యాచ్ దూరంలో నిలిచింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో కీస్ 5-7, 6-1, 7-6 (8) స్వియటెక్‌కు షాకిచ్చింది.. మరో సెమీస్‌లో టాప్ సీడ్ సబలెంక (బెలారస్) 6-4, 6-2తో 11వ సీడ్ పౌలా బడోసా (స్పెయిన్)పై సునాయాసంగా గెలిచింది. శనివారం జరిగే ఫైనల్లో కీస్‌తో సబలెంక తలపడనుంది.

ఉత్కంఠను అదిమిపట్టి..

స్వియటెక్-కీస్ నడుమ సెమీఫైనల్ రెండున్నర గంటలపాటు అభిమానులకు మజా పంచింది. హోరాహోరీగా సాగిన తొలి సెట్‌లో 6-5 వద్ద ఉత్కంఠ తీవ్ర స్థాయికి చేరిన వేళ..కీస్ సర్వీస్‌ను నాలుగోసారి బ్రేక్ చేసిన ఇగా సెట్‌ను సొంతం చేసుకుంది. అయితే రెండో సెట్‌లో జూలు విదిలిచ్చిన కీస్ ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగు సార్లు బ్రేక్ చేసి..అలవోకగా సెట్ నెగ్గింది. ఇక నిర్ణాయక మూడో సెట్‌లో స్వియటెక్, కీస్ నువ్వా..నేనా..అనే రీతిలో పోరాడారు. 6-5తో స్వియటెక్ తన సర్వీస్‌తో మ్యాచ్ పాయింట్‌పై నిలిచింది. కానీ వరుస తప్పిదాలతో గేమ్‌ను చేజార్చుకుంది. ఫలితంగా టై బ్రేకర్ అనివార్యమైంది. టైబ్రేకర్‌లో స్కోరు 8-8తో సమమైన వేళ ఒత్తిడిని అదిమిపట్టిన కీస్‌ను విజయం వరించింది. ఇక..బడోసాతో మరో సెమీస్‌లో వరల్డ్ నెం.1 సబలెంకకు ఎదురే లేకపోయింది. కేవలం గంటన్నరలోపే ముగిసిన మ్యాచ్‌లో బడోసా మొదటి సెట్‌లో ఒకింత సబలెంకను ప్రతిఘటించింది. కానీ రెండోసెట్‌లో బడోసా పూర్తిగా తేలిపోయింది.

చెలరేగిన త్రిష

శ్రీలంకపై గెలుపు — అండర్-19 మహిళల టీ20 వరల్డ్‌కప్

కౌలాలంపూర్: అండర్-19 టీ20 వరల్డ్‌కప్‌లో భారత అమ్మాయిలు హ్యాట్రిక్ విజయాన్నందుకున్నారు. అలాగే గ్రూప్ 'ఎ'లో టాపర్‌గా ఆరు పాయింట్లతో సూపర్ సిక్స్ బరిలో నిలిచారు. 2,3 స్థానాల్లో నిలిచిన శ్రీలంక, వెస్టిండీస్ జట్లు కూడా తర్వాతి రౌండ్‌కు చేరుకున్నాయి. గురువారం శ్రీలంకతో జరిగిన ఈ ఆఖరి గ్రూప్ మ్యాచ్‌లో ఇద్దరు తెలుగు క్రికెటర్లు రాణించడం విశేషం. బ్యాటింగ్‌లో గొంగడి త్రిష (44 బంతుల్లో 49) అండగా నిలవగా, బౌలింగ్‌లో షబ్నం (2/9) ప్రత్యర్థిని కట్టడి చేసింది. దీంతో భారత్ 60 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 118 పరుగులు చేసింది. లంక బౌలర్ల ధాటికి ఓవైపు వేగంగా వికెట్లు పడుతున్నా త్రిష నిలకడగా రాణించడంతో జట్టు స్కోరు వంద దాటగలిగింది. ప్రముది, లిమన్స అసెనిలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత స్వల్ప ఛేదనలో శ్రీలంక 20 ఓవర్లలో 9 వికెట్లకు 58 రన్స్‌కే పరిమితమైంది. వీరి ఇన్నింగ్స్‌లో రష్మిక (15) మాత్రమే రెండంకెల స్కోరు సాధించింది. షబ్నంతోపాటు జోషిత, పరుణికలకు రెండేసి వికెట్లు లభించగా, స్పిన్నర్ వైష్ణవి (4-1-3-1) పొదుపుగా బౌలింగ్ చేసింది.

విండీస్ సైతం: గ్రూప్ 'ఎ' నుంచి మూడో జట్టుగా వెస్టిండీస్ సూపర్ సిక్స్‌లో అడుగుపెట్టింది. గురువారం ఈ జట్టు మలేసియాపై 53 పరుగుల తేడాతో నెగ్గింది.




స్టార్ బ్యాటర్లు మళ్లీ ఢమాల్!

- తుస్సుమన్న రోహిత్, పంత్, గిల్
- జడేజాకు 5 వికెట్లు

● రంజీ ట్రోఫీ



రోహిత్ (3)



గిల్ (4)

ముంబై: ఫామ్ కోసం రంజీ బాట పట్టిన టీమిండియా బ్యాటర్లు రోహిత్ శర్మ, రిషభ్ పంత్, శుభ్‌మన్ గిల్ మళ్లీ విఫలమయ్యారు. వివిధ వేదికల్లో గురువారం మొదలైన మ్యాచ్‌ల్లో వీరు పరుగుల వరద పారిస్తారనుకొంటే.. దేశవాళీ బౌలర్లను కూడా ఎదుర్కోలేక సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరారు. వెటరన్ ఆల్‌రౌండర్ జడేజా ఐదు వికెట్లతో రాణించాడు.

19 బంతులే ఆడి..: ఆస్ట్రేలియా టూర్‌లో అట్టర్ ఫ్లాపైన రోహిత్.. భారీ ఇన్నింగ్స్ ఆడతాడని అందరూ భావించారు. కానీ, ఓపెనర్‌గా 19 బంతులే ఆడిన రోహిత్ (3) ఉమర్ నజీర్ బౌలింగ్‌లో క్యాచవుట్ అయ్యాడు. అతడికి జోడీగా దిగిన యశస్వీ జైస్వాల్ (4) కూడా సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరాడు. శ్రేయాస్ అయ్యర్ (11), శివమ్ దూబే (0) కూడా నిరాశ పర్చడంతో.. తొలి ఇన్నింగ్స్‌లో ముంబై 33.2 ఓవర్లలో 120 పరుగులకే కుప్పకూలింది. శార్దూల్ ఠాకూర్ (51) మాత్రమే అర్ధ శతకం సాధించాడు. అనంతరం జమ్మూ కశ్మీర్ మొదటి రోజు ఆట ఆఖరుకు 174/7 స్కోరు చేసింది.

జడేజా బంతితో..: ఢిల్లీతో మ్యాచ్‌లో సౌరాష్ట్ర తరఫున జడేజా ఐదు వికెట్లతో సత్తాచాటాడు. అయితే రిషభ్ పంత్ (1) పది బంతులాడి క్యాచవుటయ్యాడు. దీంతో ఢిల్లీ తొలి ఇన్నింగ్స్‌లో 188 పరుగులకు ఆలౌటైంది. ఆ తర్వాత సౌరాష్ట్ర ఆట ఆఖరుకు 163/5 స్కోరు చేసింది. జడేజా (38) ధాటిగా ఆడే ప్రయత్నంలో అవుటయ్యాడు.

మెరవని గిల్..: బెంగళూరులో కర్ణాటకతో మొదలైన మ్యాచ్‌లో పంజాబ్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (4) స్వల్ప స్కోరుకే అవుటయ్యాడు. దీంతో పంజాబ్ తొలి ఇన్నింగ్స్‌లో 55 పరుగులకే కుప్పకూలింది. అనంతరం కర్ణాటక తొలి రోజు ఆట చివరికి 199/4 స్కోరు చేసింది.

రోహిత్‌కు గాయమా?

సుదీర్ఘ విరామం తర్వాత రంజీ మ్యాచ్ ఆడిన రోహిత్ సింగిల్ డిజిట్‌కే వెనుదిరిగాడు. పెవిలియన్ చేరిన అతడు మళ్లీ ఫీల్డింగ్‌కు రాలేదు. దీంతో రోహిత్ ఫిట్‌నె‌స్‌పై సందేహాలు తలెత్తుతున్నాయి. ఒకవేళ హిట్‌మ్యాన్ గాయపడితే భారత జట్టుకు గట్టిదెబ్బగానే భావించాలి.

10వ తరగతి కుర్రాడు గంగూలీ రికార్డు బద్దలుకొట్టాడు..

బెంగాల్ తరఫున రంజీలు ఆడిన పిన్నవయసు క్రికెటర్‌గా సౌరవ్ గంగూలీ రికార్డును 10వ తరగతి విద్యార్థి అంకిత్ చటర్జీ బద్దలుకొట్టాడు. 1989-90 సీజన్‌లో 17 ఏళ్ల వయసులో గంగూలీ రంజీల్లో అరంగేట్రం చేశాడు. కాగా, హరియాణాతో నేటి మ్యాచ్‌లో 15 ఏళ్ల ఛటర్జీ బరిలోకి దిగాడు.

రషీద్ శతకం

ఆంధ్ర 245/7

పుదుచ్చేరి: షేక్ రషీద్ (105) సెంచరీతో రాణించినా.. మిగతా బ్యాటర్ల వైఫల్యంతో ఆంధ్ర భారీ స్కోరు చేసే అవకాశాన్ని చేజార్చుకొంది. గ్రూప్-బిలో పుదుచ్చేరితో గురువారం ఆరంభమైన రంజీ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 245/7 స్కోరు చేసింది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి శశికాంత్ (57), పృథ్వీ రాజ్ (6) క్రీజులో ఉన్నారు. హనుమ విహారి (6), రికీ భుయ్ (4), కేఎస్ భరత్ (19) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరారు. మాథ్యూ, అంకిత్ చెరో 3 వికెట్లు పడగొట్టారు.

'చాంపియన్స్ ట్రోఫీ'కి భారీ భద్రత

లాహోర్: వచ్చే నెలలో జరిగే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ కనీవినీ ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. 1996 వన్డే వరల్డ్‌కప్ తర్వాత ఇక్కడ జరుగుతున్న ప్రధాన టోర్నమెంట్ ఇదే కావడం గమనార్హం. అందుకే ఆటగాళ్ల, స్టేడియాల భద్రత కోసం 12,564 మంది సిబ్బందిని మోహరించబోతోంది. ఇందులో లాహోర్‌లో 7618 మంది, రావల్పిండిలో 4535 మంది పోలీసులు భద్రతను పర్యవేక్షిస్తారని పాక్ మీడియా కథనం. అలాగే స్పెషల్ బ్రాంచికి చెందిన 411 మంది అధికారులు పరిస్థితులను సమన్వయం చేసే పనిలో ఉంటారు. అవసరమైతే పాక్ సైన్యం సహాయం కూడా తీసుకుంటారు.

విశేషం



వ్యాసుల తరువాత దాసులే...

మహో భక్తుడుగా, సంకీర్తనా చార్యుడిగా అద్వితీయమైన స్థానాన్ని పొందిన మహనీయుడు శ్రీ పురందరదాసు. వేదాలు, పురాణాలు, ఉపనిషత్తుల సారాంశాన్ని సాధారణ ప్రజలకు అర్థం అయ్యేలా ... సరళమైన కన్నడ భాషలో ఆయన అందించాడు. పురందరదాసు రచన... అద్భుతమైన సంగీతం, సరళమైన సాహిత్యం, ఆధ్యాత్మిక జ్ఞానాల అపూర్వ సంగమం. భౌతికమైన సంపదలకన్నా భక్తి తత్పరత, జ్ఞానం గొప్పవని బోధించిన ఆయన జననం... దైవ సంకల్పం.

భగవంతుడి ఆజ్ఞ మేరకు... నారదుడు తాను రచించిన భక్తి సూత్రాలను ఆచరణలోకి తేవడానికి.... శ్రీనివాసనాయకుడుగా ఈ భూమి మీద అవతరించాడు. ధన సంపాదనే ధ్యేయంగా, లోభిత్వంతో... నవకోటి నారాయణుడిగా కోట్లకు పడగలెత్తిన శ్రీనివాస నాయకుడు.... ఒక చిన్న ఘటనతో భక్తి, జ్ఞాన, వైరాగ్యాలే అసలైన సిరిసంపదలని సమాజానికి తెలియజేసే పురందరదాసుగా మారాడు. జగన్నాటక సూత్రధారి అయిన శ్రీహరి... స్వయంగా బ్రాహ్మణ రూపంలో వచ్చినా, ఆయనను సామాన్య యాచకుడిగా భావించి, ఆరు నెలలపాటు వాకిలిలో నిలబెట్టాడు శ్రీనివాసనాయకుడు. ఆ తరువాత తన తప్పును తెలుసుకొని, విరక్త శిఖామణిగా మారాడు. శ్రీవ్యాసరాయల నుంచి సకల శాస్త్రార్థ ఉపదేశాలను పొందాడు, భక్తితో పాడి శ్రీకృష్ణునితో నాట్యం చేయించాడు.

ఎవరి భాగ్యం గొప్పది?

కర్ణాటక శాస్త్రీయ సంగీత పితామహుడు అనిపించుకున్న పురందరదాసుకు, విజయనగర సామ్రాజ్యానికి ఎనలేని అనుబంధం. ఆయన కాలంలో శ్రీకృష్ణదేవరాయలు విజయనగర చక్రవర్తిగా పాలన సాగించేవాడు. తన రాజ్యంలో పేరుమోసిన వ్యాపారి ఒకరు... రాత్రికి రాత్రి సర్వస్వాన్ని దానం చేసి, హరిదాసుగా మారాడనీ, ఎన్నో దివ్యమైన తత్త్వాలు ఉపదేశిస్తున్నాడని, మహిమాన్వితుడని రాయలు విన్నాడు. ఆయనను స్వయంగా చూడాలని వ్యాసరాయల మఠానికి వచ్చాడు. వ్యాసరాయలు... పురందర, కనకదాసులతో భజనలో ఉన్నారు. రాయలు దేవాలయ మండపంలో కూర్చున్నాడు. పూజలో, భజనలో లీనమై, భావసమాధిలో మునిగిపోయిన వారు అతని రాకను గమనించలేదు. ఆ తాదాత్మ్యత నుంచి బయటకు వచ్చిన తరువాత... రాయలను కుశల ప్రశ్నలు వేశారు. తన సుకృతం వల్ల యతులను, హరిదాసులను చూసే భాగ్యం కలిగిందని, పురందరదాసు వృత్తాంతం విని వచ్చానని రాయలు తెలిపాడు. తరువాత పురందరదాసును తనతోపాటు ఏకాంతానికి తీసుకువెళ్ళి, ఆయన అనుభవాలన్నీ విన్న రాయలు భక్తితో, ఆనందంతో పరవశుడయ్యాడు. అప్పుడు పురందరదాసు వైరాగ్యాన్ని వినోదంతో మిశ్రమం చేసి... 'నిమ్మ భాగ్య దొడ్డదో, నమ్మ భాగ్య దొడ్డదో' (మీ భాగ్యం గొప్పదా? మా భాగ్యం గొప్పదా?) అంటూ భగవన్నామ సంకీర్తన చేశాడు. "రాజ్య సంపదకు చోరులు, శత్రువుల భయం ఉంటుందేమో కానీ... మా రామ నామ సంపదకు ఎలాంటి భయం లేదు. ధాన్యం, బెల్లం, నెయ్యి లాంటి సరుకులు చెడిపోతాయేమోననే చింత ఉండవచ్చు, 'హరినామామృతం' అనే సరుకు విషయంలో ఏ చింతా ఉండదు. మీ భాగ్యం లక్ష్మీదేవి అయితే... మా భాగ్యం నారాయణుడు. మన అందరి బాగ్యం పురందర విఠలుడు" అని పాడాడు. రాయలు పరమానందం చెంది... పురందరదాసును సత్కరించాడు. రాయలు ఇచ్చిన ఆభరణాలను, వస్త్రాలను, కానుకలను పేదలకు పురందరదాసు దానం ఇచ్చాడు. ఇది తెలుసుకున్న శ్రీకృష్ణదేవరాయలు బాధ పడగా... "కృష్ణరాయా! వాటిని నేను అలంకరించుకుంటే హరికి ప్రీతిపాత్రం కాదు. అందుకే వాటిని ఆ హరికే సమర్పించాను" అని వివరించాడు. దీనితో రాయలుకు పురందరదాసు మీద గౌరవం మరింత పెరిగింది.

అంతటా నెలకొన్న దేవుడొక్కడే...

'మానవ జన్మ దొడ్డదో' అనే కృతిలో మానవజన్మ విశిష్టతను అందరూ తెలుసుకోవాలనీ, దాన్ని వృథా చేసుకోవద్దనీ పురందరదాసు హెచ్చరిస్తారు. ఆయన కీర్తనలలో వైవిధ్యం ఊహాతీతం. భక్తి, విరక్తి, లాలిపాటలు, దేవతా/ క్షేత్ర వర్ణన, వ్యాపారం, సామాజిక బాధ్యత, విమర్శ.. ఇలా అన్ని అంశాల గురించీ ఆయన కీర్తనలు ఉంటాయి. ఒకసారి కొంతమంది ముస్లిం యువకులు ఆయనను ఉరుసుకు ఆహ్వానించి దేవునిమీద పాట పాడమని కోరినప్పుడు... అంతటా నెలకొని ఉన్న దేవుడు ఒకడే అంటూ 'క్లాహూస్సేన్ బాహూస్సేన్ ' అనే కీర్తనలో దశావతార స్తుతి చేసి, అక్కడ ఉన్న ముస్లింల మనసును గెలిచారు. పరమత సహనం ఆవశ్యకతను తెలియజేశారు. పురందరదాసు రచించిన కృతుల గొప్పదనం ఎంతటిదంటే 'వ్యాసుల (వ్యాసభగవానులు) తరువాత దాసులే' అని ఆయన ప్రసిద్ధి చెందారు. వ్యాసరాయలవారు... శ్రీమధ్వాచార్యుల సర్వమూల గ్రంథాలతోపాటు... పురందరదాసు కృతులను వ్యాసపీఠం మీద ఉంచి... రెండిటికీ సమానమైన గౌరవం ఇచ్చేవారు. ఆయన సాహిత్య ఔన్నత్యానికి ఇది నిదర్శనం.

కర్ణాటక సంగీతానికి పునాది

సాక్షాత్తూ నారదుడే పురందరదాసు అయినందున ఆయన సంగీత స్థాయి అనుపమానంగా ఉంటుంది. ఆ కాలంలో కర్ణాటక శాస్త్రీయ సంగీతంలో శిక్షణ పొందే విద్యార్థులకు వ్యవస్థీకృతమైన పద్ధతి ఉండేది కాదు. పదిహేనవ మేళకర్త రాగమైన మాయామాళవగౌళ రాగాన్ని... ఆదిరాగంగా చేసుకొని, సంగీత శిక్షణ కోసం దాన్ని సిద్ధపరిచారు. విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా... మలహరి రాగంలో పిళ్ళారి గీతాలు రచించారు. ఈ విధంగా కర్ణాటక సంగీతానికి భద్రమైన పునాది వేసి, దాని మీద సుస్థిరమైన కట్టడాన్ని పురందరదాసు నిర్మించారు. ప్రతి సంవత్సరం పుష్యమాస అమావాస్యనాడు వచ్చే వారి పుణ్యతిథిని సద్భక్తులందరూ అత్యంత వైభవంగా జరుపుకొని పునీతులవుతారు. దాసశ్రేష్ఠుడైన పురందరదాసు నామస్మరణతో అభీష్టాలు నెరవేరుతాయనేది భక్తుల విశ్వాసం.

• మధ్వ ప్రచార పరిషత్, 9440258841

ఆత్మ స్వాతంత్ర్యం కోసం పోరాడాలి

సహజయోగ

భారత దేశం సర్వసత్తాక గణతంత్ర రాజ్యంగా అవతరించిన రోజు జనవరి 26. దీని వెనుక ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల అవిరళ కృషి ఉంది. అటువంటివారిలో మాతాజీ నిర్మలాదేవి ఒకరు. ఆమె కుటుంబం మొత్తం స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంది. నిర్మలాదేవి తండ్రి ప్రసాదరావు సాల్వే అప్పటి రాజ్యాంగ రచనా కార్యంలో చురుగ్గా పాలు పంచుకున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత... పార్లమెంట్ సభ్యునిగా సేవలు అందించారు.

జైల్లో చిత్రహింసలు...

నిర్మలాదేవి బాల్యంలో మహాత్మాగాంధీ ఆశ్రమంలో ఉండేవారు. ఆమెకు నేపాలీల్లా చిన్ని చిన్ని కళ్ళు ఉండడంతో... గాంధీ మహాత్ముడు ఆమెను ముద్దుగా 'నేపాలీ' అని పిలిచేవారు. ఆశ్రమంలో పాడుకొనే ప్రార్థనా గీతాలను 'భజనావళి' పేరిట ఒక పుస్తకంగా ఆయన రూపొందించారు. ఆ సమయంలో... నిర్మల సలహా ప్రకారం... ఆ గీతాలను మన సూక్ష్మ శరీరంలోని చక్రాలు ఏ క్రమంలో ఉంటాయో... అదే క్రమంలో పొందుపరిచారు. చిన్నారి నిర్మలతో ఆయన అనేక విషయాలు చర్చించడం చూసి మిగిలినవారు ఆశ్చర్యపోయేవారు. అప్పుడు గాంధీ మహాత్ముడు "ఒక్కొక్కసారి పెద్దవారి కన్నా చిన్న పిల్లల నుంచే సరైన మార్గదర్శకత్వం లభిస్తుంది అనేవారు. అలాంటి గొప్ప నాయకుల మధ్య పెరిగిన నిర్మల... వారి అడుగుజాడల్లో నడిచారు. ఆమె తండ్రి ప్రసాదరావు ఆ రోజుల్లో నాగపూర్‌లో పేరు ప్రఖ్యాతులున్న మేజిస్ట్రేట్. ఖుర్‌ఆన్‌ను మరాఠీ భాషలో అనువదించిన పండితుడు. పెద్ద బంగళాలలో నివసించే వారి కుటుంబం స్వాతంత్ర్యోద్యమంలో ఆస్తులన్నీ త్యాగం చేయడం వల్ల... పూరిళ్ళలో నివసించాల్సి వచ్చింది. తల్లితండ్రులిద్దరూ జైలుకు వెళితే... ఇంటి బాధ్యతలను నిర్మల స్వీకరించారు. ఆమె లాహోర్ మెడికల్ కాలేజీలో చదువుతున్నప్పుడు... క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా... కాలేజీ మీద భారత జెండాను ఎగురవేశారు. దీనితో కాలేజీ నుంచి ఆమెను బహిష్కరించారు. నాగపూర్‌లో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ధర్నా చేసి అరెస్టయ్యారు. జైలులో ఆమెను అక్కడి అధికారులు చిత్రహించలు పెట్టారు. విద్యుత్ షాక్ ఇచ్చారు, మంచు గడ్డల మీద పడుకోబెట్టారు. అయినా ఆమె ఉద్యమాన్ని విడిచి పెట్టలేదు. గ్రామ గ్రామానికీ తిరిగి రహస్యంగా కరపత్రాలు పంచిపెట్టేవారు. గ్రామీణ ప్రజలను స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనేలా చైతన్యపరిచేవారు.



ఆధ్యాత్మికతకు అనుకూలం

ఆ తరువాత సహజయోగ ధ్యానపద్ధతిని ప్రవేశపెట్టారు. మానవులలో కుండలినీ శక్తిని జాగృతం చేసి, ఆత్మ సాక్షాత్కారాన్ని ప్రసాదించడానికి అనేక దేశాల్లో పర్యటించారు. ఎక్కడికి వెళ్ళినా మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనం గురించి చెప్పేవారు. "యోగాకు పుట్టినిల్లు మన భారతావని. ఎందరో మహనీయులు నడయాడిన నేల మనది. ఇక్కడ ఎన్నో భాషలు, మతాలు, కులాలు, ప్రాంతాలు, వృత్తులు ఉన్నా... ప్రతి ఒక్కరూ తమ జీవిత చరమాంకంలో భగవంతుణ్ణి చేరుకోవాలనే అభిలషిస్తారు. మన దేశ ఆధ్యాత్మికతకు అనుకూలమైనది. అలాగే భారతీయ సంగీతం ఆధ్యాత్మికపరంగా ప్రశస్తమైనది. హిందుస్తానీ సంగీతమైనా, కర్ణాటక సంగీతమైనా... వాటిలోని రాగాలు మన సూక్ష్మశరీరంలో ఉండే వివిధ చక్రాలను లేదా శక్తి కేంద్రాలను చైతన్యతరంగాల ద్వారా శుద్ధి చేస్తాయి. కుండలినీ శక్తిని జాగృతం చేయడానికి భారతీయ సంగీతం కన్నా అనుకూలమైనది మరొకటి లేదు" అని నిర్మలాదేవి చెప్పారు. ఆమె దగ్గర సంగీత కచ్చేరీలు చేయడానికి వచ్చిన చాలామంది... కుండలినీ శక్తి జాగృతి చెందిన అనుభూతి పొంది... సహజయోగంలో స్థిరపడ్డారు.

అందరికీ ఆత్మసాక్షాత్కారమే లక్ష్యం

"మనల్ని సృష్టించిన పరమాత్మను ప్రస్తుతించడమే ఏ కళకైనా పరమావధి. మన ఆలయాలు అద్భుతమైన శిల్పకళకు నిలయాలు. మన నృత్య రీతులు... నాట్యం ద్వారా భగవంతుణ్ణి చేరుకోవడానికి రూపొందినవి. మన సాహిత్యంలో భక్తికి, కరుణరసానికి ప్రాధాన్యం ఎక్కువ ఇన్ని రకాలుగా ఆధ్యాత్మికతకు అనువైన ఈ దేశంలో జన్మించడానికి ఎంతో పుణ్యం చేసుకొని ఉండాలి" అని చెప్పేవారు నిర్మలాదేవి. "ఆ రోజుల్లో మేము దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడాం. ఇప్పుడు మీరు మీ ఆత్మ స్వాతంత్ర్యం కోసం పోరాడాలి. మీ ఆత్మను అరిషడ్వర్గాలు, అహంకార, ప్రత్యహంకారాలు ముక్తిని పొందకుండా నిరోధిస్తున్నాయి. వాటి బానిసత్వం నుంచి బయటకు రండి. విశ్వంలో ఉన్న మానవులందరూ తమలోని కుండలినీ శక్తిని జాగృతం చేసుకొని, సహజయోగం ద్వారా అంతిమ స్వాతంత్ర్యం అయిన ఆత్మ సాక్షాత్కారం పొందేలా చేయడమే నా లక్ష్యం. ఈ విషయంలో భారతీయులే మిగిలిన దేశాల ప్రజలను ముందుండి నడిపించాలి. యువత దేశభక్తిని పెంపొందించుకుంటేనే దేశం పురోగతి చెందుతుంది" అని ఆమె స్పష్టం చేశారు. దేశ విముక్తికోసం తమ సర్వస్వాన్ని నిస్వార్థంగా త్యాగం చేసి, గాంధీ మహాత్ముని అడుగుజాడల్లో పయనించిన మాతాజీ నిర్మలాదేవిని, ఆమె కుటుంబాన్ని గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్మరించుకోవడం సముచితం.

డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



'సాక్షి' ఉద్యోగులకు సర్కారు జీతాలు!

- సమాచార, పౌరసంబంధాలశాఖ నుంచి చెల్లించారు
- ప్రభుత్వ సొమ్మును ఆ పత్రికకు, చానల్‌కు దోచిపెట్టారు
- రూ.371 కోట్ల ప్రభుత్వ ప్రకటనలు ఒక్క 'సాక్షి'కే ఇచ్చారు
- లోతైన విచారణ తర్వాతే విజయ్‌కుమార్‌రెడ్డిపై ఏసీబీ కేసు
- ప్రాథమిక దశలో దర్యాప్తు.. బెయిల్ ఇస్తే సాక్షులపై ప్రభావం
- హైకోర్టులో ఏసీబీ తరపున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు
- ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయాలని అభ్యర్థన.. విచారణ 27కు వాయిదా

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ హోదాలో తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ సొమ్మును సాక్షిపత్రికకు, సాక్షి టీవీచానల్‌కు దోచిపెట్టారని అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు గురువారం ఆయన వాదనలు వినిపించారు. వైసీపీ ప్రభుత్వ హయాం మొత్తం రూ.859 కోట్ల ప్రభుత్వ ప్రకటన(యాడ్)లు ఇవ్వగా, అందులో ఒక్క 'సాక్షి'కే రూ.371 కోట్ల ప్రకటనలు ఇచ్చారని తెలిపారు. ప్రకటనలకు 'సాక్షి' యాజమాన్యం ప్రతిపాదించిన రేటుకు మించి అధిక మొత్తం చెల్లించారని, ప్రభుత్వ ఖజానాకు రూ.19 కోట్ల నష్టం కలిగించారన్నారు.ట రాష్ట్రంలో అధిక సర్క్యులేషన్ ఉన్న పత్రికకు 28శాతం ప్రకటనలు ఇస్తే, రెండో స్థానంలో ఉన్న 'సాక్షి' పత్రికకు 43శాతం, మూడవ స్థానంలో ఉన్న పత్రికకు 0.03 శాతం ప్రకటనలు ఇచ్చారని వివరించారు. ఇక ఏపీలో ఎడిషన్ కూడా ప్రచురించని ఓ పత్రికకు రూ 1.17కోట్లు చెల్లించారని తెలిపారు. అడ్వర్టైజ్‌మెంట్ ఏజెన్సీల నుంచి కమిషన్ తీసుకున్నారని, తద్వారా అనుచిత లబ్ధిపొందారని వివరించారు. ప్రభుత్వ ప్రకటనల జారీలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారన్నారు. చట్టనిబంధనలను అనుసరించకుండా మొత్తం 254 మంది అవుట్ సోర్సింగ్/ కాంట్రాక్ట్ ఉద్యోగులను నియమించారని, ఉద్యోగుల జాబితాను పిటిషనరే అందజేసి వారి నియామకానికి ఫైలు సిద్ధం చేయాలని తన కింది ఉద్యోగులకు ఆదేశాలు ఇచ్చినట్టు సాక్షులు వాంగ్మూలం ఇచ్చారని తెలిపారు. కొంతమంది 'సాక్షి' ఉద్యోగులకు ఎలాంటి నియామక ఉత్తర్వులూ లేకుండానే సమాచారశాఖ నుంచి జీతాలు చెల్లించారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తనపై ప్రతీకారం తీర్చుకుంటోందన్న పిటిషనర్ వాదనలో వాస్తవం లేదన్నారు. సమాచార కమిషనర్‌గా విజయ్‌కుమార్‌రెడ్డి అక్రమాలకు పాల్పడ్డారని థర్డ్ పార్టీ.. విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేశారని, దీనిపై విజిలెన్స్ విభాగం కూడా నివేదిక సమర్పించిందని, ఆ నివేదిక ఆధారంగానే ఏసీబీ అధికారులు లోతైన విచారణ జరిపి, అన్ని విషయాలు నిర్ధారించుకొన్న తర్వాతే విజయ్‌కుమార్ రెడ్డిపై కేసు నమోదు చేశారని తెలిపారు. విజయ్‌కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి కాదని, ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసు అధికారిగా ఉన్న ఆయనను డిప్యూటేషన్‌పై రాష్ట్రానికి తీసుకొచ్చారని చెప్పారు. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆయనను సమాచార పౌరసంబంధాలశాఖ కమిషనర్‌గా, సాధారణ పరిపాలనశాఖ ఎక్స్‌అఫీషియో కార్యదర్శిగా నియమించారని తెలిపారు. సమాచారశాఖ కమిషనర్ హోదాలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి, సాధారణ పరిపాలనశాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శిగా ఆ ప్రతిపాదనలకు ఆయనే ఆమోదం తెలుపుతూ ద్విపాత్రాభినయం చేశారని, ఆయనను రాష్ట్రానికి తీసుకురావడంలో కుట్ర ఉందా? అనే విషయం దర్యాప్తులో తేల్చాల్సి ఉందని పేర్కొన్నారు. పిటిషనర్ తప్పుచేశారనేందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని, ఆర్థిక నేరాలను తీవ్రంగా పరిగణించాలని సుప్రీంకోర్టు చెప్పిందని వివరించారు. దర్యాప్తు ప్రాథమిక దశలో ఉందని, విజయ్‌కుమార్ రెడ్డి కింద పనిచేసిన ఉద్యోగులనూ విచారించాల్సి ఉందని, ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని తెలిపారు. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. కాగా, గురువారం ఏసీబీ తరఫు వాదనలు ముగిశాయి. సాంకేతికపరమైన అంశాలపై కోర్టు లేవనెత్తిన సందేహాలపై స్పష్టత కోసం, పిటిషనర్ తరఫు రిప్లై వాదనల కోసం విచారణను న్యాయస్థానం ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఏపీ మీడియా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.దిల్లీబాబురెడ్డి ఫిర్యాదు మేరకు ప్రాథమిక విచారణ జరిపిన ఏసీబీ అధికారులు విజయ్‌కుమార్ రెడ్డిని ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. దీంతో ముందస్తు బెయిల్ కోసం విజయ్‌కుమార్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.



నారా లోకేశ్ ఫేస్ మాస్క్‌లు ధరించిన ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల గురుకుల పాఠశాల విద్యార్థినులతో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో 226 అడుగుల వెడల్పుతో మంత్రి లోకేశ్ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు, పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా లోకేశ్ జన్మదిన వేడుకలు

- రాష్ట్రవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో కేక్ కోసిన మంత్రి గొట్టిపాటి

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ పుట్టిన రోజు వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. టీడీపీ శ్రేణులు రక్తదాన శిబిరాలు నిర్వహించాయి. 7,332 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ కేక్ కోశారు. మండలి చీఫ్ విప్ అనురాధ, పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ టీడీపీ సాంస్కృతిక విభాగం రూపొందించిన ఎల్లో సింహం పాటను రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ఆవిష్కరించారు. విశాఖ పార్టీ కార్యాలయంలో ఎంపీ భరత్, కృష్ణా జిల్లా గుడివాడలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జంగారెడ్డిగూడెం హై స్కూల్లో విద్యార్థులు 'హ్యాపీ బర్త్‌డే లోకేశ్ సర్' అక్షరాల ఆకారంలో కూర్చుని జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలో సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్ విద్యార్థులు ముఖాలకు లోకేశ్ మాస్కులు ధరించి శుభాకాంక్షలు తెలిపారు. ద్వారకా తిరుమలలోని గురుకుల పాఠశాలలో 700 మంది విద్యార్థినులు లోకేశ్ మాస్కులతో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుతో సెల్ఫీ దిగారు. టీడీపీ నాలెడ్జ్ సెంటర్‌లో చైర్మన్ మాల్యాద్రి లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యే సురేంద్రబాబు ఆధ్వర్యంలో 2,500 మంది రక్తదానం చేశారు. వీరికి రూ.లక్ష ప్రమాద బీమా సదుపాయం కల్పించారు. 10 వేల మందికి చీరలు పంపిణీ చేశారు. విజయనగరం జిల్లా టీడీపీ కార్యాలయంలో 41 కిలోల కేక్ కట్ చేశారు. 27 మంది విభిన్న ప్రతిభావంతులను దత్తత తీసుకుని ఏడాదికయ్యే వ్యయాన్ని స్కూల్ యాజమాన్యానికి అందించారు. మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సింగరాయకొండలో కేక్ కోశారు. ప్రకాశం జిల్లా వైపాలెంలోని బాలికల వసతిగృహంలో టీడీపీ ఇన్‌చార్జీ గుడూరి ఎరిక్షన్‌బాబు విద్యార్థినులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. మరోవైపు టీడీపీ కేంద్ర కార్యాలయంలో సుభాశ్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలేసి మంత్రులు పార్టీ నేతలు నివాళులర్పించారు.



అమరావతిలో కేక్ కట్ చేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఆలపాటి రాజా, శ్రవణ్, అశోక్‌బాబు తదితరులు

129 మంది న్యాయవాదుల రక్తదానం

కోటికిపైగా టీడీపీ సభ్యత్వాల నమోదు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ జన్మదిన కానుకని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. హైకోర్టు వద్ద టీడీపీ లీగల్ సెల్ నిర్వహించిన రక్తదాన, వైద్య శిబిరాలను ఆయన సందర్శించారు. లీగల్ సెల్ అధ్యక్షుడు పోసాని వెంకటేశర్వర్లు, జనరల్ సెక్రెటరీ పారా కిషోర్‌తో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. 129 మంది న్యాయవాదులు రక్తదానం చేశారు. ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్, పీపీ లక్ష్మీనారాయణ, రవీంద్రబాబు, చుక్కపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చంద్రబాబు తరువాత లోకేశే: అచ్చెన్న

విశాఖపట్నం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): టీడీపీలో చంద్రబాబు తరువాత లోకేశేనని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. 'ఈ విషయం నేను కాదు, చిన్నపిల్లవాడిని అడిగినా చెబుతాడు' అన్నారు. ప్రభుత్వంలో పదవులను కూటమి నిర్ణయిస్తుందని తేల్చి చెప్పారు. గురువారం విశాఖపట్నంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. గత ప్రభుత్వం టీడీపీని భూస్థాపితం చేయాలని చూసిందని, అటువంటి సమయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా లోకేశ్ యువగళం పేరుతో రాష్ట్రమంతటా సుదీర్ఘ పాదయాత్ర చేశారని, 2024 ఎన్నికల్లో టీడీపీ అత్యధిక సీట్లు గెలుచుకోవడం వెనుక లోకేశ్ కృషి ఎంతో ఉందని అచ్చెన్న చెప్పారు.

తర్వాత సీఎం లోకేశే.. : బుద్దా

చంద్రబాబు తర్వాత టీడీపీకి దశదిశా లోకేశేనని, తర్వాత సీఎం కూడా ఆయనేనని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. విజయవాడలోని తన కార్యాలయంలో లోకేశ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.

కృష్ణపట్నంలో అనిల్ అంబానీ పర్యటన

- రిలయన్స్ గ్రూప్ భూముల పరిశీలన
- పరిశ్రమల ఏర్పాటుకేనని అంచనా

నెల్లూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీ గురువారం నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో తమ సంస్థకు గతంలో కేటాయించిన భూములను సందర్శించారు. ఆయనతోపాటు జేసీ కార్తీక్, ముత్తుకూరు మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. భూముల సందర్శన అనంతరం అనిల్ అంబానీ, రిలయన్స్ అధికారులతో పరిశ్రమల స్థాపనపై చర్చలు జరిపారని తెలిసింది. కృష్ణపట్నంలో 3,200 మెగావాట్ల సామర్థ్యంతో అల్ట్రా మెగా థర్మల్ విద్యుత్ కేంద్రం స్థాపన కోసం 2006లో ప్రభుత్వం 2,600 ఎకరాల భూమిని రిలయన్స్ అనుబంధ సంస్థ కోస్టల్ ఆంధ్ర పవర్ లిమిటెడ్‌కు కేటాయించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బొగ్గు ధర పెరిగిందనే కారణంతో పరిశ్రమ స్థాపనకు బ్రేక్ పడింది. 2019లో ఈ భూములను విక్రయించేందుకు రిలయన్స్ సంస్థ పత్రికల్లో ప్రకటనలు ఇచ్చింది. దీంతో ఆ భూములను వెనక్కి తీసుకోవడానికి ప్రభుత్వం రిలయన్స్ సంస్థకు నోటీసులిచ్చింది. వివాదం న్యాయస్థానానికి చేరింది. భూములను పరిశ్రమల స్థాపనకే ఉపయోగిస్తామని రిలయన్స్ కోర్టుకు విన్నవించడంతో భూములను ఆ సంస్థ పరిధిలో ఉంచడానికి 2019లో అంగీకారం కుదిరింది.

పరిశ్రమల కోసమే అనిల్ రాక!

కూటమి ప్రభుత్వ ఒత్తిడి మేరకు అనిల్ అంబానీ సంస్థ పరిశ్రమల స్థాపనకు సిద్ధమయ్యిందని తెలుస్తోంది. గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా లేదా సోలార్ విద్యుత్ పరికరాల తయారీ పరిశ్రమలు స్థాపించడంపై పరిశీలిస్తున్నారని అంటున్నారు. పరిశ్రమల స్థాపనకు సంబంధించి తమకు సమాచారం లేదని జేసీ పేర్కొన్నారు.



రిలయన్స్ భూముల్లో పర్యటిస్తున్న అనిల్ అంబానీ

అటవీ శాఖ పచ్చగా కళకళలాడాలి

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. ప్రాధాన్యత అంశాలపై దృష్టి పెట్టాలని నిర్దేశించారు. దశల వారీగా పూర్తి స్థాయి మార్పులు, చేర్పులతో అటవీ శాఖను ముందు వరుసలో నిలిపేలా పని చేయాలని పీసీసీఎఫ్, హెచ్‌వోఎఫ్‌ఎఫ్‌లను ఆదేశించారు. నూతనోత్తేజంతో, అద్భుత ప్రగతితో అటవీ శాఖ పచ్చగా కళకళలాడాలని సూచించారు. సిబ్బంది కొరత అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అటవీ భూముల పరిరక్షణకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడేలా భూములకు కంచెలు వేసి, పరిరక్షించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర సరిహద్దుల్లో నిఘా పటిష్ఠం చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. అడవుల్లో అరుదుగా లభించే నాణ్యమైన, మేలైన ఉత్పత్తుల నుంచి ఆదాయం పెంపుదలకు సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని, గిరిజనులను భాగస్వామ్యం చేసి, ఉత్పత్తుల మార్కెటింగ్‌కు కార్పొరేట్ సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు. ఆదాయమిచ్చే అరుదైన జాతుల మొక్కలను విరివిగా పంపిణీ చేయాలన్నారు. రాష్ట్రం 50 శాతం పచ్చదనం సాధించే దిశగా ముందుకు వెళ్లాలని, నగర వనాలు, ఎకో టూరిజం అభివృద్ధికి, కలప ఉత్పత్తికి పెంపుదలకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

ఇక వేగంగా వాహనాల ఫిట్నెస్ పరీక్షలు

- 25 జిల్లా కేంద్రాల్లో ఏటీఎస్‌ల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్
- విశాఖ మినహా.. అన్ని జిల్లాల్లోనూ ప్రైవేట్ కేంద్రాలు

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం, యంత్ర పరికరాల సాయంతో వాహనాల సామర్థ్య పరీక్షలు ఇక వేగంగా పూర్తికానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 25 జిల్లా కేంద్రాల్లో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల (ఏటీఎస్) ఏర్పాటుకు ప్రభుత్వం గురువారం పచ్చజెండా ఊపింది. ఇప్పటికే విశాఖపట్నంలో రవాణా శాఖ నేతృత్వంలో ఏటీఎస్ ఏర్పాటవ్వగా.. మిగతా జిల్లాల్లో ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేస్తారు. అనంతపురం, నంద్యాలలో టెండర్లు దక్కించుకున్న ప్రైవేటు వ్యక్తులు ఇప్పటికే ఏర్పాటు చేశారు. మిగతా ప్రాంతాల్లో ఏర్పాటుకు జాప్యంతో సీఎం చంద్రబాబు సమీక్షించి కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండేలా ఏటీఎస్‌లకు ఆమోదం తెలిపారు. దీంతో గురువారం రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే జీవో జారీ చేశారు. ఇప్పటికే నిర్వహించిన టెండర్లలో ఏటీఎస్ కేంద్రాలు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పదేళ్ల పాటు సొంత స్థలంలో మెషినరీ ఏర్పాటు చేసుకుని ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించాలి. మొదట రెండేళ్లు వారే ఫీజులు తీసుకుంటారు. మూడో ఏడాది నుంచి ప్రభుత్వానికి వాటా (టెండర్లలో పేర్కొన్న శాతం) చెల్లిస్తారు. వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత సర్టిఫికెట్ జారీ చేయాలి. ఒక్కో కేంద్రాన్ని సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసి కోట్లాది రూపాయల విలువైన మిషనరీతో వాహన ఫిట్నెస్ పరీక్షలు నిర్వహిస్తామని ఏటీఎస్ కేంద్రాలు దక్కించుకున్న వ్యక్తులు చెబుతున్నారు. అయితే కీలకమైన వాహనాల ఫిట్నెస్ పరీక్షలు మొత్తం ప్రైవేటుకే అప్పగించడం సమంజసం కాదని ఎంవీఐలు వ్యాఖ్యానిస్తున్నారు. 43 రకాల టెస్టులకు గానూ కేవలం ఎనిమిది పకడ్బందీగా చేసి మిగతావి అక్కడి ప్రైవేటు సిబ్బందితో చేయిస్తే ఎలా? అని ప్రశ్నిస్తున్నారు.

ఉపాధి సిబ్బందికి ఊరట

» మరో 36 మంది ఉద్యోగాల పునరుద్ధరణ

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఉపాధి సిబ్బందిలో మరో 36 మందికి ఊరట లభించింది. కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు, స్వీపర్లకు జీతాలివ్వకుండా వేధించిన గత వైసీపీ ప్రభుత్వం చివరకు వారిని ఉద్యోగాల నుంచి తొలగించినట్లు ప్రకటించింది. ఇప్పుడు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతో పీఆర్ ఇంజనీరింగ్, ఈఎన్‌సీ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించే దిశగా అధికారులు చర్యలు తీసుకున్నారు. తొలుత 519 మందిని, తర్వాత మరో 38మందిని ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. అప్పట్లో తక్కువ అర్హతలు ఉండి పోస్టులు పొందలేకపోయిన 36 మందికి ఇప్పుడు ఆఫీసు అసిస్టెంట్లుగా ఉద్యోగాలు కల్పించారు. దీనిపై ఉపముఖ్యమంత్రికి, కమిషనర్‌కు, ఉపాధి డైరెక్టర్‌కు సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు.

రీ సర్వే సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్ నంబరు

» పనిదినాల్లో 8143679222కు కాల్ చేయండి

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూముల రీ సర్వే పైలెట్ ప్రాజెక్టు అమలవుతోన్న గ్రామాల్లో రైతుల సందేహాల నివృత్తి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ నంబరు ఏర్పాటు చేసింది. రైతులకు సందేహాలు, సమస్యలు ఉంటే పని రోజుల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు 8143679222 నంబరును సంప్రదించాలని అదనపు సీసీఎల్‌ఏ, సర్వే శాఖ డైరెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈనెల 20 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 627 గ్రామాల పరిధిలో రీ సర్వే పైలెట్ ప్రాజెక్టును ప్రభుత్వం ప్రారంభించిన సంగతి తెలిసిందే. దానిపై ఎన్.ప్రభాకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటన చేస్తూ... 'రీ సర్వే సందర్భంలో యజమానులు భూమి వద్దకు వచ్చి హద్దులు చూపించేందుకు మూడుసార్లు అవకాశం కల్పిస్తాం. అప్పటికీ రైతులు రాకపోతే వీడియోకాల్ ప్రక్రియ ద్వారా హద్దుల ఖరారు ప్రక్రియను పూర్తిచేస్తాం' అని అన్నారు.

'పీఎం జన్‌మన్' కింద 76 రోడ్లు మంజూరు

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పీఎం-జన్‌మన్ పథకం బ్యాచ్-1 కింద 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 76 రోడ్ల పనులు మంజూరు చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 90 పీవీటీజీ నివాసిత ప్రాంతాల్లో రూ.275.07 కోట్లతో వీటి నిర్మాణాలు చేపట్టనున్నారు. దీనితో పాటు ఐదేళ్లలో నిర్వహణ వ్యయం కింద మరో రూ.18.76 కోట్లు మంజూరు చేస్తూ ఆదేశాలిచ్చారు.

ఫైబర్ నెట్‌లో పారదర్శకంగా నియామకాలు

» కోరితే టీటీడీకి ఉచితంగా ఫైబర్ నెట్ కనెక్షన్లు: చైర్మన్ జీవీ రెడ్డి

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): 'ఫైబర్ నెట్‌లో గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అడ్డగోలుగా నియమితులైన 600 మంది ఉద్యోగులను తొలగించాం. కొత్తవారిని పారదర్శకంగా నియమిస్తాం' అని ఆ సంస్థ జీవీ రెడ్డి తెలిపారు. విజావాయడలోని ఫైబర్ నెట్ కేంద్ర కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. 'రాజకీయాలకు తావులేకుండా, నోటిఫికేషన్‌ను జారీ చేసి, పారదర్శకంగా ఫైబర్ నెట్‌లోని ఖాళీలను భర్తీ చేస్తాం. కేబుల్ ఆపరేటర్లపై కక్షపూరితంగా 2019-24 దాకా దాదాపు రూ.100 కోట్ల దాకా వేసిన జరిమానాలు రద్దు చేస్తున్నాం. కనెక్షన్లపై వసూలు చేసిన అదనపు రెంట్లనూ రద్దు చేస్తున్నాం. ప్రతిపాదనలు వస్తే టీటీడీకి ఉచితంగా ఫైబర్ నెట్ కనెక్షన్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. జిల్లాల్లోని నెట్‌వర్క్ మేనేజర్లు, ఎగ్జిక్యూటివ్‌లలో 50% మంది మీద ఆరోపణలు రుజువైతే వారినీ తొలగిస్తాం' అని తెలిపారు. మంత్రి లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు.

121 మందికి 'బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్' అవార్డులు

» రేపు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అవార్డుల ప్రదానం

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించిన సిబ్బందికి కేంద్ర ఎన్నికల సంఘం బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్-2024 అవార్డులు ప్రకటించింది. రాష్ట్రస్థాయిలో 29 మంది, జిల్లా స్థాయిలో 92 మంది కలిపి మొత్తం 121 మంది ఈ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ సమాచారాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ గురువారం ఆయా అధికారులకు పంపారు. 25న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ అవార్డులను ప్రదానం చేస్తారు.

మైనార్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్

» రూ.40.22 కోట్లు విడుదల: మంత్రి ఫరూక్

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మైనార్టీ విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.40.22 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం మైనార్టీ విద్యార్థుల కోసం రూ.37.88 కోట్లు, క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థుల కోసం రూ.2.34 కోట్లు ట్యూషన్ ఫీజు చెల్లింపులకు ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు.

ఆస్తి పన్ను బకాయిలపై లోకాయుక్తకు ఫిర్యాదు

కర్నూలు లీగల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా వెలగపూడిలోని విట్ వర్సిటీ, నీరుకొండలోని ఎస్ఆర్ఎం వర్సిటీ ఆస్తి పన్ను బకాయిలపై పెదకాకాని మండలంలోని తక్కెళ్లపాడుకు చెందిన ఎ.చంద్రశేఖర్ లోకాయుక్తకు గతంలో ఫిర్యాదు చేశాడు. దీంతో లోకాయుక్త రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. ఆయా ప్రైవేటు విశ్వవిద్యాలయాలు ఆస్తి పన్నుల మొత్తం రూ.1,70,67,498లును ఆయా గ్రామ పంచాయతీలకు చెల్లించినట్లు గతేడాది మార్చి 2న లోకాయుక్తకు సమర్పించిన నివేదికలో కమిషనర్ తెలియజేశారు. దీంతో ఫిర్యాదును ముగిస్తూ ఉప లోకాయుక్త పి.రజనీ ఆదేశాలు జారీ చేశారు.

ఆయిల్‌ఫెడ్ ఎండీగా బాలాజీనాయక్

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఏపీ ఆయిల్‌ఫెడ్ వైస్‌చైర్మన్, ఎండీగా ఉద్యానశాఖ అదనపు డైరెక్టర్ కె.బాలాజీ నాయక్‌ను ప్రభుత్వం నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫారెన్ సర్వీస్ కింద డిప్యుటేషన్‌పై ఏడాదిపాటు ఆయన ఎండీగా ఉంటారు.

మాతృ క్యాడర్‌కు మత్స్యశాఖ కమిషనర్

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ కమిషనర్ టి.డోలా శంకర్‌ను మాతృ క్యాడర్‌కు పంపుతూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇండియన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీస్ సర్వీస్(ఐవోఎఫ్ఎస్) అధికారి అయిన డోలా శంకర్ కేంద్ర రక్షణ శాఖ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చి, మత్స్యశాఖ కమిషనర్‌గా పని చేస్తున్నారు.

స్కూల్ కాంప్లెక్స్‌లకు రూ.28.09 కోట్లు

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులకు మెరుగైన శిక్షణ, పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన, ఇతర కార్యక్రమాల నిర్వహణతోపాటు, స్కూల్ కాంప్లెక్స్‌లను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం రూ.28.09 కోట్లు విడుదల చేసింది.

తక్షణమే పీఆర్సీని నియమించాలి: ఫ్యాప్టో

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ కమిషన్‌ను తక్షణమే నియమించాలని, ధరల పెరుగుదల నేపథ్యంలో 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. విజయవాడలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై నేతలు చర్చించారు.

జెన్కో భాగస్వామ్యంతో ఎన్‌హెచ్‌పీసీ పవర్ ప్లాంట్లు

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఏపీజెన్కో, జాతీయ హైడ్రో పవర్ కార్పొరేషన్(ఎన్‌హెచ్‌పీసీ) చెరిసగం పెట్టుబడులతో రెన్యువబుల్ ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం మేరకు యాగంటిలో 1000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ, రాజుపాలెంలో 1000 మెగావాట్లు, గడికోట వద్ద 1200 మెగావాట్లు, అరవేటిపల్లిలో 1320 మెగావాట్లు, దీనేపల్లిలో 750 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లను ఎన్‌హెచ్‌పీసీ, ఏపీజెన్కో ఏర్పాటు చేయనున్నాయి.

సినీ ప్రముఖులపై

పన్ను ఎగవేత కేసు!

» ఆదాయం, పన్ను చెల్లింపు మధ్య భారీ వ్యత్యాసం

» దిల్ రాజు తల్లికి అస్వస్థత.. ఆస్పత్రికి తరలింపు



దిల్ రాజు



ఏర్నేని నవీన్



రవిశంకర్



హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని కొందరు సినీ ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాల్లో గురువారం కూడా ఐటీ సోదాలు కొనసాగాయి. మంగళవారం ఉదయం ప్రారంభమైన తనిఖీలు వరుసగా మూడో రోజూ కొనసాగాయి. కొన్ని సినిమాలకు సంబంధించి వచ్చిన ఆదాయం, ఆదాయ పన్ను శాఖకు చెల్లించిన పన్ను మొత్తంలో భారీ వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించిన ఐటీ అధికారులు కేసు నమోదు చేశారు. మూడు రోజులుగా ఐటీ అధికారులు తమ ఇంట్లో సోదాలు కొనసాగిస్తున్న క్రమంలో దిల్ రాజు తల్లి గురువారం మధ్యాహ్నం అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆమెను అధికారులు వారి వాహనంలో ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పుష్ప 2 సినిమాను నిర్మించిన మైత్రీ మూవీ మేకర్స్ వ్యవస్థాపకుడు ఏర్నేని నవీన్, ఆయన వ్యాపార భాగస్వామి యలమంచలి రవిశంకర్, ఆ సంస్థ సీఈవో చెర్రి ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు కొనసాగుతున్నాయి. దర్శకుడు సుకుమార్ ఈ సినిమాకు సంబంధించి రెమ్యునరేషన్ కాకుండా ఆదాయంలో వాటా తీసుకున్నట్లు సమాచారం అందడంతో ఆ కోణంలోనూ ఆయన ఇంట్లో సోదాలు కొనసాగుతున్నాయి. సుకుమార్‌కు చెందిన నిర్మాణ సంస్థ కూడా పుష్ప 2 నిర్మాణ భాగస్వామిగా ఉన్న క్రమంలో ఆయన ఆదాయంపైనా అధికారులు దృష్టి పెట్టారు. ఈ ఏడాది దిల్‌రాజుకు చెందిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థ నుంచి విడుదలైన గేమ్ చేంజర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలకు సంబంధించి ఆదాయ, వ్యయాలను ఐటీ అధికారులు పరిశీలిస్తున్నారు. దిల్ రాజు కుమార్తె హన్సితారెడ్డి, వారి వ్యాపార భాగస్వామి శిరీష్ ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు కొనసాగుతున్నాయి. దిల్ రాజు నుంచి పరోక్ష పెట్టుబడులు అందుకున్న మ్యాంగో మూవీస్ సంస్థలోనూ సోదాలు కొనసాగుతున్నాయి. సంస్థ యజమాని రామ్‌ను ఐటీ అధికారులు పలుమార్లు ప్రశ్నించి పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. సినీ నిర్మాణ సంస్థలకు ఆర్థిక సాయం చేసిన కొందరు ఫైనాన్షియర్ల వివరాలు, బినామీ ఖాతాల సమాచారాన్ని వారు గుర్తించినట్లు తెలుస్తోంది. భారీ పెట్టుబడితో నిర్మించే సినిమాలకు సంబంధించిన డబ్బు చాలా వరకు హవాలా రూపంలో నిర్మాణ సంస్థలకు చేరుతుందని ఐటీ అధికారులు అనుమానిస్తున్నారు.

పారితోషికం పూర్తిగా వైట్‌లోనే: వెంకటేశ్

తాను నటించే సినిమాలకు పారితోషికాన్ని పూర్తిగా వైట్‌లోనే (ఆదాయపు పన్ను లెక్కల్లో చూపించే డబ్బునే) తీసుకుంటానని ప్రముఖ సినీ హీరో వెంకటేశ్ వెల్లడించారు. తెలుగు సినీ రంగానికి చెందిన ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ సోదాలు జరుగుతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయటం గమనార్హం. ఇటీవల విడుదలైన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా విజయోత్సవ వేడుకను ఆ చిత్ర యూనిట్ గురువారం హైదరాబాద్‌లో నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా వెంకటేశ్ విలేకర్లతో మాట్లాడుతూ ఐటీ సోదాలపై స్పందించారు 'నేను మాత్రం పారితోషికం మొత్తం వైట్‌లో తీసుకుంటా. అయినా నేను తీసుకునే రెమ్యూనరేషన్ కూడా తక్కువే. అది కూడా ఆఫీసులో నేరుగా తీసుకుంటాను' అని స్పష్టం చేశారు. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. 'మేం మా సినిమాకు 'సంక్రాంతికి వస్తున్నాం' అని పేరు పెట్టామని ఐటీ అధికారులు కూడా గట్టిగా ఫిక్సయినట్టున్నారు. మేం కూడా సంక్రాంతికి వస్తున్నాం అంటూ సోదాలు మొదలుపెట్టారు' అంటూ సరదాగా వ్యాఖ్యానించారు.

కృష్ణా ట్రైబ్యునల్-2పై సుప్రీం విచారణ 13కు వాయిదా

» ఆ రోజు వాదనలకు సిద్ధంగా ఉండాలని కేంద్రం, తెలుగు రాష్ట్రాలకు ఆదేశం

న్యూఢిల్లీ/అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య కృష్ణా జలాల కేటాయింపు వ్యవహారానికి సంబంధించిన కేసు విచారణ మరోసారి వాయిదాపడింది. బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ తీర్పు, రెండు రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపులను పునఃసమీక్షించేందుకు ఆ ట్రైబ్యునల్-2 కాలపరిమితి పొడిగింపును సవాల్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ఫిబ్రవరి 13వ తేదీకి వాయిదావేసింది. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు విచారణ జరుపుతామని.. రెండు తెలుగు రాష్ట్రాలు, కేంద్రం వాదనలు వినిపించడానికి సిద్ధంగా ఉండాలని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్‌సింగ్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. వాస్తవానికి గురువారంనాటి విచారణలో బలమైన వాదనలు వినిపించేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధమైంది. అయితే పిటిషన్ విచారణకు వచ్చే అవకాశం లేకపోవడంతో ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా ధర్మాసనం ఎదుట ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతుండగానే కేటాయింపులపై విచారణకు కృష్ణా ట్రైబ్యునల్ నిర్ణయం తీసుకుందని, ఫిబ్రవరి 19 నుంచి అది విచారణ ప్రారంభించనున్న నేపథ్యంలో.. తాము గతంలోనే వేసిన రిట్ పిటిషన్‌పై వాదనలు విని తీర్పు ఇవ్వాలని కోరారు. అయితే ఫిబ్రవరి 6న గానీ లేదంటే 13వ తేదీన గానీ వాదనలు వినేందుకు ధర్మాసనం సంసిద్ధత తెలిపింది. ఈ రెండు తేదీల్లో ఒక దాన్ని ఎంచుకోవాలని గుప్తాకు సూచించింది. తనకు 6న మరో కేసు ఉందని.. అందుచేత 13కి వాయిదా వేయాలని ఆయన కోరారు. ఇందుకు ధర్మాసనం సమ్మతించింది.

గుంటూరు తూర్పు ఎమ్మెల్యేపై దాడి

» పోలీసులకు ఫిర్యాదు... కేసు నమోదు

గుంటూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్‌పై దాడి జరిగింది. నియోజకవర్గ పరిధిలోని ఒకటవ డివిజన్‌లో సుభాష్ చంద్రబోస్ సేవా మిత్ర మండలి అధ్యక్షురాలు మొవ్వా శైలజ ఆధ్వర్యంలో గురువారం నేతాజీ జయంతి వేడుకలు జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే నజీర్ అహ్మద్‌ను ఆహ్వానించారు. ఈ డివిజన్ టీడీపీ అధ్యక్షుడిగా సయ్యద్ ఇంతియాజ్ ఉన్నారు. ఆయన సోదరుడు సయ్యద్ ఫైరోజ్ గత కార్పొరేషన్ ఎన్నికల్లో ఈ డివిజన్ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. ప్రస్తుతం ఆయన నగర టీడీపీ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. జయంతి వేడుకలు వారింటికి సమీపంలోని ఆర్టీసీ కాలనీలో జరిగాయి. తమకు తెలియకుండా ఎమ్మెల్యే ప్రైవేట్ కార్యక్రమానికి హాజరు కావడంపై ఇంతియాజ్, ఫైరోజ్ సోదరులతో పాటు ఆయన సమీప బంధువు రియాజ్... వేదికపై ఉండగానే నజీర్ అహ్మద్‌ను నిలదీశారు. ఎమ్మెల్యే వారిని హెచ్చరిస్తూ చెయ్యెత్తారు. దీంతో ఫైరోజ్, ఇంతియాజ్, రియాజ్‌లు రెచ్చిపోయారు. ఎమ్మెల్యే చొక్కా పట్టుకుని చేయి చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని ఎమ్మెల్యేకు రక్షణగా నిలిచారు. కార్యక్రమ నిర్వాహకురాలు శైలజ ఫిర్యాదు మేరకు పాత గుంటూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లికాని ఆడ పిల్లలకూ పరిహారం ఇప్పించాలి

» టీడీపీ గ్రీవెన్స్‌లో పోలవరం నిర్వాసిత మహిళల విజ్ఞప్తి

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): భూసేకరణ చట్టం-2013 ప్రకారం పోలవరం నిర్వాసిత కుటుంబాల్లో 18 ఏళ్లు దాటి, పెళ్లికాని ఆడ పిల్లలకు కూడా పరిహారం ఇస్తామని చెప్పి, ఇప్పుడు పరిహారం ఇవ్వకుండా అధికారులు ఇబ్బంది పెడుతున్నారని పలువురు మహిళలు టీడీపీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. పరిహారం ఇవ్వడానికి ఉన్న సమస్యను పరిష్కరించి, తమకు కూడా నిర్వాసిత పరిహారం ఇప్పించాలని ఏలూరు జిల్లా తల్లవరం, కొండ్రుకోట గ్రామాలకు చెందిన విజయలక్ష్మి, లక్ష్మి, పరిమళ విజ్ఞప్తి చేశారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే అశోక్ రెడ్డి అర్జీలు స్వీకరించారు. '2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 6,400 మంది డ్వాక్రా సభ్యులను పశు సఖీ వర్కర్లుగా నియమించింది. గత ప్రభుత్వం అందరినీ తొలగించింది. తిరిగి విధుల్లోకి తీసుకోవాలి' అని పలువురు డ్వాక్రా సభ్యులు కోరారు. తమకు వారసత్వంగా వచ్చిన భూమిని ఆన్‌లైన్ చేయమంటే అధికారులు పట్టించుకోవడం లేదని పల్నాడు జిల్లా అచ్చంపేటకు చెందిన ఎస్ రాజు వాపోయారు. విజయవాడకు చెందిన గోవిందరావు ఫిర్యాదు చేస్తూ... 'విజయనగరం జిల్లా బంటుపల్లిలో నా తండ్రి పొలాన్ని కొనుగోలు చేసి కౌలుకు ఇచ్చారు. అధికారులు, కబ్జాదారులు కుమ్మక్కై, రికార్డుల్లో పేర్లు మార్చారు' అని వాపోయారు. '1971లో నా తండ్రి కొన్న భూమిని నాగేశ్వరరావు అనే వ్యక్తి అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నారు. దీనిపై ఫిర్యాదు చేశాను. అయినా పరిష్కారం దొరకలేదు' అని కర్నూలు జిల్లా కనకవీడుకు చెందిన ఈ వీరన్న పేర్కొన్నారు.

తిరుమలలో మరో మఠం అక్రమ నిర్మాణం!

» శ్రీవారి ఆలయాన్ని మించి కడుతున్నారని విమర్శలు

తిరుమల, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తిరుమలలో కర్ణాటకకు చెందిన బసవేశ్వర వీరశైవ విద్య వార్ధక సంఘ్ మఠం (బీవీఎస్ఎస్) శ్రీవారి ఆలయానికి మించి 18.5 మీటర్ల ఎత్తులో ఐదు అంతస్తుల భారీ కట్టడాలు చేస్తున్నారంటూ విమర్శలు చెలరేగాయి. శారదామఠం అక్రమ కట్టడాలపై కోర్టును ఆశ్రయించిన తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు తుమ్మ ఓంకార్.. సాధు పరిషత్‌కు చెందిన శ్రీనివాసనంద సరస్వతి, శివానంద స్వాతితో కలిసి గత ఆదివారం ఆయన తిరుమలలోని వీరశైవ విద్య వార్ధక సంఘ్ మఠం వద్దకు చేరుకుని కట్టడాలను పరిశీలించారు. తిరుమలలో భూకబ్జాలు, అక్రమ కట్టడాలు కళ్లముందే కనిపిస్తున్నా టీటీడీ అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీవీఎస్ఎస్ మఠం నిర్మాణాలపై విమర్శలు రావడంతో టీటీడీ స్పందించింది. 'ఈ మఠం నిర్మాణానికి 11.50 మీటర్లు మాత్రమే ఆమోదించాం. అయితే నిర్వాహకులు 18 మీటర్ల ఎత్తులో నిర్మాణాలు చేపడుతున్నారని ఓ భక్తుడు ఫిర్యాదు చేశారు' అని వెల్లడించింది. దీంతో పంచాయతీ, రెవెన్యూ కార్యాలయానికి చెందిన ఇంజనీర్, సర్వేయర్ గురువారం మఠం నిర్మాణాన్ని పరిశీలించారు. 'నిబంధనల ప్రకారం నిర్మాణం 11.50 మీటర్ల ఎత్తు ఉండాలి. అయితే 12.30 మీటర్లు ఉన్నట్లు గుర్తించాం. సంజాయిషీ కోరుతూ మఠం యాజమాన్యానికి నోటీసులిస్తాం' అని టీటీడీ వెల్లడించింది.

రంగా వర్సిటీకి అవినీతి రంగు!

» గత ఏడాది ఎన్నికలకు ముందు దోచేశారు

» సీనియర్ ప్రొఫెసర్ పదోన్నతుల్లో భారీ అక్రమాలు

» బదిలీల రద్దు, రీ-పోస్టింగ్ కోసం రూ.కోటి వసూలు

» అవుట్ సోర్సింగ్ నియామకంలో మామూళ్ల రాజ్యం

» ఆర్థిక కమిటీ అనుమతి లేకున్నా 9.50 కోట్లు బదిలీ

» 15 కోట్ల భవన నిర్మాణ నిధులలో ముడుపులు

» విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదుల వెల్లువ



గుంటూరు సిటీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు హరిత విప్లవానికి బాటలు వేసిన గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయానికి అవినీతి రంగు పులుముకుంది. గత ఏడాది జరిగిన ఎన్నికలకు ముందు.. పదోన్నతులు, బదిలీలు, కొత్త ఉద్యోగుల నియామకాల్లో నియమ నిబంధనలను బుట్టదాఖలు చేసి రూ.కోట్లు దండుకున్నట్టు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. నంద్యాలకు చెందిన ఎన్. వెంకటేశ్వరరెడ్డి, జి. వెంకటేశ్వరరావు సహా పలువురు విజిలెన్స్ డీజీ, గుంటూరు ఎస్పీకి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. విశ్వవిద్యాలయంలో జరిగిన అవినీతి, అక్రమాలను పూసగుచ్చినట్టు వివరించారు. ఖాళీల సంఖ్యతో పని లేకుండానే 30 మందికి సీనియర్ ప్రొఫెసర్(హయ్యర్ అకడమిక్ గ్రేడ్ పే) పదోన్నతులు ఇవ్వడం ద్వారా వర్సిటీలోని కీలకమైన వ్యక్తి భారీగా ముడుపులు పుచ్చుకున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఫిర్యాదులోని కీలక అంశాలు..

- గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు వర్సిటీ పరిధిలో 300మందిని బదిలీచేశారు. వారిలో కొందరి బదిలీలు రద్దు చేసేందుకు, వేరే చోటపోస్టింగ్ ఇచ్చేందుకు రూ.కోటి వరకు నగదు చేతులు మారింది.
- తిరుపతి వ్యవసాయ కళాశాలకు కేవలం 5 సూపరింటెండెంట్ పోస్టులు మాత్రమే మంజూరు కాగా, అక్కడ 14 మందిని నియమించి రూ.50 లక్షల వరకు బహిరంగంగా వసూలు చేశారు.
- వర్సిటీ ప్రాంగణంలో కొత్తగా నిర్మితమైన 'ఐఏ'-బీ భవనం ప్రారంభోత్సవం తర్వాత విశ్వవిద్యాలయం నిధుల నుంచి రూ.15 కోట్ల వరకు డ్రా చేసి, దానిలో 15 శాతం నిధులు ముడుపుల కింద(సుమారు రూ.2.25 కోట్లు) తీసుకున్నారు. దీనికిగాను వర్సిటీకి చెందిన కీలకమైన వ్యక్తి తన చెప్పు చేతల్లో ఉండే మరో వ్యక్తిని తగిన అర్హత లేనప్పటికీ ఎస్టేట్ అధికారిగా నియమించారు.
- వర్సిటీకి చెందిన రూ.9.50 కోట్ల నిధులు లాం ఫామ్‌లోని కెనరా బ్యాంకు నుంచి యూనియన్ బ్యాంకుకు మార్చారు. విశ్వవిద్యాలయ ఆర్థిక కమిటీ అనుమతి లేకుండానే ఇది జరిగిపోయింది.
- రూ.6.5 కోట్లు వర్సిటీ కంప్ట్రోలర్‌కి అప్పగించకుండా చాలా కాలంగా ఎస్టేట్ అధికారి ఖాతాలో ఉంచారు. ఇది నిబంధనలకు విరుద్ధం.
- ఇటీవల 140 వ్యవసాయ 'బీ' ఎస్సీ సీట్లు కూడా అక్రమంగా కేటాయించారు. ఈ క్రమంలో భారీగా నగదు వసూలు చేశారు.
- మహానంది వ్యవసాయ కళాశాలతో పాటు మరో ఆరు ప్రాంతాల్లో పరీక్ష పేపర్లు లీకైన వ్యవహారంలో వర్సిటీ ఉన్నతాధికారులు ఇచ్చిన విచారణ నివేదికను తుంగలో తొక్కి నిందితుల నుంచి పెద్ద మొత్తంలో సొమ్ము పుచ్చుకుని వారిని కాపాడే ప్రయత్నం చేశారు.

అన్యమత ప్రచారం..

ఎన్జీ రంగా విశ్వవిద్యాలయంలో అన్యమత ప్రచారం ఎక్కువగా జరుగుతోందని విజిలెన్స్‌కు ఇచ్చిన ఫిర్యాదులో ఎన్. వెంకటేశ్వరరెడ్డి, జి. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. వర్సిటీ కీలకమైన వ్యక్తులు కూడా వీటిలో పాల్గొంటున్నారని తెలిపారు. మధ్యాహ్నం సమయాల్లో వర్సిటీ పరిపాలనా కార్యాలయంలో ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ మతానికి చెందిన వారికి మాత్రమే అక్కడ ప్రాధాన్యత కలిగిన పోస్టులు, స్థానం ఇస్తున్నట్లు వివరించారు. గవర్నర్ అనుమతి లేకుండానే కీలకమైన అధికారి పర్యటనలు చేయటం యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధమని, దీనికి సంబంధించి రూ.లక్షలు వెచ్చించటం కూడా నేరమేనని ఫిర్యాదు చేశారు.

అదానీపై చర్యలకు వెనుకాడుతున్న బాబు: షర్మిల

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): 'తాడేపల్లి ప్యాలెస్ వేదికగా రాష్ట్రాన్ని అదానీకి దోచిపెడుతున్నారు' అని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆరోపణలు చేసిన చంద్రబాబు... ఇప్పుడు అదానీపై చర్యలకు వెనుకాడుతున్నారంటూ షర్మిల విమర్శించారు. గురువారం ఎక్స్ వేదికగా ఆమె స్పందించారు. 'అదానీతో మీకు రహస్య ఎజెండా లేకపోతే, రాష్ట్ర ప్రజల శ్రేయస్సు మీకు ముఖ్యమనుకుంటే, రూ.లక్ష కోట్ల భారంపడే అదానీ విద్యుత్ ఒప్పందాలను వెంటనే రద్దు చేయండి. ఏసీబీని రంగంలోకి దించండి' అని డిమాండ్ చేశారు.

'ఉక్కు' ప్రైవేటీకరణ జరగదు: కేంద్ర మంత్రి వర్మ

భీమవరం టౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం బీజేపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన గురువారం మాట్లాడారు. 'నష్టాల్లో ఉన్న ఉక్కును విలీనం చేసుకోవాలని సెయిల్‌ను కోరితే... ఆ కంపెనీ అభ్యంతరం వ్యక్తం చేసింది. విశాఖ ఉక్కుకు ఈ నెలాఖరులోగా ముడిసరుకు తీసుకొచ్చి ఉత్పత్తి ప్రారంభిస్తాం. ఆగస్టు నెలాఖరుకి పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి చేసి స్టీల్ ప్లాంట్‌ను నష్టాల బాటలోంచి లాభాల బాటలోకి తీసుకొస్తా. రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటిస్తే అందులో రూ.10,300 కోట్లు క్యాపిటల్ షేర్స్ కింద రూ.1,140 కోట్లు వర్కింగ్ క్యాపిటల్‌కు కేటాయించారు. ప్రైవేటీకరణ నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను మినహాయించి, ఆంధ్రుల సెంటిమెంట్ కాపాడేందుకు ఈ ప్యాకేజీ ప్రకటించారు. ఏపీ చరిత్రలో పరిశ్రమను కాపాడేందుకు ఇచ్చిన అతి పెద్ద ప్యాకేజీ ఇది. కాంగ్రెస్ నేత షర్మిల ఏమి మాట్లాడుతుందో ఆమెకే స్పష్టత లేదు' అని మంత్రి మండిపడ్డారు.

మార్చి 15 తర్వాతే ఎస్సీ వర్గీకరణపై నివేదిక!

» మరో 45 రోజుల గడువు కోరిన ఏకసభ్య కమిషన్

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ మార్చి 15 తర్వాతే నివేదికను సమర్పించనుంది. సుప్రీంకోర్టు ఆదేశాలతో దేశవ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణ కోసం వివిధ రాష్ట్రాలు ఆ ప్రక్రియ చేపట్టాయి. మన రాష్ట్రంలోనూ ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2024 నవంబరు 15న ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసి 2 నెలల్లోపు నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. కమిషన్ రాష్ట్రవ్యాప్తంగా ఆయా వర్గాల నుంచి అభిప్రాయాలను స్వీకరించింది. 13 జిల్లాల్లో దళిత సంఘాలు, మేధావులు, ఉద్యోగులను సంప్రదించింది. వారి నుంచి విజ్ఞాపన పత్రాలను స్వీకరించింది. ఎస్సీల్లోని అన్ని ఉపకులాల నేతలు, ఉద్యోగ సంఘాలతో చర్చించింది. 2024 జనవరిలో అప్పటి వైసీపీ ప్రభుత్వం చేపట్టిన కులగణన గణాంకాలను పరిగణనలోకి తీసుకుని నివేదిక ఇవ్వాలని కమిషన్ భావిస్తోంది. అయితే, అప్పట్లో చేపట్టిన కులగణన సర్వే వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో నిర్వహించడం వల్ల లోపభూయిష్టంగా ఉందని ఫిర్యాదులున్నాయి. దీంతో గ్రామ స్థాయిలో సర్వే అధికారులను నియమించి అప్పట్లో తీసిన సర్వే కచ్చితంగా ఉందో లేదో సమీక్ష చేస్తున్నారు. ఈ ప్రక్రియను జనవరి 15లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రక్రియ కూడా ఇంకా కొలిక్కి రాకపోవడంతో దానిని వేగవంతం చేసి త్వరలో కులగణన సర్వే సమీక్ష పూర్తి చేయాలని భావిస్తున్నారు. దానికి ఇంకా కొంత సమయం పట్టనుంది. ఏకసభ్య కమిషన్ నివేదిక సమర్పణకు ఇచ్చిన గడువు ఈనెల 15నే ముగిసింది. అయితే, మరో 45 రోజుల గడువు కావాలని కమిషన్ కోరింది. దానికి ప్రభుత్వం నుంచి ఇంకా స్పందన రాలేదు.

వెనుకబాటు ప్రాతిపదికనే...

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్సీల్లో ఆయా వర్గాలు ప్రభుత్వ రంగంలో అవకాశాలు పొందడంలో వెనుకబాటుతనంపైనే కమిషన్ దృష్టి పెట్టింది. ఎస్సీల్లో మాదిగలు ప్రభుత్వ ఉద్యోగాల్లో అతి తక్కువ భాగస్వామ్యం కలిగి ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా ఉద్యోగాల్లో ఎస్సీల్లోని ఏ ఉపకులానికి ఎంత మంది ఉన్నారన్న గణాంకాలు తీసి ప్రభుత్వం ముందు ఉంచనున్నారు. హరియాణాలో 2023లోనే కమిషన్ వేసి అధ్యయనం చేశారు. 2024 ఆగస్టులో సుప్రీంకోర్టు తీర్పు రాగానే అక్కడ అమలు చేశారు. విభిన్నంగా రాష్ట్రాల్లోనూ ఈ ప్రక్రియ మొదలైంది. ముందుగా ఆంధ్రలో సత్వరమే ఎస్సీ వర్గీకరణ పూర్తి చేయాలని భావిస్తున్నారు.

గదుల్లోనూ గోల్‌మాల్ గోవిందా!

(మొదటి పేజీ తరువాయి)

ఈ దందాతో టీటీడీకి కోట్లలోనే నష్టం వాటిల్లినట్లు అంచనా. తిరుమల కొండ మొత్తం ఆ దేవదేవుడికే సొంతం. అక్కడ ప్రైవేటు ఆస్తులు ఉండటానికి వీల్లేదు. అయితే... భక్తులకు అవసరమైన వసతి సదుపాయం మొత్తం టీటీడీ కల్పించలేదు కాబట్టి, దాతల నుంచి 'డోనర్ స్కీమ్' కింద విరాళాలు స్వీకరిస్తుంది. వీటి ద్వారా కాటేజీలు, గెస్ట్‌హౌస్‌లను నిర్మిస్తారు. ఖర్చు దాతలదే అయినా... కాటేజీలు మాత్రం టీటీడీకే సొంతం. బుకింగ్, నిర్వహణ మొత్తం టీటీడీయే చూసుకుంటుంది. కాటేజీలకు విరాళం ఇచ్చిన దాతలకు... మొదట్లో ఏడాదిలో 60 రోజులపాటు వారికి గానీ, వారు సూచించిన వారికి గానీ ఉచితంగా వసతి కల్పించేవారు. తర్వాత దీనిని 30 రోజులకు కుదించారు. ఇక... గెస్ట్‌హౌస్‌లు నిర్మించిన వారికి ఏటా 3 రోజులు మాత్రమే ఉచితంగా కేటాయిస్తారు. వారికి వీఐపీ బ్రేక్ దర్శనం కూడా కల్పిస్తారు. అయితే... ఇది శాశ్వతంగా ఉండే వెసులుబాటు కాదు. 20 ఏళ్లమాత్రమే దాతలకు ఈ సౌకర్యం ఉంటుంది. అదే... సంస్థల పేరిట విరాళం ఇస్తే పాతికేళ్ల ఈ సౌలభ్యం కల్పిస్తారు. ఆ తర్వాత కాటేజీలు, గెస్ట్‌హౌస్‌లు పూర్తిగా టీటీడీ పరమవుతాయి. ఒకవేళ దాత మరణిస్తే... అక్కడితోనే ఉచిత వసతి సదుపాయం కూడా ఆగిపోతుంది.

కాలం మీరి పోయినా...

తిరుమలలో డోనర్ కాటేజీలు 962.. బడా కంపెనీలు నిర్మించిన పెద్దస్థాయి గెస్ట్‌హౌస్‌లు 62 ఉన్నాయి. వీటి అద్దె రోజుకు వంద నుంచి రూ.ఆరేడువేల దాకా ఉంటుంది. కొండమీద కొలువైన గదుల మాఫియా 'డోనర్ స్కీమ్' కాటేజీలపై కన్నేసింది. 20 ఏళ్లు దాటిన దాతల సిఫారసు లేఖలు గదుల కోసం చెల్లుబాటు కావు. కానీ దానిపై ఉన్నతస్థాయిలో పర్యవేక్షణ లేదు. దీంతో... దళారులు రంగంలోకి దిగారు. కొందరు సిబ్బంది వారితో కుమ్మక్కయ్యారు. వాళ్లే సొంతంగా దాతల పేరిట లేఖలు సృష్టించి, తాము సొంతంగా అద్దెకు ఇవ్వడం మొదలుపెట్టారు. ఇలా ఒకటీ రెండూ కాదు... 200కు పైగా కాటేజీలు/గెస్ట్‌హౌస్‌లు ఐదేళ్లుగా అక్రమంగా బుక్ చేసినట్లు సమాచారం. నిజానికి.. కంపెనీలు, ప్రైవేటు దాతలు ప్రతీ సంవత్సరం జనవరిలో విధిగా టీటీడీలో తమ డోనేషన్ సర్టిఫికెట్‌ను పరిశీలన చేయించుకోవాలి. ఒకవేళ డోనర్ మరణిస్తే సంబంధిత వ్యక్తులు టీటీడీకి సమాచారం అందించాలి. కానీ... ఇవేవీ సక్రమంగా జరగడం లేదు. దీనినే అక్రమార్కులు సొమ్ము చేసుకున్నారు. కాలపరిమితి దాటిన, మరణించిన డోనర్ల పేరుతో వీళ్లే లేఖలను సృష్టించి, గదులను ఆన్‌లైన్‌లో ఫ్రీగా బుక్‌చేస్తున్నట్లుగా ఎంట్రీ చేసి, భక్తుల నుంచి సొమ్ము వసూలు చేశారు. కాటేజీల బుకింగ్‌కు, వాటి ద్వారా వస్తున్న ఆదాయానికి పొంతనలేకపోవడంతో... అసలేం జరుగుతోందని ఆరా తీయడంతో ఈ స్కామ్ బయటపడింది.

వైసీపీ వలలో పడొద్దు!

» 'డిప్యూటీ సీఎం' డిమాండ్లు పార్టీ క్రమశిక్షణ అతిక్రమణే

» అందరం అప్రమత్తంగా ఉండాలి.. టీడీపీ నేతలకు పల్లా పిలుపు

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పదవి విషయంలో వైసీపీ నేతలు చేస్తున్న ప్రచారాల వలలో పడొద్దని తమ నేతలకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. గురువారమిక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఉపముఖ్యమంత్రి పదవిని లోకేశ్‌కు ఇవ్వాలని టీడీపీ నేతలు బహిరంగంగా డిమాండ్లు చేయడం పార్టీ నియమావళిని అతిక్రమించడమే. మన పార్టీకి ఒక క్రమశిక్షణ ఉంది. దానిని మీరవద్దు. లోకేశ్ శక్తిసామర్థ్యాలు అందరికీ తెలుసు. నాయకత్వం ఒక పద్ధతి ప్రకారం వెళ్తుంది. దీనిపై బహిరంగ చర్చ పెట్టొద్దు.. కూటమి పార్టీల మధ్య విభేదాలు సృష్టించడానికి వైసీపీ నేతలు కాలకేయుల మాదిరిగా ఎదురు చూస్తున్నారు. వివాదంలోకి లాగడానికి ప్రయత్నిస్తున్నారు. నేతలందరూ అప్రమత్తంగా ఉండాలి. వైసీపీ వలలో పడకుండా చూసుకోండి' అని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి కేంద్రం నుంచి రూ.13వేల కోట్ల సాయం తేగలిగామని తెలిపారు. రెండేళ్లు పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడిస్తే సెయిల్‌లో విలీనం చేయించడానికి సిద్ధం అని చెప్పారు. యువనేత లోకేశ్ వల్ల టీడీపీలో యువోత్సాహం వచ్చిందని అన్నారు. 'రాష్ట్రానికి ప్రపంచస్థాయి కంపెనీలను ఆకర్షించడానికి లోకేశ్ శక్తిమేరకు ప్రయత్నిస్తున్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా ఎదుగుతున్నారు' అని పల్లా ప్రశంసించారు.

డిసెంబరుకల్లా డయాఫ్రం వాల్ పూర్తి చేస్తాం

» ఇది సగం పూర్తికాగానే ఈసీఆర్‌ఎఫ్ డ్యాం మొదలు: నిమ్మల


పోలవరం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. గురువారం ఆయన ప్రాజెక్టును సందర్శించారు. నూతన డయాఫ్రం వాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. 'డయాఫ్రం వాల్ పనులు సగం పూర్తవగానే ఈసీఆర్‌ఎఫ్ డ్యాం పనులు మొదలుపెడతాం. ఫిబ్రవరి 1నాటికి రెండో కట్టర్ పని ప్రారంభిస్తుంది. మూడో కట్టర్ ఏప్రిల్ నాటికి వస్తుంది. నిర్వాసితులకు న్యాయం జరిగేలా ప్రాజెక్టు నిర్మాణంతో పాటే సమాంతరంగా పునరావాస కాలనీలు నిర్మిస్తాం. పోలవరం నిర్మాణం 2027 కల్లా పూర్తిచేస్తాం' అని తెలిపారు. మరోవైపు.. నూతన డయాఫ్రం వాల్ నిర్మాణంలో భాగంగా ప్లాస్టిక్ కాంక్రీటు పనులు గురువారం ప్రారంభమయ్యాయి.

జగన్ మాదిరిగా చంద్రబాబు సాకులు చెప్పలేదు

» దావోస్ పర్యటనపై టీడీపీ వ్యాఖ్య

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులను, పారిశ్రామిక సంస్థలను ఆకర్షించడానికి సీఎం చంద్రబాబు మైనస్ డిగ్రీల చలిని కూడా లెక్కచేయకుండా దావోస్ పర్యటనకు వెళ్లారు. వైసీపీ నేత జగన్ మాదిరిగా చలి గురించి సాకులు చెప్పలేదు' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ 'ప్రపంచ ఆర్థిక సంస్థ దావోస్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ స్థాయి సమావేశాలకు ఎందుకు వెళ్లలేదంటే నాటి ముఖ్యమంత్రి చలి అని సాకులు చెప్పారు. ఒకే ఒకసారి వెళ్లి అక్కడ టెంట్లో కూర్చుని పాస్తా తిని తిరిగి వచ్చారు. చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ విరామం లేకుండా అనేక మందితో సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాల గురించి ప్రచారం చేశారు. తాను చేయలేని పని చంద్రబాబు చేస్తున్నారన్న ఉక్రోషంతో జగన్, ఆయన బృందం బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు. జగన్ బురద చల్లడం ఒక్కదానినే నమ్ముకోకుండా వాస్తవాలను గుర్తించే ప్రయత్నం చేస్తే మంచిది' అని రామయ్య అన్నారు.

వారసత్వం ఒక్కటే అన్నీ ఇవ్వలేదు!



మెరుగైన అవకాశాలు రావొచ్చు.. వాటినెలా అందిపుచ్చుకుంటారన్నదే ముఖ్యం

33 ఏళ్ల కిందట కుటుంబ వ్యాపారానికి శ్రీకారం.. అందులో ఉంటే లోకేశ్‌కు సులభంగా ఉండేది

కానీ ప్రజలకు సేవ చేయాలని రాజకీయాల్లోకి వచ్చారు.. ఇందులో వారసత్వం లేనేలేదు: చంద్రబాబు

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో చంద్రబాబుకు వారసుడు ఎవరు..? దావోస్‌లో మీడియా ప్రతినిధుల నుంచి ఎదురైన ఈ ప్రశ్నకు ఆయన నేర్పుగా సమాధానమిచ్చారు. 'ఇండియా టుడే' ప్రతినిధి ఆయన్ను ఇంటర్వ్యూ చేసిన సందర్భంలో ఈ ప్రశ్న వచ్చింది. రెండ్రోజుల ముందు ఇదే అంశంపై మంత్రి టీజీ భరత్ వ్యాఖ్యలు చేసి ముఖ్యమంత్రితో అక్షింతలు వేయించుకున్నారు. రెండ్రోజుల తర్వాత మళ్లీ ఇదే ప్రశ్న ఎదురైంది. లోకేశ్ మీ వారసుడేనా.. వారసుడే అయితే పార్టీ పగ్గాలు ఎప్పుడు అప్పగిస్తారని అడుగగా.. ఆయన సూటిగా జవాబివ్వకుండా గతంలో చెప్పిన మాటలే పునరుద్ఘాటించారు. 'వ్యాపారం, సినిమాలు, రాజకీయం, కుటుంబం.. ఏ రంగంలో అయినా వారసత్వం అనేది మిథ్య. ఒక తరం వ్యాపార రంగంలో రాణించి బాగా సంపాదిస్తే తర్వాతి తరం దానిని పోగొట్టవచ్చు. మన దేశంలో ఒకప్పుడు బలమైన పార్టీలుగా ఉన్నవి తర్వాత కనుమరుగైపోయాయి. వారసత్వం ఒక్కటే అన్నీ నిలబెట్టలేదు. దానివల్ల కొన్ని మెరుగైన అవకాశాలు వస్తాయి. వాటినెలా అందిపుచ్చుకుంటారన్నది ముఖ్యం. సరైన పద్ధతిలో అందుకుంటేనే రాణించగలుగుతారు. నేనెప్పుడూ జీవనోపాధి కోసం రాజకీయాలపై ఆధారపడలేదు. 33ఏళ్ల కిందట కుటుంబ వ్యాపారం ప్రారంభించాను. నా కుటుంబసభ్యులు దానిని నిర్వహిస్తూ వచ్చారు. అదే వ్యాపారంలో కొనసాగితే లోకేశ్‌కు చాలా తేలిగ్గా ఉండేది. కానీ తను ప్రజలకు సేవ చేయాలన్న ఆలోచనతో రాజకీయాల్లోకి వచ్చారు. అందులో ఆయనకు సంతృప్తి లభిస్తోంది. ఇందులో వారసత్వం ఏమీ లేదు' అని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్రంలో చేరే ఆలోచన తనకు లేనే లేదని, రాష్ట్రంలోనే ఉంటానని స్పష్టం చేశారు. ప్రతిభ, పనితీరుతోనే లోకేశ్ వారసుడిగా ఎదగాలి తప్ప తన కొడుకు అన్న ఒకే ఒక్క కారణంతో వారసుడు కాలేడన్న అభిప్రాయం చంద్రబాబు మాటల్లో ధ్వనించిందని టీడీపీ సీనియర్ నేతలు చెబుతున్నారు.

గతంలో ఇలా..

టీడీపీలో వారసత్వంపై గతంలో కూడా కొన్నిసార్లు చర్చ జరిగింది. ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో.. 1987 మండల పరిషత్ ఎన్నికల ప్రచారంలో ఆయన, ఆయన కుమారుడు బాలకృష్ణ పాల్గొన్నారు. ఇద్దరికీ భారీ జన సమూహాలు వచ్చాయి. ఆ ఆనందంతో ఆయన ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఒక సభలో తన రాజకీయ వారసుడు బాలకృష్ణేనని ప్రకటించారు. కానీ హైదరాబాద్ తిరిగి వచ్చిన తర్వాత పార్టీ నేతల సలహాతో ఆ అభిప్రాయం మార్చుకున్నారు. తాను అటువంటి ప్రకటన ఏదీ చేయలేదని మీడియాతో చెప్పారు. ఆయన ప్రకటన చేసిన చోట జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఓడిపోవడం విశేషం. అలాగే 2014 ఎన్నికలకు ముందు నందమూరి హరికృష్ణ తమ కుటుంబంలో వారసత్వం గురించిన చర్చ లేవనెత్తారు. తన కుమారుడు జూనియర్ ఎన్టీఆర్‌ను రాజకీయ వారసుడిగా ప్రకటించాలని చంద్రబాబుపై గట్టి ఒత్తిడి తెచ్చారు. కానీ ఆయన అటువంటి ప్రకటన చేయడానికి అంగీకరించలేదు. ఇప్పుడు అనుకోకుండా టీడీపీలో ఇదే చర్చ మరోసారి మొదలైంది. కానీ ప్రారంభంలోనే చంద్రబాబు అడ్డుకట్ట వేయడంతో అది చల్లారిపోయింది.

మళ్లీ 'ఏపీ' బ్రాండ్

(మొదటి పేజీ తరువాయి)

దావోస్ సదస్సులో ఏపీ దాదాపు ఉనికి కోల్పోయింది. రాష్ట్రం నుంచి సరిగా ప్రాతినిథ్యమే లేదు. రాష్ట్రం నుంచి కంపెనీలను వెళ్లగొట్టడమే పనిగా నాడు జగన్ ప్రభుత్వం అనుసరించిన విధానాలు కొత్త పెట్టుబడులకు ఉన్న అవకాశాలను మృగ్యంచేశాయి. దీంతో 2022లో ఒకసారి నాటి సీఎం జగన్ దావోస్ సదస్సుకు వెళ్లినా, ప్రతిస్పందన శూన్యం. కూటమి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన తొలి దావోస్ సదస్సులో మళ్లీ ఏపీ బ్రాండ్ మెరిసింది. రాష్ట్రానికి పెట్టుబడులను, కంపెనీలను ఆకర్షించే లక్ష్యంతో 20న స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్ ఎయిర్‌పోర్టులో చంద్రబాబు, మంత్రులు లోకేశ్, భరత్ అడుగుపెట్టారు. వారికి ప్రవాసులు స్వాగతం పలకగా, వారిని ఉద్దేశించి వారు మాట్లాడారు. ఈ సమయంలో చంద్రబాబు భావోద్వేగానికి గురయ్యారు. ఎయిర్‌పోర్టును నిర్మించిన నిర్మాణ సంస్థ ప్రతినిధులు సహా పలువురు పారిశ్రామికవేత్తలు హోటల్‌లో చంద్రబాబును కలిసి చర్చించారు. అదే రాత్రి దావోస్‌కు చంద్రబాబు, మంత్రులు చేరుకున్నారు. దావోస్ పెవిలియన్లలో వరస సమావేశాలతో చంద్రబాబు.. లోకేశ్ ఆ మూడురోజులూ గడిపారు. గ్రీన్, క్లీన్ ఎనర్జీకి ఏపీ గమ్యస్థానంగా మారిన తీరును దిగ్గజ కంపెనీలకు చెప్పి, సానుకూల స్పందనను రాబట్టారు. హైడ్రోజన్ హబ్... డేటా సెంటర్లు...గూగుల్ క్లౌడ్ విస్తరణ.. వర్క్‌ఫ్రమ్ హోమ్‌కు పరిశ్రమ హోదా.. ఇలా రాష్ట్రం తొక్కుతున్న కొత్త పుంతలను దావోస్ వేదికపై పరిచయం చేశారు. స్విస్‌మెన్, ఓర్లికాన్, ఆంగ్స్ ఫిస్టర్, స్విస్ టెక్స్‌టైల్స్ యాజమాన్యాలతో చంద్రబాబు బృందం వరుస సమావేశాలు నిర్వహించింది. రాష్ట్రంలో రీసెర్చిసెంటర్ ఏర్పాటుకు స్విస్‌మెన్ సంస్థ ముందుకొచ్చింది. ఇన్నోవేషన్ హబ్‌లు, ఇంక్యుబేటర్లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. అడ్వాన్స్ కోటింగ్ సొల్యూషన్ సెంటర్‌స ఏర్పాటుకు ఓర్లికాన్ మొగ్గుచూపింది. ఏఐ సెంటర్ల ఏర్పాటుపైనా ఈ సంస్థ ఆసక్తిని చూపింది.

ఆరోగ్యం, విద్యలో కొత్త ఆవిష్కరణలు

అడ్వాన్స్ సీలింగ్ సొల్యూషన్ ప్లాంట్‌ను ఏపీలో ఏర్పాటు చేయాలని ఆంగ్స్ ఫిస్టర్ సంస్థను చంద్రబాబు కోరారు. దీనిపై ఆ సంస్థ సానుకూలత వ్యక్తం చేసింది. రిసెర్చి టెక్స్‌టైల్ యూనిట్ ఏర్పాటుకు స్విస్ టెక్స్‌టైల్స్ కంపెనీ ముందుకొచ్చింది. ప్రపంచంలోనే అదిపెద్ద సముద్రయాన రంగ సంస్థ మార్క్స్ సంస్థ.. ఏపీలోని సముద్రతీరం పట్ల ఆసక్తి చూపింది. త్వరలోనే పర్యటనకు వస్తామని ఆ సంస్థ యాజమాన్యం హామీ ఇచ్చింది. విశాఖ, తిరుపతిలో కార్యకలాపాలను ప్రారంభించాలన్న చంద్రబాబు ఆహ్వానానికి 'సిస్కో' సానుకూలంగా స్పందించింది. తిరుపతి, విశాఖలో సెమికండక్టర్ యూనిట్లను స్థాపించే విషయమై త్వరలో నిర్ణయం తెలుపుతామని దక్షిణ కొరియాకు చెందిన ఎల్జీ కెమ్ సంస్థ సీఈవో షిన్‌హక్ చియోల్ తెలిపారు. కార్ల్స్‌బెర్గ్ గ్రూప్ రాష్ట్రంలో పండ్ల రసాలు, శీతల పానీయాలు, బీర్లు, ప్యాకేజి డ్రింకింగ్ వాటర్ ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు సానుకూలత ప్రదర్శించింది. చంద్రబాబుతో గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ సమావేశమయ్యారు. విశాఖలో.. అమరావతిలో గూగుల్ డిజైన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని చంద్రబాబు కోరగా, కురియన్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రాన్ని పెట్రోలియం హబ్‌గా మార్చే దిశలో భాగస్వాములమవుతామని పెట్రోనాస్ పేర్కొంది. రాష్ట్రంలో పెప్సికో ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు చైర్మన్ స్టీవెన్ కెహో సంసిద్ధత వ్యక్తం చేశారు. ఆరోగ్య, విద్యారంగాల్లో కొత్త ఆవిష్కరణలకు ఏపీని కేంద్రంగా మార్చే అంశాన్ని మిలిందా గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌ను కలిసి చంద్రబాబు చర్చించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ హెల్త్ ఇన్నోవేషన్ డయాగ్నోస్టిక్స్‌ను నెలకొల్పేందుకూ, ఏఐ వర్సిటీ ఏర్పాటు చేసేందుకు బిల్‌గేట్స్ సమ్మతి తెలిపారు. హిందుస్థాన్ యూనీలీవర్, టాటా సన్స్ గ్రూప్ చంద్రశేఖరన్‌లతో చంద్రబాబు సమావేశాలు సానుకూలంగా ముగిశాయి.

దావోస్ నుంచి ఢిల్లీకి చంద్రబాబు

న్యూఢిల్లీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు సమావేశాలకు హాజరైన సీఎం చంద్రబాబు గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఢిల్లీకి చేరుకున్నారు. సాయంత్రం 4.30కు జ్యూరిక్ నుంచి బయలుదేరి ఢిల్లీ విమానాశ్రయానికి ఆయన చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా వన్ జన్‌పథ్‌లోని తన అధికారిక నివాసానికి చేరుకున్నారు. ఆయన శుక్రవారం ఉదయం కేంద్ర మంత్రులతో భేటీ అయ్యే అవకాశం ఉంది. కేంద్ర బడ్జెట్ సమావేశాలు మొదలవుతున్న నేపథ్యంలో కేంద్ర మంత్రులు నిర్మాలా సీతారామన్, శివరాజ్ సింగ్ చౌహాన్, ప్రహ్లాద్ జోషిని ఆయన కలుస్తారని తెలుస్తోంది. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు ఢిల్లీ నుంచి బయలుదేరి సాయంత్రం నాలుగు గంటలకు అమరావతిలోని ఉండవల్లి నివాసానికి చంద్రబాబు చేరుకుంటారు.



హెచ్‌సీఎల్ సీఈవో కల్యాణ్ కుమార్‌తో చర్చిస్తున్న మంత్రులు లోకేశ్, భరత్, తదితరులు



అపోలో టైర్స్ చైర్మన్ నీరజ్ కన్వర్‌తో లోకేశ్



హెన్‌కెన్ సీఈవో డెన్ బ్రింక్‌ను సత్కరిస్తున్న లోకేశ్, పక్కన కేంద్ర మంత్రి రామ్మోహన్, మంత్రి టీజీ భరత్, ఎంపీ సీఎం రమేశ్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్

ఆంధ్ర ఈజ్ బ్యాక్!

ఇది చెప్పడానికే దావోస్ వచ్చాం: లోకేశ్

» రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటే భయపడే పరిస్థితులు ఇప్పుడు లేవు

» 'సీఎన్‌బీసీ' ఇంటర్వ్యూలో ఐటీ మంత్రి వెల్లడి

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల విధ్వంస పాలన తర్వాత ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం ఏడు నెలల క్రితమే మొదలైందని రాష్ట్ర ఐటీ, మానవవనరుల మంత్రి లోకేశ్ అన్నారు. దావోస్‌లో సీఎన్‌బీసీ చానల్‌కు ఆయన ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. దావోస్‌కు రావడం వెనుక ప్రధానోద్దేశం 'ఆంధ్ర ఈజ్ బ్యాక్' అని చెప్పడమేనని తెలిపారు. జగన్ ఐదేళ్ల ఏలుబడిలో పెట్టుబడులు పెట్టాలంటే భయపడే పరిస్థితులు నెలకొన్నాయని, ఇప్పుడా పరిస్థితులు లేవని చెప్పడానికే ఇక్కడకు వచ్చామన్నారు. 'సన్ రైజ్ స్టేట్ ఏపీలో పెట్టుబడులకు అన్ని సానుకూలతలూ ఉన్నాయి. పెట్టుబడుల కోసం మేం పొరుగు రాష్ట్రాలతో కాకుండా పొరుగుదేశాలతో పోటీ పడుతున్నాం' అని చెప్పారు. గత ఐదేళ్లలో జరిగిన నష్టాన్ని ఎలా అధిగమించబోతున్నారని అడుగగా.. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడంలో తమ ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంచి అనుభవం ఉందని, ఆ దిశగా ఇప్పటికే ఆయన ప్రయత్నాలు ప్రారంభించారని లోకేశ్ సమాధానమిచ్చారు. ప్రతికూలతలన్నీ అధిగమించి రాబోయే పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పాటునివ్వడంలో రాష్ట్రం ముందుంటుందనడంలో అనుమానం లేదన్నారు. రాజధాని అమరావతి పనులు కూడా ఊపందుకుంటున్నాయని, ఇప్పటికే టెండర్లు పిలవడం పూర్తయిందని, ఫిబ్రవరి 1 నుంచి రాజధాని ప్రాంతంలో పనులు ఊపందుకుంటాయని వివరించారు. మరో మూడేళ్లలో కోర్ కేపిటల్ సిద్ధమవుతుందని చెప్పారు.

ఏఐ వినియోగంపై ప్రధాన దృష్టి

రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించేందుకు కృత్రిమ మేధ (ఏఐ)ను విస్తృతంగా వినియోగించడంపై దృష్టి సారిస్తున్నామని లోకేశ్ తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం.. ఇలా అన్ని రంగాల్లో ఏఐని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. 'సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీది అద్భుతమైన కలయిక. రాష్ట్రాభివృద్ధికి ఇదెంతో దోహదపడనుంది. రాబోయే మూడు నెలల్లో విశాఖకు సంబంధించి డేటా సిటీ లాంటి భారీ ప్రకటనలు రానున్నాయి. ఈ డేటా సిటీ ప్రపంచంలోనే అతి పెద్దదిగా నిలువనుంది. డేటా సెంటర్ల వంటివి ఎన్నో రానున్నాయి. రాష్ట్ర తీరప్రాంతాన్ని సద్వినియోగం చేసుకోవడంలో భాగంగా షిప్ బిల్డింగ్ యూనిట్లపై దృష్టి సారించాం. కొరియన్ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతున్నాం. వచ్చే ఆరు నెలల్లో అవి కార్యరూపం దాలుస్తాయి' అని లోకేశ్ తెలిపారు.

కాగ్నిజెంట్ వస్తోంది!

త్వరలోనే శుభవార్త: లోకేశ్

దావోస్‌లో ఆ సంస్థ సీఈవోతో భేటీ

పుట్టినరోజునా వరుస భేటీలు

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు కాగ్నిజెంట్ టెక్నాలజీస్ సిద్ధంగా ఉందని, త్వరలోనే ఆ కంపెనీ నుంచి శుభవార్త వస్తుందని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవవనరుల శాఖల మంత్రి లోకేశ్ ప్రకటించారు. గురువారం దావోస్‌లో ఆయన కాగ్నిజెంట్ సొల్యూషన్స్ సీఈవో ఎస్.రవికుమార్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న సానుకూలతలను వివరించారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాన్ని కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటమ్ కంప్యూటింగ్, బయోటెక్నాలజీ, రెన్యువబుల్ ఎనర్జీలో డీప్ టెక్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. విశాఖ, విజయవాడ, తిరుపతిలో 2.2 మిలియన్ చదరపు అడుగుల కో-వర్కింగ్ స్పేస్ అందుబాటులో ఉందని.. కాగ్నిజెంట్ గ్రోత్ స్ట్రాటజీ, ప్రాంతీయ విస్తరణ ప్రణాళికల్లో భాగంగా విశాఖపట్నం వంటి టైర్-2 నగరాల్లో కార్యకలాపాలు ప్రారంభించాలని సూచించారు. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటివాటిలో అత్యున్నత నైపుణ్యం ఉన్న పనివారిని తయారుచేయడానికి తమ ప్రభుత్వంతో భాగస్వామి కావాలని కోరారు. రవికుమార్ స్పందిస్తూ.. కాగ్నిజెంట్‌లో పనిచేస్తున్న 80 వేల మంది ఉద్యోగులను టైర్-1 నగరాల నుంచి టైర్ -2 నగరాలకు మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, ఏపీలోని టైర్-2 నగరాలపైనా దృష్టి సారించామని, తప్పకుండా రాష్ట్రానికి వస్తామని హామీ ఇచ్చారు. కాగా.. గురువారం లోకేశ్ జన్మదినం. ఆయన పుట్టిన రోజు వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ శ్రేణులు భారీ ఎత్తున నిర్వహించుకుంటున్న సమయంలో ఆయన మాత్రం దావోస్‌లో రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చే పనిలో నిమగ్నమయ్యారు. పుట్టిన రోజున కూడా ఉదయం నుంచే పారిశ్రామికవేత్తలతో భేటీలు నిర్వహిస్తూ రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అనుకూల పరిస్థితులను వివరించే కార్యక్రమంలో తలమునకలయ్యారు. ఆయన కృషిని ఇతర రాష్ట్రాల ప్రతినిధులు అభినందించారు.

ఏడున్నర లక్షల మందికి ఉపాధి లక్ష్యంతో..

గ్రీన్ హైడ్రోజన్ రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించి, ఏడున్నర లక్షల మంది యువతకు ఉపాధి కల్పించే దిశగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని లోకేశ్ అన్నారు. ఎన్విజన్ సీఈవో లీ జంగ్‌తో ఆయన సమావేశమయ్యారు. ఏపీలో రెన్యువబుల్ ఎనర్జీ(ఆర్‌ఈ) పరికరాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సానుకూల నిర్ణయం తీసుకుంటామని లీజంగ్ ఆయనకు హామీ ఇచ్చారు.

ఐరోపా మార్కెట్‌కు కనెక్ట్ చేయండి

ట్రేడ్ అండ్ ఎకనమిక్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్ (టెపా) ద్వారా ఏపీ తయారీదారులు ఐరోపా మార్కెట్‌కు అనుసంధానమయ్యేలా సహకరించాలని లోకేశ్ స్విట్జర్లాండ్‌కు చెందిన కాంటన్ ఆఫ్ వాడ్ స్టేట్ కౌన్సిలర్ క్రిస్టెల్లా లూసియర్ బ్రాడర్ట్‌ను కోరారు. క్రిస్టెల్లా స్పందిస్తూ.. స్విస్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తామన్నారు.

ఏపీ పట్ల దిగ్గజ కంపెనీల ఆసక్తి..

అపోలో టైర్స్ వైస్ చైర్మన్-మేనేజింగ్ డైరెక్టర్ నీరజ్ కన్వర్, ప్రపంచ ఆర్థిక ఫోరం (డబ్ల్యూఈఎఫ్) న్యూ ఎకానమీ ఆపరేషన్స్ హెడ్ శ్రీరాం గుత్తా, హైనెకెన్ సంస్థ సీఈవో డెన్ బ్రింక్‌లతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో కొత్త టైర్ల తయారీ యూనిట్ పెట్టాలని లోకేశ్ కోరగా.. నీరజ్ కన్వర్ సంసిద్ధత వ్యక్తంచేశారు. విద్యారంగానికి గ్లోబల్ పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీకి సాయంపై శ్రీరాం గుత్తా సానుకూలత కనపరిచారు. బీర్ల తయారీ, ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్‌ఎంసీజీ) రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు డెన్ బ్రింక్ మొగ్గుచూపారు.

హెచ్‌సీఎల్ విస్తరణతో మరో 10 వేల మందికి ఉపాధి: సీఈవో కల్యాణ్

ఆంధ్రప్రదేశ్‌లో హెచ్‌సీఎల్ సేవలను విస్తరించి, మరో 10వేల మందికి ఉపాధి కల్పిస్తామని ఆ సంస్థ సీఈవో కల్యాణ్‌కుమార్ మంత్రి లోకేశ్‌కు స్పష్టం చేశారు. ఏపీలో విస్తరణపై దృష్టి సారించాలని లోకేశ్ కోరగా, ఏపీలో సంస్థ విస్తరణ ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు.

విశాఖ టెక్‌హబ్‌గా మారనుంది: లోకేశ్

విశాఖపట్నం ఇంటర్నెట్ సీ కేబుల్స్‌తోపాటు డేటా సెంటర్లు, ఏఐ, ఇతర డీప్‌టెక్ వెంచర్లతో విశాఖపట్నం కొత్త టెక్నాలజీ హబ్‌గా మారనుందని మంత్రి లోకేశ్ వెల్లడించారు. దావోస్‌లో ఏఐ ఎనర్జీ ఇంపాక్ట్ సదస్సులో ఆయన మాట్లాడారు. భారతదేశంలో ఏఐ మార్కెట్ 2030 నాటికి 28.3 బిలియన్ డాలర్లకు పెరుగుతుందన్నారు. ఏఐ ప్రాధాన్యతను గుర్తించిన ఏపీ 7వ తరగతి నుంచి 9వ తరగతి వరకు పాఠ్యాంశాల్లో ఏఐని ప్రవేశపెట్టాలని నిర్ణయించిందన్నారు. దేశంలోనే తొలి ఏఐవర్సిటీ ఏపీలో ఏర్పాటు చేయనున్నట్లు లోకేశ్ తెలిపారు.

మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కులు ఏర్పాటు చేయండి

సప్లయ్ చైన్, లాజిస్టిక్, ఇన్‌ఫ్రా రంగాల్లో పేరెన్నికగన్న బహుళజాతి సంస్థ ఎజిలిటీ వైస్ చైర్మన్ తారిఖ్ సుల్తాన్‌ను లోకేశ్ కలిశారు. ఏపీలో లాజిస్టిక్స్, మౌలిక వసతుల రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. విశాఖ లేదా తిరుపతిలో గ్లోబల్ సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ప్రతిపాదనలను తప్పనిసరిగా పరిశీలిస్తామని సుల్తాన్ హామీ ఇచ్చారు. కాగా.. బసవతారకం కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌తో కలిసి కేన్సర్ వైద్య పరిశోధనల్లో పాలుపంచుకోవాలని 'కేరింగ్ క్రాస్' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బోరో డ్రోపులిక్‌ను లోకేశ్ ఆహ్వానించారు. కేన్సర్ వైద్య పరిశోధనలు, అభివృద్ధికి సహకరించాలని.. తద్వారా రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించే అవకాశం కలుగుతుందని తెలిపారు.

500 కోట్లు ఎక్కడ?

(మొదటి పేజీ తరువాయి)

లబ్ధిదారులను మోసం చేసినట్టుగా... అనధికార లేఅవుట్ క్రమబద్ధీకరణ పేరిట పట్టణవాసులను జగన్ సర్కారు ముంచేసింది.

2020లో దరఖాస్తులు: మున్సిపాలిటీల్లో అడ్డగోలుగా వేసుకున్న లేఅవుట్లను రెగ్యులరైజ్ చేస్తామంటూ 2020లో జగన్ ప్రభుత్వం పట్టణ పేదలకు ఎర వేసింది. ఇందుకోసం లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ తెచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 5.71 లక్షల ఎకరాల్లో 10,745 లేఅవుట్లు అనధికారికంగా వేశారని అధికారులు గుర్తించారు. ఈ లేఅవుట్లను క్రమబద్ధీకరించడం ద్వారా భారీగా ఫీజు వస్తుందని అప్పటి ప్రభుత్వం భావించింది. 2020 జనవరిలో రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తులను ఆహ్వానించగా సుమారు 43,759 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు సర్కార్ పలు దఫాలు గడువు కూడా పెంచింది. ఫీజు రూపంలో సుమారు రూ.500 కోట్లు దాకా వసూలు చేసినట్లు సమాచారం.

ఆ సొమ్ములెక్కడ?

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులు వచ్చాక పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తూ కోర్టుకు వెళ్లారు. దీంతో హైకోర్టు లేఅవుట్ల రెగ్యులరైజేషన్ ఎన్ని దఫాలు చేపడతారని ప్రశ్నించింది. ఒకసారి తప్పు చేస్తే సవరించుకునే అవకాశమివ్వాలే కానీ, ప్రతి దఫా రెగ్యులరైజేషన్ చేసుకుంటూ పోతే దానికి అంతు ఎక్కడుంటుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. తప్పు చేసేందుకు ప్రభుత్వమే అనుమతి ఇచ్చినట్లవుతుందని, లేఅవుట్ల క్రమబద్ధీకరణ చేయడం తగదని కోర్టు స్పష్టం చేసింది. దీంతో వైసీపీ సర్కార్ ఈ ప్రక్రియపై అడుగు ముందుకు వేయలేకపోయింది. అయితే వసూలు చేసిన ఫీజును దరఖాస్తుదారులకు వాపసు చేయలేదు. ఫీజు వెనక్కి ఇవ్వాలని యజమానులు పలు దఫాలు మొరపెట్టుకున్నా వైసీపీ సర్కార్ పట్టించుకోలేదు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో వసూలు చేసిన సొమ్ము సుమారు రూ.500 కోట్లు ఎక్కడకు వెళ్లాయో తెలియని పరిస్థితి. ఇటు దరఖాస్తుదారులకు ఇవ్వలేదు. అటు ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వారీగా వచ్చిన సొమ్మును తిరిగి వాటికి పంపలేదు. కొన్ని కార్పొరేషన్లకు, మున్సిపాలిటీలకు రుణం ఇచ్చినట్లు నాటి పాలకులు చెబుతున్నారు. అయితే మొత్తం రూ.500 కోట్లలో ఏయే సంస్థలకు ఎంత మేర రుణాలు ఇచ్చారు? మిగిలిన సొమ్ము ఏమైంది వంటి లెక్కలు మాత్రం లేవు.

ఓటీఎస్ పేరిటా వసూళ్లు

జగనన్న శాశ్వత గృహ హక్కు పథకమంటూ వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పేరిట.. పేదలు ఎప్పుడో నిర్మించుకున్న ఇళ్లకు హక్కులు కల్పిస్తామంటూ గత ప్రభుత్వం డబ్బులు వసూలు చేసింది. లబ్ధిదారుల నుంచి రూ.10 వేల నుంచి రూ.30 వేల దాకా ముక్కుపిండి గుంజుకుంది. అప్పట్లో పేదలు అప్పులు చేసి, డ్వాక్రా గ్రూపుల నుంచి రుణం తీసుకుని మరీ ప్రభుత్వానికి చెల్లించారు. ఆ ఇళ్లకు శాశ్వత హక్కు కల్పించి రుణాలు పొందేందుకు హక్కు పత్రాలిస్తామని గత ప్రభుత్వం చెప్పింది. చివరకు ఆ పత్రాలు నాలుక గీసుకోను కూడా పనికిరావని బ్యాంకర్లు చెప్పడంతో పేదలు అవాక్కయ్యారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.



IN THEATRES
FROM JAN 31ST
GEMINI FILM CIRCUIT PRESENTS VISHAL IN
మదగజరాజ
SUNDAR C
VIJAY ANTONY
RICHARD M. NATHAN
PRAVEEN K L - SREEKANT N B | VENKATT RAGAVAN | SHASHANK VENNELAKANTI | GURURAJ
SUPER SUBBARAYAN | BRINDA - SHOBI | R.P. BALAGOPI | V. RAJAN | K. MOHAN | VAMSI SHEKAR | SINDHU GRAFIX
A SATHYA KRISHNAN PRODUCTIONS RELEASE